Chandavarkar, Narayen G.
(Narayen Ganesh), Sir, 1855-1923

క్రొత్త ఇండియా

మదరాస్, 1921

Record no. 479

Chandavarkar, Narayen G.
(Narayen Ganesh), Sir, 1855-1923

Krotta Iṃḍiyā

Madarās, 1921

Record no. 479

Bibliographic Record Target

Chandavarkar, Narayen G. (Narayen Ganesh), Sir, 1855-1923.

క్రొత్త ఇండియా : దేశపరిపాలనలో చేసిన సంస్కారముల భావము / సర్ నారాయణ చంద్రవార్కర్ రచించినది.- మదరాస్ : మదరాస్ ప్రకటన సంఘము, 1921.

46 p. ;25 cm.

Record no. 479

Chandavarkar, Narayen G. (Narayen Ganesh), Sir, 1855-1923.

Krotta Iṃḍiyā : dēśaparipālanalō cēsina saṃskāramula bhāvamu Sar Nārāyaṇa Candravārkar raciñcinadi.- Madarās : Madarās prakaṭana Saṅghamu, 1921.

46 p. ;25 cm.

Record no. 479

35 mm microfilm

Image placement: IA IIA IB IIB   Date filming began:

క్రొత్త ఇండియా

దేశపరిపాలనలో చేసిన సంస్కారముల భావము.

సర్ నారాయణ చంద్రవార్కర్ రచించినది.

"ఆక్స్ఫర్డ్ యూనివర్సిటి ప్రెస్" అనుమతిని
మదరాస్ ప్రకటన సంఘమువారు ముద్రించినది.

1921

[P.B.L. No. 110.] [TELUGU.

అధ్యాయముల పట్టిక.

ఉపోద్ఘాతము.

దేశపరిపాలనలో చేసిన సంస్కారములవల్ల క్రమక్రమముగా సంపూర్ణమయిన ప్రజాస్వామిక ప్రభుత్వము ఎట్లు ఏర్పడునో, ఎట్లు బ్రిటిషు సామ్రాజ్యములో మన దేశస్థులు భాగస్వాములు కాగలరో, సుబోధముగా ఈ వ్యాసములో తెలుపుటకు ప్రయత్నించినాను.

ఈస్టిండియా కంపనీవారి కాలమునుండి ఇండియా రాజ్యవ్యవస్థ ఎట్లు పరిణమించినదో సంగ్రహముగా జాడలు నిరూపించినాను.

ఎన్ని ఆటంకములు వచ్చినను రాజ్యవ్యవస్థ ప్రతిదశలోను ప్రజాస్వామిక ప్రభుత్వమునకు అనుకూలముగా ఎట్లు మారుచువచ్చినదో చూపించి అట్టి ప్రభుత్వమునకు ప్రథమపాదముగా ఇప్పటి సంస్కారము ఎట్లు చేయవలసివచ్చినదో స్పష్టపర్చుటకు ఉద్యమించినాను.

రెండు ఉద్దేశములతో ఈ వ్యాసము రచించినాను: 1. ఈ సంస్కారముల స్వరూపము, వాటి ఘనత చూపించి, ప్రజాస్వామిక ప్రభుత్వము ఎట్లు అభివృద్ధిపొంది స్థిరపడునో బోధించుట మొదటిది; 2. ఈ సంస్కారములు సఫలమగునట్లు వ్యవహారము నడిపించవలసిన విధానము విమర్శించి ఉపదేశించుట విహితధర్మముగాని, పక్షపాతబుద్ధితో శుష్కవాదములు చేసి, కక్షికలహములు పెంచి, వృథాప్రయాసపడుట మంచిపనికాదని స్వదేశములోని జనులకు—ముఖ్యముగా పడుచువాండ్లకు—బోధించి ఉత్సాహము పుట్టించుట రెండవ ఉద్దేశము.

పెద్దేర్ రోడ్డు, కుంబల్లకొండ,
బొంబాయి,
1920 వ సం॥ ఏప్రిల్ 24 వ తేది.

యన్. జి. చంద్రవార్కర్.

క్రొత్త ఇండియా.

దేశపరిపాలనలో చేసిన సంస్కారముల భావము.

మొదటి అధ్యాయము.

నవీన యుగము.

కొత్తగా కొన్ని మార్పులు చేసి ఈ దేశపరిపాలనను సంస్కరించినారు. ఆ సంస్కారము ఎటువంటిదో చదివేవారికి తెలిసేలాగున స్పష్టముగా వ్రాస్తున్నాను. ఈ సంస్కారము వచ్చే సంవత్సరము, అనగా 1921 వ సం॥ ఆరంభములోనే అమలులోనికి వచ్చును. మనచక్రవర్తులయిన శ్రీ అయిదవ జార్జి చక్రవర్తిగారి పెద్దకొమాళ్లు శ్రీ ప్రిన్స్ ఆఫ్ వేల్జ్‌గారు తమ తండ్రిగారి తరఫున సంస్కారప్రతిష్ఠ చేయుటకు మన దేశము విజయంచేస్తారు.

2. ఈ కొత్తసంస్కారము ఎట్టిది? దానివల్ల దేశమునకు కలిగే మేలు ఏమి? ప్రజలకు ఏమి లాభము కలుగును? దేశములోని జనసామాన్యమునకు, రయితులకు ముఖ్యముగా బీదలకు ఎట్టి మేలు కలుగును? మనము దేశాభిమానము గలవారము; బ్రిటిషు సామ్రాజ్యముతో చేరిన పౌరులము; ఈ సంస్కారము చక్కగా నెరవేర్చి, దానివల్ల కలుగవలసిన మేలు అంతా కలిగేటట్టున్ను, క్రమక్రమముగా ఈ సంస్కారము సార్థకమయి సఫలమయ్యేటట్టున్ను చేయవలసిన భారము మనమీద నున్నది; మనకు కర్తవ్యమేమిటి?

3. ఇవి ముఖ్యముగా విచారించవలసిన విషయములు. ఇవి తేటమాటలతో విశదపరచుటకు ప్రయత్నము చేస్తాను. ఈ సంస్కారము ఏ ఉద్దేశముతో చేసినారో దాని ప్రయోజనమేమిటో సంక్షిప్తముగాను సామాన్యముగాను ముందుగా తెలియజేసి ఈపుస్తకములో ఉత్తరభాగమునందు ఈ సంస్కారస్వరూపమును సవిస్తరముగా నిరూపించి దానివల్ల కలిగే ప్రయోజనములను వివరించి చెప్పదలచినాను. సంస్కారములోని ముఖ్యవిషయములు ముందుగా పేర్కొని ఒకొక్కటి వివరించిచెప్పుటకన్న ఆలాగున చేస్తేనే అన్ని విషయములున్ను లెస్సగా బోధపడగలవు.

4. గతసంవత్సరము నవెంబరు నెలలో శ్రీచక్రవర్తిగారి ఆజ్ఞాపత్రమును ప్రకటించినారు. మన దేశమందున్న ప్రజలందరికిన్ని (రాజులకు, రయితులకు) శ్రీవారు అనుగ్రహపూర్వకముగా పంపిన సందేశము అందులో ఉన్నది. ఈ కొత్తసంస్కారము మూలముగా ఈ దేశమునకు నవీనయుగము ప్రారంభించునని శ్రీవారు తమ సందేశమందు సెలవిచ్చినారు.

౫. ఈ నవీనయుగము ఏమిటి? నవీనయుగమంటే కొత్తయుగము. మనదేశపు రాజ్యవ్యవస్థ (అనగా ఏలుబడి కట్టుబాటు) మార్చినారు. ఇప్పటిదాకా ఆచరణలో ఉన్నదానికన్న ఇటుపయిని అమలులోనికి రాబోయే కొత్తవ్యవస్థ మేలయినది. ఈవిషయమై పార్లమెంటు సభవారు కొత్తశాసనము చేసినారు గనుకను, కొత్తశాసనము వచ్చే సంవత్సర

మునుండి అమలులోనికి వచ్చును గనుకను, రాబోయే కాలము "నవీనయుగ" మని శ్రీచక్రవర్తిగారు సెలవిచ్చినారు. ఈ కొత్తశాసనములో కొత్తసంస్కారము నిరూపితమై ఉన్నది. శ్రీచక్రవర్తిగారు ఈశాసనము అంగీకరించి దానిమీద తమ రాజముద్ర వేసినారు. ఇట్లు సహీచేసి శ్రీవారు రాజాజ్ఞ మనదేశమందు ప్రకటింపించినారు. "దేశమునకు ఎక్కువ శ్రేయస్కరముగాను ప్రజలకు ఎక్కువ తృప్తికరముగాను ఉండేటట్లు రాజ్యవ్యవస్థ సంస్కరించి శాసనము చేసినా" మనిన్ని ఆ సంస్కారమువల్లను ఆ శాసనమువల్లను ఈ దేశమున కొత్తయుగము ప్రారంభమగుననిన్ని శ్రీవారు ఇండియా దేశస్థులకు తెలియజేసినారు.

6. అది ఎట్లు అని మీరు అడుగుదురు.

7. నేను వివరించి చెప్పెదను.

8. ఏ ఉద్దేశముతో ఇంగ్లీషువారు మనదేశమును పాలిస్తున్నారో, ఏ ఉద్దేశము గురియందుంచుకొని పాలించడము విహితధర్మమో, ఇండియాదేశమున ఇంగ్లీషువారి పరిపాలనము స్థాపించినది మొదలుకొని అప్పుడప్పుడు బ్రిటిషు రాజ్యనీతి ప్రవర్తకులు బహిరంగముగా తెలియపర్చి వక్కాణించి ఉన్నారు. వారు సామాన్యులుకారు; చాలాపూచీ గల రాజ్యాధికారమును వహించినవారు; ఇంగ్లండులోనే ప్రధాన మంత్రిగా ఉన్నవారు; మంత్రివర్గము (Cabinet) లో చేరినవారు; ఇండియా దేశమందు రాజప్రతినిధి (వైస్రాయి)గాను, మండలములో గవర్నరుగాను, మరి ఒకవిధమైన అధికారిగాను ఉన్నవారు. ఇట్టివారు బహిరంగముగా వక్కాణించినది పొల్లుమాటకాదు. ఇండియా దేశస్థులను రాజ్యవ్యవహారమందు తర్ఫీయతుచేసి, తమ దేశపరిపాలనము తామే నిర్వహించుకోగలిగేటట్లు చేయడమే ఇంగ్లీషు ప్రభుత్వమువారి ఉద్దేశమనిన్ని వారికి ఉండవలసిన ఉద్దేశము కూడా అదే అనిన్ని వారందరున్ను తెలియబర్చినారు. అట్టి మహానుభావులందరినీగాని అనేకులనుగాని పేర్కొనవసరములేదు. ఇద్దరు ముగ్గురు అధికారస్థులను మాత్రము ఉదాహరిస్తాను. సర్ టామస్ మన్రోగారు మొదట జిల్లా కలెక్టరుగా నుండి క్రమక్రమముగా ఒక మండలమునకు గవర్నరయినారు. ఆయన ఏలుబడిలో ప్రజలందరున్ను, అందులో ముఖ్యముగా రయితులు తృప్తిపొంది సుఖపడ్డారు. ప్రజలయెడల ఆయనకు, ఆయనయెడల ప్రజలకు, అనురాగముండేది; ప్రజలు ఆయనను తండ్రిగా భావించి, "మన్రో బాబు" అనేవారు. 120 ఏండ్లక్రిందట ఆయన వ్రాసినదానిలో "ఇండియా దేశము అల్పకాలము మాత్రమే తమ స్వాధీనమందుంచుకొని విడిచిపెట్టవలసినదిగా ఇంగ్లీషువారు ఎంచుకోకూడదు; ఇండియాదేశస్థులు తెలివిగలవారై క్రమమయిన రాజ్యవ్యవస్థ ఏర్పరచుకొని స్వయముగా నిర్వహించుకొనే సామర్థ్యముగలవారయ్యేదాకా ఇంగ్లీషువారే ఇండియాదేశమును కాపాడవలెను," అని తమ ఉద్దేశమును తెలియజేసి ఉన్నారు. ఇట్లే సర్ జాన్ మాల్కమ్‌గారు వ్రాసిఉన్నారు. వీరు మొదట ఇండియామధ్యప్రదేశమందు అధికారస్థులుగా ఉండి, తర్వాత అంతకన్న గొప్ప ఉద్యోగముచేసి, ప్రజారంజకులయినవారు. శ్రీ విక్టోరియా రాణీగారికి ప్రధానమంత్రిగా ఉండిన గ్లాడ్‌స్టన్‌గారి ఉద్దేశముకూడా అదే. "ఇంగ్లీషువారు ఇండియా దేశమును పరిపాలించడములో, ఇండియా దేశస్థులను తమతో చేర్చుకొంటూ, పట్టుదలతో వారిని తర్ఫీతుచేస్తూ, తమదేశము తాము స్వయముగా ఏలుకోగలవారినిగా చేయవలసినది" అని వారున్ను చెప్పినారు.

9. ఈలాగున కొందరు తమతమ అభిప్రాయములు తెలియజేసినారు; గాని ఇట్టి ఉద్దేశము ఇంగ్లీషు ప్రభుత్వమువారు గురియందు ఉంచుకోవలసినదనిన్ని, స్వయంపరిపాలనము ఇండియాదేశస్థులకు పరమావధి అనిన్ని, ఇంగ్లీషు గవర్నమెంటువారు ఇంతవరకున్ను శాసనము చేసిఉండలేదు. ఇంతెందుకు? బ్రిటిషు పార్లమెంటువారున్ను శ్రీచక్రవర్తిగారున్ను బ్రిటిషు సామ్రాజ్యమందు సర్వాధికారము గలవారు; వారు అంగీకరించి చట్టము చేస్తేనేకాని ఏదిన్ని ప్రమాణముకాదు; వారు ఈ ఉద్దేశము శాసనముచేసి ప్రకటించి ఉండలేదు. అయితే, ఈ సంవత్సరము పార్లమెంటువారు చేసిన శాసనమందు పీఠికలో ఈ ఉద్దేశము స్పష్టముగా వ్రాసిఉన్నది; శ్రీచక్రవర్తిగారుకూడా ఈశాసనము అంగీకరించినారు. ఇంతకు పూర్వము ఈ విషయమై జరిగిన చర్చలో ఇట్టి ఉద్దేశము కలదని కొందరున్ను లేదని కొందరున్ను వాదించిఉన్నా, ఇటుపైని మరి సందేహించుటకు అవకాశములేదు. ఈ కొత్తశాసనము మూలముగా ఇండియా దేశమున గొప్పదశ ప్రారంభించును. క్రమక్రమముగా ఈ దశలో ప్రజలపక్షమున ప్రజలే ప్రజాపరిపాలనము చేసుకొనే ప్రభుత్వము ఏర్పడుతుంది.

10. ఈ కారణముచేతనే ఇకను రాబోయేకాలము "నవీనయుగ" మనిన్ని, ఇండియా దేశమునకు "మునుపటికన్న ఎక్కువ శ్రేయస్కరముగాను, ప్రజలకు ఎక్కువ తృప్తికరముగాను, ఇండియాదేశ ప్రభుత్వము ఉండును" నిన్ని శ్రీ చక్రవర్తిగారు సెలవిచ్చినారు. ఆ వాక్యముయొక్క అర్థమేమంటే—ఇండియా దేశస్థులకు స్వయంపరిపాలనాధికారమందు ప్రవేశము కలుగజేతుమని ఇంగ్లీషు గవర్నమెంటువారు, ఇండియాదేశము తమఏలుబడిలోనికి వచ్చినతర్వాత, ఇప్పుడు మొదటిసారి యథావిధిగా చేసిన శాసనముచేత, బద్ధులయినారు. ఇప్పటిదాకా ఇండియా దేశమును ఇంగ్లీషు అధికారులే పరిపాలిస్తూ, తాము చెలాయించిన అధికారమునుగురించి బ్రిటిషు పార్లమెంటువారికిన్ని శ్రీచక్రవర్తిగారికిన్ని మాత్రమే జవాబుదార్లుగా ఉన్నారు. అయితే, కొత్తశాసనము చొప్పున "నవీనయుగము"లో, ఇండియా దేశమందు రాజ్యవ్యవహారము మునుపటికన్న చక్కగా జరిగేటట్లు స్వయంపరిపాలనాధికారమందు ప్రజలకు ప్రవేశము కలుగుతుంది; గనుక నమ్మదగినవారిని అధికార్లుగా ప్రజలే నియోగించి, వారిని తమకే (అనగా, ప్రజలకే) జవాబుదార్లుగా ఉండేలాగున తమకు కలిగిన అధికారము సార్థకముగా చెలాయించుటకు మొదలుపెట్టవచ్చును.

11. ఈ పుస్తకము చదువుతున్నవారు ఈ సందర్భమున సాజముగా అడుగదలచే విషయమొకటి ఉండవచ్చును: ఇంగ్లీషు ప్రభుత్వమువారు ఇండియాదేశము పాలించుటకు మొదలుపెట్టి చాలాకాలమయినదిగదా; శ్రీచక్రవర్తిగారున్ను బ్రిటిషుపార్లిమెంటువారున్ను ఇప్పుడు చేసిన శాసనమువంటి శాసనము ఇంతకుముందే ఎందుకు చేయలేదు? ఇప్పుడు అవలంబించిన ప్రథమోపాయము చాలాకాలముక్రిందటనే మొదలుపెట్టి మనకు సంపూర్ణ స్వయంపరిపాలనాధికారమందు ప్రవేశము ఎందుకు కలుగజేయలేదు?

12. అని అడిగితే, అందుకు సమాధానముగా మనదేశ చరిత్రలో ప్రాచీన కాలము మొదలుకొని నేటివరకున్ను స్పష్టముగా కనబడుతున్న రెండు ముఖ్యవిషయములు జ్ఞప్తికి తెచ్చి వివరించవలసిఉన్నది.

13. ఈ రెంటిలో మొదటివిషయము ఏమంటే—వేదములు పుట్టినకాలము మొదలుకొని ఇప్పటిదాకా ఇండియాదేశమంతా ఒక్క చక్రవర్తి ఏలుబడిలో ఉండి, ఒక్క రాజ్యముగా ఏర్పడవలెనన్న ఉద్దేశమున్నట్లున్ను అందుకుగాను ప్రయత్నము చేయుచున్నట్లున్ను కనబడుతున్నది. అయితే యీప్రయత్నము సిద్ధిపొందుట అరుదయినది. క్రీ. పూ. 300 (అనగా 2,200 సంవత్సరముల క్రిందట) బౌద్ధమతస్థుడయిన అశోక చక్రవర్తి ఏలుబడిలో ఇండియాదేశముయొక్క అభిలాషచొప్పున కొంతకాలము జరిగినది గాని, ఆ చక్రవర్తి గతించిన పిమ్మట అతడు స్థాపించిన సామ్రాజ్యము వికలమయి, తిరిగీ చిన్నచిన్న రాజ్యములేర్పడి ఒకటితోనొకటి పోరాడు

చుండినవి. హిందూమతస్థులకు జగద్గురువులయిన శ్రీశంకరాచార్యులవారికి కూడా ఇండియా దేశమంతా ఒక్క చక్రవర్తికి లోబడి, వ్యవహారములో ఏకరాజ్యమయి బాగుపడవలెనన్న వాంఛ సాజముగానే కలిగినది; అది యోగ్యమైనదే. ఆచార్యులవారు బౌద్ధమతము దేశమందు కనబడకుండా నిర్మూలముచేసి, అంతటా హిందూమతము తిరిగీ నెలకొల్పి మతవిషయములో తాము ఐక్యము కలిగించినట్లే, ఒక్క చక్రవర్తి రాజ్య వ్యవహారమందు ఐక్యము కలిగించి, ఇండియా దేశస్థులందరినీ ఒక్క ప్రజాసంఘముగా చేయవచ్చుననుకొన్నారు ; గాని, ఆయనకోరిక గొంతెమకోరికయినది; ఆ కోరిక ఆయనకాలములో నెరవేరలేదు సరిగదా ఆయన యీలోకము విడిచినపిమ్మట కొన్ని శతాబ్దములకైనా సిద్ధించలేదు. అటుపిమ్మట మొగలులనే విదేశస్థులు ఇండియాదేశము ఆక్రమించుకొని తమ సామ్రాజ్యము స్థాపించినారు ; గాని దేశములోనున్న ప్రజలందరినిన్ని లోబర్చుకొని, దేశమంతా తమస్వాధీనము చేసుకోకపూర్వమే మొగలుల రాజ్యము శిథిలమయి ఇంగ్లీషువారి స్వాధీనమయినది. ఈప్రకారముగా విచ్ఛిన్నమయిన ఇండియా దేశమందు వేరువేరు భాగములలో వేరువేరు జాతులుగాను, తెగలుగాను, కులములుగాను, విడిపోయి ఉన్న జనులందరినిన్ని ఒక్క రాజ్యవ్యవస్థకు లోబర్చి, ఒక్క రాజ్యములోని ప్రజలుగా కలుపుటకు ఇంగ్లీషు ప్రభుత్వమువారు ఇప్పటిదాకా పాటుపడుతూనే ఉన్నారు. రాజ్యములో నున్న ప్రజాసంఘమందు ఇట్టి ఐకమత్యము కుదిరితేనేగాని ప్రజలకు స్వయంపరిపాలనాధికారమందు ప్రవేశము కలుగజేయుట సాధ్యముకాదు గదా.

14. ఇండియా దేశస్థులకు స్వయంపరిపాలనాధికారము ఇచ్చుటకు ఇప్పటిదాకా మొదలుపెట్టకపోవడమునకున్ను, నవీన యుగము ఇప్పటిదాకా పొడచూపకపోవడమునకున్ను సమాధానముగా వివరిస్తానని చెప్పిన రెండు విషయములలో ఇది ఒకటి.

15. ఇకను రెండవ విషయము తెలియజేస్తాను.

16. ఇంగ్లీషువారు తమప్రభుత్వము ఇండియాలో స్థాపించిన తర్వాత ముందుగా ప్రజల ప్రాణము ధనము భద్రపర్చి, దేశమును నిరుపద్రవముగాచేసి, ప్రజలను క్రమప్రకారము నడిపించే కట్టుబాట్లు ఏర్పర్చవలసివచ్చినది. అంతకుమునుపు దేశమందంతటా ప్రజలు క్షోభపడి, దీనులయి పోయినారు. చాలాకాలము అన్యదేశస్థులు ఈ దేశమును ఆక్రమించుకొని ఉన్నందున, ఐకమత్యమేమీలేక దేశము విచ్ఛిన్నమయి, అనేకమయిన చిన్న రాష్ట్రములుగా ఏర్పడి, పరస్పర కలహములచేత క్షీణించి ఉన్నందున, ఇంగ్లీషు ప్రభుత్వమువారు ప్రజలకు అభయమిచ్చి, విశ్వాసము, ధైర్యము పుట్టించి, నెమ్మది కలుగజేసి, వికలమై ఉన్న దేశమందు మరల ఐకమత్యము నెలకొల్పవలసివచ్చినది : స్థిరమయిన కట్టుబాట్లు ఏర్పర్చి, యథాన్యాయముగా పరిపాలిస్తూ, ప్రజల హక్కులను సొత్తులను కాపాడవలసివచ్చినది. ఇట్లు ప్రభుత్వమువారికి విహితమైన ప్రథమకృత్యములు నెరవేర్చుటకు మొదలుపెట్టి, తర్వాత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయములు, స్థాపించి, ప్రజల బుద్ధి వికసించేటట్లు చేసినారు. అందువల్ల ఇంగ్లీషువారి నీతిధర్మములు, వాటిమూలసూత్రములు, వాటిఅంతఃశక్తులు ఈ దేశమందు అందరున్ను గ్రహించగలిగినారు. ఇంగ్లీషువారు నిరంకుశాధికారము సహించేవారుకారని, వ్యవస్థ ననుసరించి రాజ్య వ్యవహారము నడిపించేవారని, దేశముయొక్క స్వాతంత్ర్యమునకు హానికలుగనివ్వరని, దేశములో ప్రతివారియొక్క స్వత్వమును కాపాడవలసినవారని, దేశసేవాతత్పరులని, అత్యంత దేశాభిమానము కలవారని, ఈ దేశస్థులు తెలుసుకొని, తాముకూడా అట్టివారు కావలెనని కోరుతున్నారు.

17. ఇంగ్లీషువారు మనదేశమందు తమ ప్రభుత్వము స్థాపించినది మొదలు నేటివరకున్ను చేసిన పని ఎంతసార్థకమయినదో దానిఫలము బట్టి తెలుసుకోవచ్చును. దాని ప్రభావమువల్ల మనదేశము వాస్తవముగా కొత్తదేశమయినది. ఈ కొత్త ఇండియా ఇంగ్లీషువారు సృజించినదని చెప్పవచ్చును. ఈకొత్తఇండియా మునుపటివలె సాధారణ లోకయాత్రతో తృప్తిపొందదు. దేహబలమందు, మనోబలమందు, జ్ఞానమందు, బుద్ధియందు, నాగరికతయందు, స్వాతంత్ర్యమందు తక్కిన దేశములతో తానున్ను సమానము కావలెనని కోరుతున్నది ; కొత్తఇండియాలోని ప్రజలకు తమదేశము స్వతంత్రముగా చేసుకొని, తమదేశమునకు కావలసిన వ్యవస్థ ఏర్పర్చుకొని, దాని ననుసరించి తామే పాలించుకొనుటకు హక్కుగలదు అనిన్ని, ఇంగ్లీషువారి పాలనమువల్ల కలిగిన నూతనోత్సాహముతో ప్రాచీన భారతధర్మములను యథోచితముగా అవలంబించి, ప్రజలే తమదేశము తాము వృద్ధిపర్చుకోవలెననిన్ని వాదిస్తున్నది.

18. ఇకను, వచ్చే నొవెంబరు నెల మొదలుకొని అమలులో పెట్టబోయే కొత్త సంస్కారముయొక్క ముఖ్యప్రయోజనమున్ను ముఖ్యోద్దేశమున్ను రెండు వాక్యములలో తెలియజేస్తాను.

19. మొదటిది,—ఇండియాదేశస్థులు బ్రిటిష్‌సామ్రాజ్యములో సమాన భాగస్వాములు కాగలందులకు ఇచ్చే స్వయంపరిపాలనాధికారముయొక్క ప్రారంభదశ ఎట్టిదో ఈ సంస్కారము నిరూపిస్తున్నది.

20. రెండవది,—ఈ ప్రారంభదశను నిరూపిస్తూ చేసిన సంస్కారమువల్ల స్పష్టముగా ప్రకటితమైన విషయమేమనగా ఇండియా దేశస్థులకు స్వయంపరిపాలనాధికారము ఇచ్చే ఉద్దేశము వాస్తవమయినది ; స్వయంపరిపాలనమనగా ప్రజలే పరిపాలించడము ; ప్రజలనగా, ఏదో ఒక జాతివారే అనిగాని ఒక మతమువారే అనిగాని, ఒక వర్గమువారే అనిగాని, నియమము లేకుండా, దేశమందంతటా నివసించి ఉన్న అన్ని జాతులవారున్ను, అన్ని మతములవారున్ను, అన్ని వర్గములవారున్ను, పల్లెటూళ్లలో ఉన్నవారున్ను, రయితులున్ను, పట్టణములలో ఉన్న పనివాళ్లున్ను, పరమనీచులు కూడాను.

ఈ సంస్కారము ఎట్టిదో బాగా ఆలోచించి మనస్సులో భావించుకొని, దానివల్ల దేశమునకు ఎంత మేలు కలుగుతుందో తెలుసుకోండి. ఇటుపైని ఒక్క మనుష్యుడు నిరంకుశాధికారి అయి, తన చిత్తము వచ్చినట్లు మంచి ఉద్దేశముతోనయినా, మన దేశమందు అధికారము చెలాయించలేడు. ప్రత్యేకము ఒక్క జాతివారుగాని, ఒక్క కులమువారుగాని దేశమునకు మరి ప్రభువులుగా ఉండలేరు. దేశమును పాలించే అధికార్లు ఇటుపైని ప్రజాసంఘమే ; అనగా, మినహాయింపు ఏమీ లేకుండా, దేశమందున్న సమస్త జనమున్ను. ఇట్టి మహాదశ పరమావధిగా గురియందుంచుకొని, పరంపరాభివృద్ధిగా ప్రజలు ప్రవర్తించేటట్టు ఈ నూతనసంస్కారమువల్ల ప్రోత్సాహము కలుగగలదు. ఇది ఆరంభదశ—నవీన యుగమందు ప్రథమ పాదము. ఏపనిదైనా చక్కగా మొదలుపెట్టితే, సులువుగా సిద్ధి పొందవచ్చును. సరియయిన తోవలో మొదటి అడుగు పడితే, సగముదూరము ప్రయాణము సాగినట్లే అని సామెత కలదు.

---

2 వ అధ్యాయము.

ప్రథమ పాదము.

బ్రిటిష్ సామ్రాజ్యములో ఇండియాదేశస్థులు సమానభాగస్వాములయి స్వయం పరిపాలనాధికారము సంపాదించుట పరమావధి అనిన్ని, తమ్ము తాము పాలించుకొనే అధికారము కొంత కలిగించిన ఈ కొత్తసంస్కారమువల్ల ఆ పరమావధి చేరుటకు ప్రవేశము కలిగినదనిన్ని మొదటి అధ్యాయములో చెప్పినాను.

2. ఈ సందర్భములో ఈ పుస్తకము చదివేవారికి ఒక విషయమును గురించి జిజ్ఞాస సాజముగా కలుగవచ్చును : శ్రీ చక్రవర్తిగారున్ను పార్లమెంటువారున్ను స్వయంపరిపాలనాధికారమందు మన దేశస్థులకు ప్రవేశము మాత్రమే కలుగజేసి ఊరకున్నారేమి ? సంపూర్ణ స్వయంపరిపాలనాధికారము ఇప్పుడే ఎందుకిచ్చినారు కారు ? ఆ ఉన్నతపదవి క్రమక్రమముగా చేరవలసినదేగాని ఒక్కదాటున చేరవలసినది కాదని వారెందుకంటున్నారు ?

3. ఈ ప్రశ్నలకు జబాబు చెప్పవలసి ఉన్నది. ఈదేశపు రాజ్యవ్యవస్థలో చేసిన సంస్కారమువల్ల ఏర్పడ్డ ఈ మొదటిదశ నిజముగా దేశమునకు ఉపకారకమయినదని నేను చెప్పే జబాబునుపట్టి తెలుసుకోవచ్చును.

4. ఇది చదివేవారు ముందుగా ఒక సంగతి జ్ఞప్తియందుంచుకోవలెను. ఇప్పుడు చేసిన సంస్కారము రాజ్యవ్యవస్థాసంస్కారము.

5. రాజ్యవ్యవస్థాసంస్కారమనగా ఏమి ?

6. ఒక్కొక దేశమును ఒక్కొకవిధమైన రాజ్యవ్యవస్థను అనుసరించి రాజ్యాధికారులు పరిపాలించుట మామూలు. ఆ రాజ్యవ్యవస్థ చక్కబర్చుటకు చేసిన మార్పే రాజ్యవ్యవస్థాసంస్కార మనిపించుకొంటుంది.

7. రాజనీతి అనేది ఒకవిధమైన వ్యవస్థ ; ఒకవిధమైన నిర్మాణము ; కట్టుబాటు : వివిధములయిన అంగములు గల ఒక వస్తువు కట్టడమువంటిది. ఇట్టి నిర్మాణమునకు సాదృశ్యముగా మనకు తెలిసిన మానవశరీరనిర్మాణము పేర్కొనవచ్చును. మానవశరీరములో అనేక భాగములు అవయవములుగా ఉన్నవి. ఈ అవయవములు అన్నీ ఒకదానితో ఒకటి పొందేటట్టు ఉంటేనేకాని పరిపూర్ణమయిన శరీరముకాదు. ప్రతి అవయవమున్ను తక్కినవాటితో కలిసి ప్రవర్తించుటచేత శరీరమున కంతటికీ ఆరోగ్యమున్ను బలమున్ను కలుగును. అట్లుకాక, అవయవములు పరస్పరవిరుద్ధముగా ప్రవర్తిస్తే, శరీరమునకు రోగము వచ్చి మనుష్యుడు చచ్చిపోవును.

8. మరి ఒకసంగతి ఆలోచించండి. మనుష్యుడు శైశవ దశనుండి బాల్యదశలోనికిన్ని, బాల్యదశనుండి యౌవన దశలోనికిన్ని, మారినప్పుడు వాని శరీరము మెల్లగా, దినదినము, క్రమక్రమముగా, పెరిగి అభివృద్ధిపొందును ; గాని, ఒక్కమారే హఠాత్తుగా ఎదుగదుగదా. మానవశరీరనిర్మాణములో ఈలాగున క్రమక్రమముగా కలిగేమార్పు దేహవ్యవస్థాపరివర్తన మనిపించుకొంటుంది. ఈ పరివర్తనము కొంచెము కొంచెముగా, క్రమక్రమముగా, అన్ని అవయవములలోను పరస్పరసంబంధము ననుసరించి కలుగుతూ, యుక్తసమయమున దేహమును పరమావధిని పొందించి, అభివృద్ధిచేయును ; గనుక, అవయవములన్నిటితోకూడా దేహమునకు స్థిరమైన "సంస్థ" (లేక) "వ్యవస్థ" ఏర్పడుతుంది. అందుచేతనే మానవదేహములో కలిగే మార్పులకు వ్యవస్థాపరివర్తనము అని

పేరు పెట్టినాము. మెల్లగా నెమ్మదిగా క్రమక్రమముగా జరిగే సంస్కారమువల్ల ఇది కలుగును అని తెలుసుకోవచ్చును.

9. గవర్నమెంటుకూడా మానవదేహమువలె నిర్మాణము కలిగి ఒకవిధమైన వ్యవస్థగా ఉన్నది ; గనుక, దానికికూడా వ్యవస్థ అనేపేరు కలదు. గవర్నమెంటు అనగా దేశము పరిపాలించుటకు ఏర్పడ్డ అధికారివర్గము. ఈ అధికార్లు గవర్నమెంటు అనే నిర్మాణములో అవయవములవంటివారు. గవర్నమెంటు అభివృద్ధిపొందుటకుగాను మార్చవలసిఉంటే, ఆ మార్పులు దేశమునకు మేలు చేసేవిగా ఉండవలెను ; చాలా కాలము దృఢముగా నిలిచిఉండేవి కావలయును ;—అనగా, మానవదేహము అభివృద్ధి పొందినట్టే, వ్యవస్థాపరివర్తనము ఏర్పడవలెను.

10. ఇంగ్లీషు నీతిశాస్త్రములలో ఒక న్యాయమున్నది : దేశపరిపాలనము బాగుపర్చదగిన రాజ్యవ్యవస్థలు ఒకరుచేస్తే అయ్యేవికావు ; వాటంతట అవే ఏర్పడవలసినవి— అని దానిఅర్థము. ఈ భావమే ప్రాచీనకాలమునుండిన్ని మనదేశములో ప్రచురముగా ఉన్నది. సకల జనోపయోగముగా చిరకాలమేర్పడిఉన్న వ్యవస్థ మొత్తముమీద నిలకడగలిగిఉండవలెను. దానిని మార్చుటకు బలవంతమైన కారణములున్నప్పుడు, పూర్వముకన్న ఎక్కువ ఉపయోగమగునట్లు మెల్లగా, అతివిలంబముగా, జాగరూకతతో సంస్కరించవలసివుంటుందని మనదేశములో అందరికీ తెలిసిన విషయమే. రాజ్యపరిపాలన విధానమును బోధించే శాస్త్రమునకు మనపూర్వులు "నీతిశాస్త్ర" మని పేరు పెట్టినారు. "నీతిశాస్త్రము" అనే పేరు సార్థకమైనది: "నీతి" అనే శబ్దము "నీ" అనే ధాతువునుండి వచ్చినది. "నీ" అనగా నడుపుట ; "నీత" అనగా నడపబడినది ; "నీతిశాస్త్రము" అనగా క్షేమాభివృద్ధి కలుగునట్లు ప్రజలను నడిపించేది అని అర్థము. శబ్దార్థమునుబట్టి "నీతి" అనగా మెల్లగా నడిపించుకొనిపోవునదిగాని గబగబ పరుగెత్తించునదికాదు. గమ్యస్థానము నెమ్మదిగా పొందించగలవాడు ముందుండి తోవచూపించి తన వెంట తోడ్కొనిపోయేవాడేకాని, వెనుకనుండి తఱిమితోలేవాడుకాడు : అనే భావము గల ఒకసామెతకూడా కలదు. అట్లే వృద్ధిపొందవలసిన వ్యవస్థ మెల్లమెల్లగా ఒకదశనుండి మరిఒక దశలోకి పెరుగుతుంది. ఒక్కదాటున అమితముగా మారిపోయిన వ్యవస్థ శీఘ్రముగా నశించేదేకాని చిరకాలము నిల్చేదికాదు. లేతకాయ పండబెట్టితే కుళ్లునుగాని పండదుగదా. గనుక, రాజ్యవ్యవస్థ చిరకాలము నిలిచి, దృఢముగా సురక్షితమయి ఉండవలెనంటే, దేహవ్యవస్థవలెనే మెల్లమెల్లగానే మారవలెను.

11. బుద్ధిమంతులయిన మనపూర్వులు రాజ్యవ్యవస్థ తొందరపడి మార్చితే హాని కలుగుననిన్ని క్రమక్రమముగా సంస్కారము చేస్తే, చిరకాలము క్షేమకరముగా ఉండుననిన్ని ఎరిగినవారు : గనుక వ్యవస్థననుసరించి చేసే పరిపాలనమునకు "సంస్థ" "రాజనీతి" "షిరస్థ" "మామూల్" మొదలయిన పేర్లు పెట్టినారు. "సంస్థ" అనగా స్థిరముగా ఏర్పడ్డ పరిపాలనపద్ధతి ; "స్థిరమ" నగా ఎన్నడును మారకుండా ఎప్పటికిని ఒక్కతీరున ఉండేది అని అర్థముకాదు ; "స్థిరమ" నగా చాలాకాలము ఉపయుక్తముగా ఉండి, కాలమునుబట్టి కావలసినంతమట్టుకు మెల్లమెల్లగా మారే స్వభావము కలదనే గూఢార్థము దానిలో ఉన్నది. వేరు బాగా నాటుకొని పరిణమించినదే స్థిరమైన రాజ్యవ్యవస్థ అనిపించుకొంటుంది. గనుకనే "షిరస్థ," "మామూల్" అని దానికి పేర్లు వచ్చినవి. శివాజీ మహాశయుడు మరాటారాజ్యము స్థాపించినప్పుడు ఆయనకు యుక్తముగా తోచిన రాజనీతిని అనుసరించి రాజ్యవ్యవస్థ ఏర్పరచి దానికి "షిరస్థ" అని పేరు పెట్టినాడు. అనగా, దేశములో చిరకాలమునుండి వున్న ఆచారము ; హఠాత్తుగ మారిపోక మెల్లమెల్లగా కాలోచితమైన మార్పులు పొంది మెల్లమెల్లగా అభివృద్ధి పొందినది అని అర్థము.

12. ఇంగ్లీషువారి రాజ్య వ్యవస్థకూడా ఇట్లే, యథాక్రమముగా మారుతూ అభివృద్ధి పొందినది. ఆ రాజ్యమందు స్వయంపరిపాలనాధికారము ప్రజలకు హఠాత్తుగా ఒక్కమార్పువలన కలగలేదు; కొంచెముకొంచెముగా అతివిలంబముమీద, అడుగువెంబడి అడుగుపెట్టినట్లు, “నీతిమార్గమున” (అనగా నడపించుటవలన) ప్రజాపరిపాలనము క్రమముగా స్థిరపడినది; ఒకమైలునుండి ఒకమైలుకు వడివడిగా సంస్కారమును పరుగెత్తించి తరిమి తోలలేదు. సంపూర్ణమైన పాలనాధికారము సమస్తప్రజలకు ఇట్లే నెమ్మదిగా, భద్రముగా, ఉపయుక్తముగా, లభించి దృఢపడినది. మనుష్యులందరికీ సాజముగా ఉండవలసిన హక్కులు స్వాతంత్ర్యములు, అన్నిరాష్ట్రములలోని ప్రజలకుండవలసిన స్వయంపరిపాలనాధికారము—వీటిని ఆమోదించిన నీతిజ్ఞులందరిలోనూ గ్లాడ్‌స్టన్‌గారే వీటికి గొప్పఆలంబము,—పట్టుగొమ్మ. అట్టి గ్లాడ్‌స్టన్‌గారికికూడా ఇట్టి దృఢాభిప్రాయమే కలదు. గ్లాడ్‌స్టన్‌గారి చరిత్రములో, గ్రంథకర్త మార్లె ప్రభువుగారు ఇట్లు వ్రాసినారు: “రాజ్య వ్యవహారములో ఎవరయినా స్వాభిప్రాయప్రకారము సర్వకార్యములు నెరవేర్చడమునకు పూనుకోక, సాధ్యమయిన పనికిమాత్రమే ప్రయత్నించవలసి ఉండుననిన్ని; ఏపని చేయదగినదో నిర్ణయించుటకు ఎంతబుద్ధి కావలెనో, అది చేయుటకు యుక్తమైనకాలమున్ను నిమిత్తమున్ను తెలిసికొనుటకుకూడా అంతబుద్ధి కావలెను అనిన్ని; ఈ గ్లాడ్‌స్టన్ మంత్రిపుంగవులు సదా గురియందు ఉంచుకొన్నారు.” “మీరు కోరినదంతా నెరవేరలేదని చింతపడకూడదు; లభించినది ఎంత స్వల్పమైనా దానితో తృప్తిపొంది, ఆ స్వల్పమయినా పొందదగినదే అని భావించవలెను” అని రోమను చక్రవర్తి మార్కస్ అరీలియస్ ఉపదేశించి ఉన్నాడు. ఆ ఉపదేశమే గ్లాడ్‌స్టన్‌గారున్ను రాజ్యవ్యవహారమందు తగినదిగా గ్రహించి ప్రవర్తించేవారు

13. ఇంగ్లండుదేశములో ప్రజాస్వామిక స్వయంపరిపాలనాధికారము అభివృద్ధి పొందినమార్గము పరిశీలించినా, మనపూర్వులు ఏర్పరచిన రాజనీతి పరిశీలించినా, గ్లాడ్‌స్టన్‌గారి హితోపదేశము యుక్తమైనదని చెప్పవచ్చును; గనుక, బ్రిటిషు పార్లమెంటువారు శాసనరూపముగా చేసిన సంస్కారములు ఆ హితోపదేశమును అనుసరించి మనము ఉపయోగించుకోవలసి ఉంటుంది. ఎందుచేతనంటే, గ్లాడ్‌స్టన్‌గారు ఎల్లప్పుడును మనదేశస్థులయెడల దయగలవారై ఎల్లప్పుడు మన సుఖదుఃఖములు తమవిగానే భావించేవారు; ఇండియాదేశమును పరిపాలించే అధికారము ఎవరియందుండవలెను? అనేవిషయము ఇండియా దేశస్థులే నిర్ణయించుకోవలసినదని చెప్పేవారు.

14. ఈవిషయము చదువరులకు నొక్కి ఎందుకు చెప్పవలసివచ్చినదంటే, “ఇప్పుడు చేసినసంస్కారము చాలదు; ఆ సంస్కారమువల్ల మనకు కావలసినదంతా దొరకదు; ఇండియాదేశస్థులు స్వయంపరిపాలనాధికారము సంపూర్ణముగా వహించుటకు తగినవారై ఉండగా, మిక్కిలి స్వల్పమైన అధికారము మాత్రమే ఈసంస్కారమువల్ల కలిగిన” దని మనవారిలో కొందరంటున్నారు.

15. ఈవాదము మన్నించేవాడనే అని మొదట ఒప్పుకొని, దీనికి ప్రత్యుత్తరము చెప్పవలెనని నా అభిలాష. ఈవాదము ఎందుకు మన్నిస్తానంటే, ఏ హక్కయినా పొందవలెనని కోరేవారు విలంబముకాకుండా తత్క్షణమే తాము కోరినదంతా ఒక్కమారే దొరకవలెనని పట్టుపట్టుట మనుష్యస్వభావమే. రొట్టెఅంతా అడిగితేకాని సగముముక్కయినా దొరకదన్న సామెత కలదుగదా. అయితే రొట్టె అంతా తినగలనని చెప్పి అంతా ఇమ్మని అడిగినంతమాత్రాన, అది అంతా ఒక్కమారే తిని అరిగించుకొనేశక్తి ఉన్నట్టు రుజువు అవుతుందా; ఇచ్చినది చక్కగా నమిలి తిని, తగిన శరీరవ్యాయామముచేత అరిగించుకొంటే, మరికొంత తినగలశక్తి కలదని స్పష్టముగా రుజువు

కాగలదు. చాలా పూచీగల రాజ్యవ్యవహారములో ఆ పద్ధతినే అవలంబించవలెను. దేశపరిపాలనము సామాన్యమైనదికాదు; దేశములో శాంతికి భంగము లేకుండా, అక్రమము జరగకుండా, ప్రజల స్వాతంత్ర్యము నిలిచేటట్టుగా అధికారము చెల్లించుకోవలెను. ఇతరులపై అధికారము చెలాయించేవారు అనుభవమువల్లను అభ్యాసమువల్లను క్రమక్రమముగా కొంతకాలమునకు నైపుణ్యము సంపాదించినప్పుడే వారి అధికారమువల్ల దేశమునకు క్షేమము కలుగుతుంది.

16. ఇతరులను తన వశముచేసుకొని పరిపాలించడముమాట విడిచిపెట్టి, తనను తాను వశపర్చుకొని పాలించుకోవడము ఎంతకష్టమో ఆలోచించండి. భగవద్గీతలలో ఏమని చెప్పిఉన్నది? ఆగ్రంథము హిందువులమైన మనము వేదముతో సమానముగా పూజింతుము; సూక్ష్మదృష్టితో జూచి తెలుసుకోదగిన మానుష ధర్మ రహస్యములు అందులో కలవని ఇతరదేశములలోని జ్ఞానులుకూడా దానిని మెచ్చుకొన్నారు. ఆ గ్రంథము బోధించే హితోపదేశము ఏమంటే, ఇతరులకోసము తాను చేయవలసిన పనులు నెరవేర్చేయోగ్యత సంపాదించుటకు ముందుగా తనను తాను పరిపాలించుకొనుటకు తగినయోగ్యత సమకూర్చుకోవలసివున్నది; తనను తాను పరిపాలించుకొనుటకు తగిన యోగ్యత యథాక్రమముగా అభ్యాసంచేత ఇంద్రియములను జయించి మనస్సు పూనికతో స్వాధీనము చేసుకొంటే కలుగునుగాని, శీఘ్రముగా ఒక్కసారి లభించదు. గీతాశాస్త్రములో చెప్పినట్లు “యోగ్యత” అనేది అటువంటిది. మరాఠావారినందరిని ఒక్క సంఘముగా కూర్చిన శ్రీ జ్ఞానేశ్వరులుకూడా అట్లే ఉపదేశించినారు. మనుష్యుడు తనకు విహితమైనపనిని చేయబూనుకొన్నప్పుడు, ఆపనేకాక అంతకన్న ఎక్కువ పని కూడా చేయడానికి తనకు యోగ్యత కలదని తలంచి, శక్తివంచన లేకుండా కార్యము నిర్వహించి, తన యోగ్యత ప్రకటించవలెను. ఆప్రకారము చేసినవాడే తనను తాను పరిపాలించుకొనుటకుగాని, ఇతరులను పరిపాలించుటకుగాని, తగిన యోగ్యత గలవాడు కాగలడు. ఈ ఉపదేశమేకదా గ్లాడ్‌స్టన్‌గారు చేసినారని మార్లే ప్రభువుగారు వ్రాసిన గ్లాడ్‌స్టన్ చరిత్రలోని వాక్యములు పైని ఉదాహరించినాను.

17. గనుక, “పార్లమెంటువారు ఇప్పుడు చేసిన సంస్కారమువల్ల స్వయంపరిపాలనాధికారము సంపూర్ణముగా లభించలేదు; మొదటి మెట్టుమాత్రమే ఎక్కించినవి; ఒక్కదాటున పై అంతస్థుమీదికి ఎగరవేసినవికావు; ఆ సంస్కారములు విలువ గలదికావు; మాకు తృప్తికరములుకావు; ఆశాభంగమైనది;” అని ఇక అనకూడదు. గొప్ప ఉద్యమము లన్నింటివిషయములోను, అందులో ముఖ్యముగా ప్రజలకు రాజ్యాధికారము కలుగజేయడములో, ఆరంభదశ ప్రధానమైనది. ఎందుచేతననగా ఈ ప్రథమదశలో భక్తిపూర్వకముగా సంతోషముతో ప్రజలు విహితధర్మములు పూనుకొని నిర్వహించితే, అభివృద్ధికలుగుతుంది; లేకుంటే, ప్రయత్నమంతా నిష్ఫలమవుతుంది. అంతకంతకు సులువుగాను శీఘ్రముగాను సంపూర్ణ స్వయంపరిపాలనాధికారము మనము పొందవలసియుంటే, మనము ఇప్పుడు చేయవలసిన పని ఏమనగా: ఈ ఆరంభ దశయందు మనమందరమున్ను కలిసి, ఐకమత్యముకలిగి, మనస్ఫూర్తిగా పూనికతోను ఉత్సాహముతోను పనిచేసి, పరస్పర విశ్వాసముకలవారమై, కీర్తిశేషులయిన గోపాలకృష్ణ గోఖలేగారి సుచరిత్రము ఆదర్శముగా చేసుకొని, వారి కృషి సఫలమగునట్లుగా కార్యసిద్ధి వహించి, తగిన ఉపాయములు అవలంబించవలెను. మనభుజములపైమోపిన రాజ్యభారము సుకరముగా మోసి, నానాటికి అనుభవము కలిగినకొలదిని అంతకన్న ఎక్కువ భారముకూడా వహించగలవారమని ప్రకటింతుముగాక.

3 వ అధ్యాయము.

పరిణామము.

వెనుకటి రెండు అధ్యాయములలోను ఇప్పటి సంస్కారము ఎంతఘనమైనదో మొత్తముమీద తెలియజేసినాను. ఇంతకుమునుపే ఈసంస్కారము చేయకపోవుటకుగల కారణము చెప్పినాను. స్వయంపరిపాలనాధికారము మనము పొందుటకు అనుకూలమైన ప్రవేశము కల్గించుటచేత ఈ సంస్కారము ఎట్లు శ్రేష్ఠమైనదో సవిస్తరముగా వర్ణించి, దాని విలువ మనము తెలుసుకోవలసి ఉన్నదని తెలియబర్చినాను. ఈ సంస్కారము ఇంచుమించుగా నిరర్థకమైనదని తృణీకరించక, దానియందు విశ్వాసముంచి, అనురూపముగా దానిని నడిపించితే, మనదేశమందు స్వయంపరిపాలనము రానురాను అభివృద్ధి పొందగలదని చూపించినాను. గనుక, ఇకను నేను చెప్పబోయే విషయములో నా అభిప్రాయము చదువరులు అనుసరించగలరనుకొంటాను. ఇంగ్లీషువారి ప్రభుత్వము మనదేశమందు స్థాపించినది మొదలు నేటిదాకా పరంపరగావచ్చిన ఏలుబడియొక్క ఫలమే ఈ సంస్కారమని తెలుసుకోవలెను. ఆ ఏలుబడి ఈ సంస్కారపరిణామమును వివరించే చరిత్రగా భావించవచ్చును. ఆ చరిత్రనుబట్టి ఈ సంస్కారముయొక్క స్వభావమున్ను ఉపయోగమున్ను తెలుసుకొని, దాని నాణెము కట్టవచ్చును. ఏ సంస్కారమైనా ఆకస్మికముగా ఎన్నడును జరుగదు. వర్తమానకాలమందు మనకు కనబడేది భూతకాలముయొక్క ఫలమే. విత్తనము భూతకాలములో నాటినదే. ఇంతకుముందుజరిగినదంతా ఇప్పుడు జరుగుతూ ఉన్న దానికిన్ని, ఇప్పుడు జరుగుతూవున్నది ఇకను జరగబోయేనిదానికిన్ని, కారణములు. వెనుకటిది ముందటిదానితో సంక్రమించి ఉంటుంది. పైకి అందరికీ కనబడకపోయినా, ఇదే పరిణామధర్మరహస్యము. ఈ ధర్మమననుసరించే స్వయంపరిపాలనాధికారము పరమావధిని పొందగలదు.

2. ఇప్పటి సంస్కారమునకు మూలము తెలుసుకోవలెనంటే, ఈస్ట్ ఇండియా కంపెనీవారి కాలములో చూడనగును. 1858 వ సం॥ వరకున్ను ఆ కంపెనీవారు ఇండియా దేశము పరిపాలించినారు. ఆకాలములోనే ఇండియాదేశస్థుల స్వయంపరిపాలనాధికారముయొక్క బీజారోపణము జరిగినది. ప్రజలందరూ ఒక్కలాగున ధర్మమునకు కట్టుబడి ఉండవలసిన విధిని ఆధారముగా చేసుకోనటువంటి స్వయంపరిపాలనము ఎన్నటికీ నిలువదు. కార్న్ వాలిస్ ప్రభువు ఏర్పరిచిన పరిపాలన వ్యవస్థను బట్టి అట్టి సమానధర్మసంరక్షణము స్థిరపడుటచేత ఆ ఆధారము కలిగినది. గత నొవెంబరు నెలలో శ్రీ చక్రవర్తిగారు తాము ప్రకటించిన ఆజ్ఞాపత్రమందు, "ఘనత వహించిన ఈస్ట్ ఇండియావారి పరిపాలనములో ఏర్పడ్డ 1773 వ సం॥పు శాసనము, 1784 వ సం॥పు శాసనము ఈరెండున్ను ఇండియాలో వ్యవస్థ ననుసరించిన పాలనమున్ను ధర్మనిర్ణయమున్ను స్థాపించే ఉద్దేశముగల శాసనములు. 1833 వ సం॥పు శాసనము బట్టి రాజ్యాధికారముగల ఉద్యోగములు ఇండియాదేశస్థులకు దొరకుటకు అవకాశము గలిగినది" అని చెప్పినారు.

3. స్వయంపరిపాలనాధికారము కలిగించే సాధనమునకు ఇది మొదటి అవస్థ. రెండవ అవస్థ 1858 వ సం॥లో ఈస్ట్ ఇండియా కంపెనీ అంతరించి దేశపరిపాలనము

చక్రవర్తిగారి అధీనమైనప్పుడు ఆరంభమైనది. అప్పుడు రాజ్యమేలుతూ ఉండిన శ్రీ విక్టోరియారాణీగారు తమ ఆజ్ఞాపత్రిక ప్రకటించినారు. ఆపత్రమునే "ఇండియా దేశస్థుల స్వాతంత్ర్యసత్వాధికారములు నిరూపించే మహాశాసనము" గా ప్రజలు ఎన్నుకొంటున్నారు. 1858 వ సం॥ దాకా రాజ్యవ్యవహారమునకు కావలసిన శాసనము లన్నీ రాజ్యాధికారముగల ఉద్యోగస్థులే చేస్తూవచ్చినారు. ఇంగ్లీషు ప్రభుత్వమువారు ఏలుటకు మొదలుపెట్టిన తర్వాత, శాసనములు చేయుటకు వేరే సభలు ఏర్పడినవి. ఈశాసననిర్మాణసభలలో ఇండియా దేశస్థులకు ప్రతినిధులుగా ఉండి శాసనములు చేయుటకుగాను మనవారిలో కొందరిని ప్రభుత్వమువారే నియోగించినారు. "చట్టములు చేయుటకు ఏర్పడ్డ సభలలో ప్రజల ప్రతినిధులుగా స్వదేశస్థులను కొందరిని ఇప్పుడు ప్రభుత్వమువారే నియోగిస్తున్నారుగాని కొంతకాలము పోయినపిమ్మట ఇండియా దేశస్థులకు స్వయముగా తమ ప్రతినిధులను ఎంచుకొని నియోగించే అధికారము ఇయ్యవలెనని ప్రభుత్వమువారికి కోరిక గలదు," అని 1861 వ సంవత్సరములో ఈ శాసననిర్మాణసభలు ప్రతిష్ఠించినప్పుడే ప్రభుత్వమువారు స్పష్టముగా తమ ఉద్దేశము తెలియజేసినారు. 1892 వ సం॥రందాకా 30 సంవత్సరములు ప్రతినిధులను ప్రభుత్వమువారే నియోగించే ఏర్పాటు జరిగినది.

4. 1892 వ సం॥రంలో మూడవ అవస్థ ఆరంభించినది. శాసననిర్మాణసభలు పెద్దవయినవి. అనగా, వాటిలో మునుపటికన్న ఎక్కువమంది సభికులుగా ఉన్నారు. ఈ సభికులలో కొందరిని ప్రజల ప్రతినిధులుగా ఉండుటకు తగినవారిని ప్రభుత్వమువారు నియోగించడములో గవర్నమెంటుఉద్యోగస్థులు కానివారినే ఎంచి, సిఫారసు చేసే అధికారము వణిక్సంఘము (చేంబర్ ఆఫ్ కామర్స్), విశ్వవిద్యాలయములు, భూస్వాముల సంఘము, మ్యునిసిపాలిటీలు, లోకల్ బోర్డులు మొదలయిన కొన్ని సంఘములకు ఇచ్చినారు. శాసననిర్మాణసభ్యులుగా తమ ప్రతినిధులను తాము స్వయముగా ఎంచుకొనే అధికారము ప్రజలకు కలుగకపోయినా, తమ సంఘములకు కొన్నింటికి తమ ప్రతినిధులను ఎంచి సిఫారసుచేసే అధికారమైనా క్రొత్తగా దీనిబట్టి కలిగినదిగదా. శాసననిర్మాణసభలో ఏసభికుడయినా రాజ్యవ్యవహార సంబంధముగల ఏ భోగట్టా అయినా అడిగి తెలుసుకోవచ్చును. రాజ్యముయొక్క ఆయవ్యయములు చర్చించే అధికారముకూడా సభికులకు కలిగినది.

5. ఇట్లు పదారు సంవత్సరములు జరిగినతర్వాత, 1909 వ సం॥రంలో "మార్లీ మింటో సంస్కారము" కాగా, మరి ఒక అవస్థ ప్రారంభమైనది. ఆ సంస్కారబలముచేత ఇండియా గవర్నమెంటువారిలో ఒక్క అధికారినిన్ని, ప్రతి మండలముయొక్క గవర్నమెంటువారిలో ఒక్క అధికారినిన్ని, ఇండియాదేశస్థులనే నియోగించవలసి వచ్చినది. శాసననిర్మాణసభలలో ప్రజల ప్రాతినిధ్యము ఎక్కువగా వృద్ధిపడ్డది. గవర్నర్ జనరల్‌గారి శాసననిర్మాణసభ మరింత పెద్దదయి, 60 మంది సభికులు కలదయినది; వారిలో ఇరువైఎనమండుగురికన్న ఎక్కువ గవర్నమెంటు ఉద్యోగస్థులు ఉండకూడదని నియమము ఏర్పడినది. ఆసభలో ప్రజల ప్రతినిధులను కొందరిని గవర్నమెంటువారే నియోగించినప్పుడు, ఎవరిని నియోగించవలెనో ఎంచి సిఫారసు చేయుటకుగాను, దేశమున కొన్ని కూటములు ఏర్పడినవి. ఇట్లు గవర్నమెంటువారు నియోగించిన సభికులు 27 గురు ఆ గవర్నర్‌జనరల్‌గారి శాసననిర్మాణసభలో ఉన్నారు. ప్రతిమండలములోను మండలశాసననిర్మాణసభలుకూడా పెద్దవైనవి. వీటిలో సైతము ప్రజలప్రతినిధులను కొందరిని గవర్నమెంటువారే నియోగించినప్పుడు, ఎవరిని నియోగించవలెనో ఎంచి సిఫారసు చేయుటకుగాను ప్రతిమండలములలోను కూటములు ఏర్పడినవి.

అవి ఏవంటే : భూస్వాములకూటము, మహమ్మదీయులకూటము, పంజాబులో సిక్కుల కూటము ; అవి కాక రాజధానులలోని మ్యునిసిపల్ కార్పొరేషన్ల కూటములు, విశ్వవిద్యాలయ మ్యునిసిపాలిటీలు, లోకల్ డిస్ట్రిక్ట్ బోర్డులు చేరిన కూటములు.

6. మండల శాసననిర్మాణసభలలో సగముమందికంటె తక్కువగానే గవర్నమెంటు ఉద్యోగస్థులు ఉండేటట్లు ఏర్పాటు జరిగినది. రాజ్యవ్యవహారముతో సంబంధించిన ఏవిషయముగురించియైనా చర్చించి తీర్మానములు చేసే అధికారము మండలశాసననిర్మాణసభికులకు కలిగినది ; గాని, ఈ తీర్మానములు అమలులోనికి తప్పక తేవలసిన బాధ్యత గవర్నమెంటువారికి లేదు.

7. ఇంగ్లీషువారి ప్రభుత్వము మనదేశములో స్థాపించినదిమొదలు నాలుగు అవస్థలుదాటి ప్రజల స్వయంపరిపాలనాధికారము క్రమక్రమముగా వృద్ధిపొందినది. వచ్చే సంవత్సరము అమలులో పెట్టె సంస్కారము సిద్ధించుటకు ఈ నాలుగు అవస్థలున్ను సాధకము లయినవి. ప్రతి అవస్థ దాని తర్వాతి అవస్థలో కలిగిన అభివృద్ధికి సాధకమైనది. ఒకొక్క అవస్థలో ప్రజలకెట్టి అధికారముండెనో క్రిందను నిరూపించినట్లు సంగ్రహముగా చూస్తే లెస్సగా బోధపడుతుంది.

8. మొదటి అవస్థలో ప్రజల పరిపాలన నిమిత్తము శాసనములు చేసే అధికారము గవర్నమెంటు ఉద్యోగస్థులకేకాని దేశస్థుల కొక్కరికైనా లేదు.

9. రెండవ అవస్థలో శాసనముచేసే అధికారముగలవారిలో సగముమందికన్న ఎక్కువగా గవర్నమెంటు ఉద్యోగస్థులే ఉన్నా, ఉద్యోగస్థులుకానివారుకూడా కొందరున్నారు. వారిలో కొంచెముమంది ఇండియాదేశస్థులు చేరిఉన్నారు.

10. మూడవ అవస్థలో శాసననిర్మాణసభవారికి శాసనములు చేసే అధికారము మాత్రమేకాక రాజ్యముయొక్క ఆయవ్యయములు విమర్శించే అధికారమున్ను రాజ్యవ్యవహార విషమై బోగట్టా అడిగే అధికారమున్ను కలిగినది. ఇట్లు ఈ సభవారికి రాజ్యవ్యవహారము విమర్శించి తప్పొప్పులు చూపించే అధికారము మిక్కిలి అల్పమయినదే అయినా, అది కలుగుట గొప్పవిశేషము. అంతేకాక, ప్రభుత్వమువారు నియోగించే ప్రజాప్రతినిధులలో కొందరు అనుద్యోగస్థులున్ను, ప్రజలు స్వయంగా ఎంచుకొని శిఫారసు చేసినవారున్ను, అయి ఉండవలెను : అనే నియమము కూడా ఏర్పడ్డది. ఇట్లు తమ ప్రతినిధులను ఎంచుకొనే అధికారము ప్రజలకు స్థిరపడినది.

11. నాలుగవ అవస్థలో—ఇండియా ప్రభుత్వమువారిలోను ప్రతి మండలప్రభుత్వమువారిలోను ఇండియాదేశస్థుడొక్కడు ఉండవలెననే నియమము కొత్తగా ఏర్పడ్డది. ఇట్లు జరగడము ఇదే మొదటిసారి. ప్రభుత్వమువారి వ్యవహారము విమర్శించే అధికారము సభవారికి మునపటికన్న అధికముగా కలిగినది. మండలసభలలో అనుద్యోగస్థులు సగముమందికంటె ఎక్కువ అయినారు. కీర్తిశేషులయిన గోఖలేవంటి దేశస్థులు విమర్శముచేతనేమి, సలహాచేతనేమి, సూచనలచేతనేమి, తమ ప్రభావము ప్రకటించి మునుపటికన్న ఎక్కువగా రాజ్యవ్యవహారము దిద్దినారు. శాసననిర్మాణసభలలో ప్రజాప్రతినిధులను ఎంచేవారికూటములుకూడా కొన్ని ఏర్పడ్డవి.

12. చూచినారా, నూటయేబది యేండ్లక్రిందట ఈస్ట్ ఇండియా కంపెనీవారి కాలములో ఏర్పడ్డ "సమానధర్మసంరక్షణము" అనే విధిని అనుసరించి ఇంగ్లీషువారి పరిపాలనము ఎట్లు పరిణమించినదో ? దానివల్లనే బ్రిటిష్ ఇండియాలో ప్రజలకు క్రమక్రమముగా స్వయంపరిపాలనాధికారమందు ప్రవేశము కలిగినది. ప్రతి అవస్థలోను మనదేశపు నీతిజ్ఞులు అంతకంతకు ఎక్కువ అధికారము ప్రజలకుండవలెనని

అడిగినారు. ప్రభుత్వమువారి రాజనీతి అంతకంతకు కఠినమైన శోధనకు లోనయినది. "ఇండియా దేశస్థులు తమ దేశమును తమ ఇష్టము, అభిప్రాయమును అనుసరించి పరిపాలించుకొనుటకు అనుకూలముగా ఉండేలాగున రాజ్యవ్యవస్థ ఏర్పడవలెనని దేశనాయకులు అంతకంతకు పట్టుదలతో కోరుతున్నారు. స్వాతంత్ర్యాభిలాష అంతటా వ్యాపించి ఉత్సాహము కలిగించుచున్నది." అని ఇప్పటి సంస్కారమును గురించి వ్రాసిన రిపోర్టులో ఉన్నది. 1914 వ సం॥ ఆగస్టు నెలలో ఆరంభించిన మహాయుద్ధమువల్ల ఆ అభిలాష, ఆ ఉత్సాహము, ఎక్కువయినవి. ఇండియా దేశస్థులందరున్ను, రాజులూ, రయితులుకూడా, బ్రిటిషు చక్రవర్తియెడలను బ్రిటిషు సామ్రాజ్యముయెడలను అపరిమితమైన అభిమానమున్ను భక్తిన్ని వ్యక్తపరచినారు. దాని ఫలమే ఇప్పుడు పార్లమెంటువారు చేసిన కొత్తశాసనము. ఈ శాసనముప్రకారము ఇండియా దేశస్థులకు క్రమక్రమముగా సంపూర్ణ స్వయంపరిపాలనాధికారము ఇచ్చి, వారిని బ్రిటిషు సామ్రాజ్యములో సమానభాగస్వాములుగా చేయగలవారమని పార్లమెంటువారు ప్రతిజ్ఞ చేసినారు.

4 వ అధ్యాయము.

ప్రకటనము.

ప్రజాస్వామిక పరిపాలనాధికారమందు ప్రస్ఫుటముగా మొదటిదశ ఆరంభించుటకు హేతుభూతములైన కొన్ని కార్యములు గత అయిదు సంవత్సరములలో జరిగినవి. వాటిని మనము ఇప్పుడు శ్రద్ధతో పరిశీలించవలెను. ఇండియాదేశచరిత్రలో ప్రధానముగా వర్ణించి ప్రశంసింపదగిన అధ్యాయముగా అవి ఏర్పడును. ఇండియా ఇంగ్లాండు దేశములకు గల సంబంధము మునుపటికన్న ఎక్కువగా వాటివల్ల దృఢపడినవి. ఆ రెండుదేశములు ఒకదానికొకటి ఎంతసాయము చేస్తున్నవో, ఇంకా ఎంతమట్టుకు సాయము చేయుటకు అనుకూలమగునూ, చక్రవర్తిగారి చాపుటాను ఆశ్రయించి ఇండియాదేశము మేలుకొని ఎట్లు జాగ్రత్తగా నున్నదో, వాటివల్లనే స్పష్టపడుతున్నది.

2. 1914 వ సం॥ ఆగస్టు నెల మొదలుకొని 1918 వ సం॥ నోవెంబరు నెలవరకు జరిగిన మహాయుద్ధములో బ్రిటిషు సామ్రాజ్యమువారు పెంచి ప్రభుత్వమువారితోనున్ను తక్కిన మిత్రమండలితోనున్ను కలిసి, జర్మనీతో పోరాడి వారి సైనికోద్ధత్యము అణచివేసినారనే విషయము మీకు తెలిసినదే గదా. బెల్జియం దేశస్థులవంటి దుర్బలమైన ప్రజల స్వాతంత్ర్యమును రక్షించుటకుగాను బ్రిటిషు సామ్రాజ్యమువారు యుద్ధము చేయవలసివచ్చినది. బెల్జియం దేశములోనికి జర్మన్ సేనలు ప్రవేశించకూడదని పూర్వపు సంధిషరతులున్నప్పటికిన్ని, వాటినిమీరి, బెల్జియం ప్రభుత్వమువారు నివారించినా, వారిమాట మన్నించక మొదట ఫ్రాన్స్ దేశముపైనిన్ని, పిమ్మట ఇంగ్లాండుపైనిన్ని, దాడివెడల నుద్దేశించి, జర్మన్ ప్రభుత్వమువారు తమసేనలను బెల్జియం దేశములోనికే పంపినారు. బలోన్మత్తులై జర్మనీవారు ప్రపంచములో అందరి స్వాతంత్ర్యము నిర్మూలనము చేసి, దేశములలోని ప్రజలకు స్వయంపరిపాలనాధికారము లేకుండా రూపుమాపి, ఎవరిష్టమువచ్చినట్లు వారు నెమ్మదిగా జీవిస్తూ వృద్ధిపొందకుండా, అందరున్ను తమకు దాస్యము చేసేటట్టు లోకమంతా తామే స్వాధీనపర్చుకోవలెనన్నంత ఆశ కలవారయినారు. భూలోకములో నాగరికత, స్వాతంత్ర్యము నశింపజేసేటంత ప్రళయభయంకరమైన ఉపద్రవము పుట్టినందున, బ్రిటిషు సామ్రాజ్యమువారందరున్ను మిత్రమండలితో కలిసి, ఈ ప్రళయము నివారించి, నాగరికత స్వాతంత్ర్యము నిలబెట్టుటకు పూనుకొన్నారు. యుద్ధము ప్రారంభించుటకు నిశ్చయముకాగానే, శ్రీ జార్జిచక్రవర్తిగారు ఇండియాదేశములోని రాజులను ప్రజలను బ్రిటిషు సామ్రాజ్యపక్షమున విశ్వాసముతో నిలిచియుండి, విజయము కలుగునట్లు సాయము చేయవలయునని రాజశాసనము ప్రకటించినారు. దానికి అనుకూలముగా రాజులున్ను ప్రజలున్ను తత్క్షణమే భక్తితో అంగీకరించి, బ్రిటిషు సామ్రాజ్య సైనికులతో కలిసి యుద్ధము చేయుటకు సైనికులనున్ను, యుద్ధము ఖర్చులకు ధనమున్ను, విస్తారము ఇచ్చి, ఇంకా అనేకవిధాల బ్రిటిషు సామ్రాజ్యమునకు తోడుపడి, జయము పొందించినారు. యుద్ధసమయమున ఇండియాలో చక్రవర్తి ప్రతినిధిగా ఉన్న హార్డింజి ప్రభువుగారు ఇండియా దేశమందున్న సైనికులను ఫ్రాన్సులో యుద్ధము జరుగుతూ ఉన్న స్థలమునకే పంపినారు. ఈ

నీతిచాతుర్యము చూచి ఇంగ్లాండులోను ఇండియాలోను జనులందరున్ను సంతోషించి చాలా మెచ్చుకొన్నారు. ఇండియా దేశమునకు ఇందువల్ల కలిగిన గౌరవము అపరిమితమైనది. ఇండియానుండి వెళ్లిన యోధులు, ఇంగ్లీషు యోధులతో జట్టుకూడి యూరోపులో జర్మనీ సేనలతో పోరాడి గెలుచుట సామాన్యమయిన పనికాదు. ఇండియా యోధులలో పంజాబీలు, మరాటీలు, మహమ్మదీయులు, శీక్కులు, రాజపుత్రులు, జాట్లు, గురఖాలు, మొదలైన క్షాత్రవంశములవారు ఉండిరి. పలువురు ఇండియాలోని రాష్ట్రాధిపతులు కూడా ఈ సేనలతో యుద్ధరంగమునకు వెళ్లి యుద్ధము చేసినారు. ఇండియా యోధులు యుద్ధమందు చేసిన వీరకృత్యములు, బ్రిటిష్ సామ్రాజ్యమందు వారికిగల భక్తితాత్పర్యములు, దానికిగాను వారుచేసిన స్వార్థపరిత్యాగము, వారి ఓర్పు, వారి శౌర్యము, విహితధర్మనిర్వహణమందు వారికి గల పట్టుదల, చావుకేమీ భయపడక ఏ పనికయినా వారు తెగించుట—ఇవి అన్నీ వారికిన్ని వారిదేశమునకున్ను ఎంతో కీర్తి తెచ్చినవి. ఇంతేకాక, ఆయుద్ధకాలమందు మనదేశమందున్న ప్రజలు దృఢమయిన రాజభక్తి కలిగి, అంతఃకలహములు లేకుండా, బ్రిటిషు సామ్రాజ్య విజయమందు అత్యంతాభిలాష కలిగి ఉండడమువల్లనుకూడా దేశమునకు చాలా ప్రఖ్యాతి కలిగినది. తర్వాత లండన్ నగరములో యుద్ధము గురించి ఆలోచించుటకుగాను ఏర్పర్చిన సామ్రాజ్య ప్రతినిధుల సభలో శ్రీ బికనీర్ మహారాజావారినిన్ని, సర్ సింహాగారినిన్ని సభ్యులుగా నియోగించినారు. సర్ సింహాగారికి అప్పుడు ప్రభు ఓరుదచ్చి, పార్లమెంటులో ప్రభువర్గమందు చేర్చి, ఇండియా అండర్ సెక్రిటరీ ఆఫ్ స్టేట్ అధికారమందు నియమించినారు. ఇట్లు చేయుట ఇండియా దేశమునకు చాలా గౌరవము చేసినట్లే కదా! ఇండియా దేశమందున్న రాజులకు ప్రజలకు శ్రీ చక్రవర్తిగారి యెడల గల భక్తి, యుద్ధమందు బ్రిటిష్‌వారికి జయము కలుగవలెనని అందరికీ పుట్టిన అభిలాష, ప్రకటితమయి లోకమునకు తెలిసినందున, ఇండియా దేశము భూలోకములో మునుపటికన్న ఎక్కువ ఖ్యాతిపొంది, ఘనతగల రాజ్యములలో గణనీయమయినది. గనుక, ఇండియా దేశస్థులు తమకు స్వయంపరిపాలనాధికారము ఇచ్చి తమ్ము బ్రిటిష్ సామ్రాజ్యములో సమానభాగస్వాములుగా చేయవలసినదని కోరుతూచేసిన విన్నపము శ్రద్ధగా విచారించతగినదని బ్రిటిష్ ప్రభుత్వమువారికి తోచినందున ఇండియా సెక్రిటరీ ఆఫ్ స్టేటుగా ఉన్న మాన్టేగుగారు శ్రీ చక్రవర్తిగారి తరఫున, పార్లమెంటు తరఫున, ఇంగ్లీషువారి తరఫున, కామన్స్ సభలో 1917 వ సం॥ ఆగస్టు తే 17 దిని ఘనమయిన వక్కాణము వక్కాణించినారు. అందులోని ప్రధానవాక్యములు ఉదాహరిస్తాను.—

3. (1) "ఇండియాదేశము విషయమయి సామ్రాజ్యాధికారులు అవలంబించిన రాజనీతి ఇండియా గవర్నమెంటువారికి సమ్మతమయినది ; ఆ నీతి విధానము చొప్పున రాజ్యవ్యవహారమందు అన్ని యిలాకాలలోను ఇండియా దేశస్థులను అంతకంతకు ఎక్కువమందిని చేర్చుకొంటూ ఉండవలెను ; క్రమక్రమముగా స్వయంపరిపాలనాధికారము నిర్వహించుటకు అనుకూలమయిన మార్గము ఏర్పర్చి, క్రమక్రమముగా పరిపాలకులు దేశప్రజలకే ఉత్తరవాదులగునట్టు చేసి, ఇండియా దేశస్థులు బ్రిటిష్ సామ్రాజ్యములో సమానభాగస్వాములుగా అయ్యేటట్లు రాజ్యవ్యవస్థ ఏర్పర్చవలెను. అందుకుగాను తగిన ప్రక్రమము చేయుటకే గవర్నమెంటువారు నిశ్చయించినారు."

4. (2) "ఈ రాజనీతి దశాంతరపరిణామము పొంది అభివృద్ధిపొందవలసినదేగాని హఠాత్తుగా ఇప్పుడే అమలులోకి రావలసినది కాదు."

5. (3) "ఇండియా దేశస్థుల యోగక్షేమములు కనుక్కొంటూ వారికి అన్ని విషయములలోను పరంపరాభివృద్ధి కలుగునట్లుగా రాజ్యవ్యవహారము నడిపించవలసిన పూచీ బ్రిటిష్ గవర్నమెంటువారియందును ఇండియా గవర్నమెంటువారియందును ఉన్నా, ఇటువైని దేశసేవచేసే అవకాశము కలవారి సహాయ్యము అంగీకరించి, దానికి అనుగుణముగా వ్యవహరించవలసి ఉంటుంది; అయితే, అట్టి సాహాయ్యము ఎంతమట్టుకు అంగీకరించడము యుక్తము? అనే సంగతి సాహాయ్యము చేసేవారు పూచీపడగలవారిని ఎంతమట్టుకు విశ్వాసము పుట్టించగలరో దానినిపట్టి ఉండవలెను."

6. మాంటేగుగారి వక్కాణమునుండి ఉదాహరించిన ఈ మూడు వాక్యముల అర్థము స్పష్టపర్చి, ఇటుపయిన ఇండియా దేశపు స్థితి వాటినిబట్టి ఎట్లుమారునో తెలియజేయవలసియున్నది.

7. మొదటి వాక్యములో——ఇండియా దేశస్థులకు స్వయంపరిపాలనాధికారము చెలాయించడమునకు అనుకూలమయిన సాధనములు కలిగించి, రాజ్యాధికార్లను ప్రజలకు ఉత్తరవాదులుగా చేయ నుద్దేశించినట్లు విశ్వాసార్హమయిన ప్రతిజ్ఞ కలదు.

8. దీని తాత్పర్యమేమంటే, ప్రజలకే రాజ్యాధికార్లపయిని అధికారముంటుంది. ప్రజలకు రాజ్యాధికార్లు జవాబుదార్లుగా ఉంటారు. ఇట్టి స్వయంపరిపాలనాధికారము ప్రజలకు కలుగుతుంది.

9. "స్వయంపరిపాలనాధికారము" అనే పదమునకు నీతిశాస్త్రములో అనేక అర్థములున్నవి. పరిపాలకులు అన్యదేశస్థులుకాక స్వదేశస్థులే అయితే, చాలును; వారిపాలనము స్వయంపరిపాలన మనిపించుకొంటుంది. పాలనాధికారము ఒక్కనియందే ఉండవచ్చును; లేదా, ఒక జాతివారిలో కొందరియందు ఉండవచ్చును; ఎంతమందియందయినా ఉండవచ్చును. స్వదేశస్థులైన పరిపాలకులు నిరంకుశాధికారులయి ఇష్టము వచ్చినట్లు ప్రజలను బాధించి ఏల కూడదన్న నియమములేదు; గనుక, అట్టి రాజ్యము "స్వారాజ్యము" అనిన్ని అట్టి పరిపాలనము "స్వయంపరిపాలనము" అనిన్ని పేరుకు మాత్రమే అవును; గాని, వాస్తవముగా ప్రజలకు అధికార మేమీ ఉండదు. రాజ్యాధికారము చెలాయించేవారు న్యాయవిరుద్ధముగా వ్యవహరించిన యెడల, వారిని ఉద్యోగమునుండి తీసివేసే అధికారము ప్రజలకు కలిగినప్పుడే ప్రజలు యథార్థముగా అధికార్లు అనిపించుకోగలరు; అప్పుడు "ప్రజాస్వామిక పరిపాలనము" "ప్రజాస్వామిక రాజ్యము" ఏర్పడును.

10. ఈలాగున రాజ్యాధికారులను ప్రజలు తమ వశములో ఉంచుకొని, ప్రజలే వారికి స్వాములుగా ఉండేటట్టు "ప్రజాస్వామిక రాజ్యము" ఏర్పడునని మాంటేగుగారు ఖరారు చేసినారు.

11. మాంటేగుగారి రెండవ వాక్యముయొక్క తాత్పర్యమేమంటే :—ఇట్టి "ప్రజాస్వామిక రాజ్యము" సంపూర్ణముగా ఒక్కసారి లభించదుగాని, క్రమక్రమముగా ఏర్పడుతుంది. రెండవ అధ్యాయములో ఇట్టి నియమమునకు కారణములున్ను దానివల్ల కలిగే లాభములున్ను తెలియజేసి ఉన్నాను. మనము అభిలషించే ప్రజాస్వామిక రాజ్యమును తొందరపడి పొంది, నిర్వహించుకోలేక పోగొట్టుకొనుటకంటె క్రమక్రమముగా సంపాదించుకొని శాశ్వతముగా నిలబెట్టుకొనుట మంచిది.

12. ఈ నీతికి అనుకూలముగా ప్రజాస్వామిక రాజ్యమును స్థాపించుటకు సాధనములైన వివిధ దశలలో ఒకొక్కదానియందు పొందదగిన స్వయంపరిపాలనాధికారము స్థిరపడేటట్టు మన దేశస్థులు బ్రిటిషు ప్రభుత్వమువారికి విశ్వాసముతో తోడ్పడవలెనని కోరుతున్నారు. మన దేశస్థులు భక్తితాత్పర్యములతో, తత్పరులై, వివేకముగలిగి వ్యవహరించేయెడల, ఈ మహోద్యమము సఫల మవుతుంది; లేకుంటే, వ్యర్థము కాక మానదు.

13. పార్లమెంటు సభలో ప్రకటించిన ఈ రాజనీతిని ప్రవర్తింపజేయిటకు అనుకూలమయిన ఉపాయములున్ను సాధనములున్ను ఆలోచించుటకుగాను 1917 వ సం॥ నొవెంబరు నెలలో ఇండియా సెక్రిటరీ ఆఫ్ స్టేటుగారు ఇంగ్లండునుండి మనదేశము వచ్చినారు. గవర్నరు జనరలుగారిని వెంటబెట్టుకొని వారు మన దేశములో అనేక స్థలములకు వెళ్లి, అన్నిజాతులవారితోను, అన్ని కులములవారితోను, అన్ని మతముల వారితోను, అన్ని సమాజముల వారితోను——అనగా వారిలో ముఖ్యులతోను——ఈ విషయము సావధానముగా ఆలోచించి చర్చించినారు. పిమ్మట వారు ఉభయులున్ను కలసి పార్లమెంటుసభవారికి రిపోర్టు పంపినారు. పయిని వివరించిన వక్కాణములోని రాజనీతిని అమలులో పెట్టుటకుగాను తమకు ఉచితమని తోచిన ఉపాయములున్ను ఆ రిపోర్టులో తెలియజేసినారు. ఆతర్వాత ప్రభుత్వమువారు నియమించిన ప్రకారము కొందరు తగు మనుష్యులు కమిటీగా ఏర్పడి, ఇండియా దేశమంతా తిరిగి, ప్రజలలో ప్రముఖులైనవారి సలహా పుచ్చుకొని, రిపోర్టు వ్రాసినారు. శాసననిర్మాణ సభలలో ప్రజలు ప్రతినిధులుగా ఉండవలసిన సభ్యులను ప్రజలే ఎంచుకొని ప్రజాస్వామ్యము నిర్వహించుటకుగాను ఎంచుకొనే ప్రజలలో గణములు (సంఘములు) ఏర్పర్చవలసినదని కమిటీవారు తమ రిపోర్టులో నివేదించినారు. పిమ్మట సెక్రటరీ ఆఫ్ స్టేటుగారు వ్యవస్థ ఏర్పర్చుటకుగాను పార్లమెంటుసభవారు ఆలోచించి అంగీకరించవలసినదని వేడుతూ ఆ సభవారికి ఒక బిల్లు దాఖలుచేసినారు. పార్లమెంటుసభవారు కొందరు మెంబర్లను కమిటీగా నియమించి, ఆ బిల్లు విమర్శించి రిపోర్టు వ్రాయవలసినదన్నారు. ఆ కమిటీవారు మొత్తముమీద బిల్లు యుక్తముగానే ఉన్నదని సమ్మతించి, మరింత విపులముగా అందులోని విధానములు మార్చి, పార్లమెంటువారికి రిపోర్టు పంపినారు. ఈ రిపోర్టులో: "ప్రజాస్వామిక పరిపాలనము ఆరంభము చేసినప్పుడు మొదటి దశలోనే ప్రజాప్రతినిధులను ఎంచికొనే అధికారము ప్రజలన్న శబ్దము ఎవరికి వర్తిస్తుందో వార అందరికిన్ని అనగా విద్యావంతులు, అగ్రవర్ణములవారు, భూస్వాములు, వర్తకులు, మాత్రమేకాక, పట్టణములందు కాయకష్టములుపడి పనిచేసికొని జీవించేవారికిన్ని, వారివలెనే ఇదివరకు రాజ్యవ్యవహారములో ఏవిధమయిన అధికారమున్ను లేకుండా ఉన్న ఇతరులందరికిన్ని కూడా ఉండవలెను; రాజ్యవ్యవహారము నడిపించే సామర్థ్యము అభ్యాసముచేత సంపాదించుటకు తగిన అవకాశములు ప్రజలకు మొట్టమొదటనుండిన్ని కలుగజేయవలెను; (ఆ అవకాశము ఎంత విస్తారముగా ఉంటే అంత మంచిదని నీతివేత్తలు అంటారు) అలాటి అవకాశములుంటే ప్రజలు తమ సామర్థ్యము ప్రకటించి, ఎక్కువ అధికారము పొందుటకు తగినవారయినారని పార్లమెంటువారికి తోచేటట్లుచేసి ప్రజాస్వామిక పరిపాలనము వృద్ధిపరచుకోవచ్చును," అని కమిటీవారు ఉపదేశించినారు. ఈ ఉపదేశము పార్లమెంటువారు అంగీకరించినారు. "ప్రజలు" అన్నప్పుడు, పల్లెటూళ్లవారున్ను, కూలీనాలీ చేసుకొని జీవించేవారున్ను, నీచులున్ను కూడా ప్రజలలోనివారే అని కమిటీవారు స్పష్టముగా విశేషించి నొక్కి చెప్పియున్నారు. కమిటీవారి ఉపదేశము ప్రకారమే రాజ్యవ్యవస్థలో సంస్కారము జరుగుతుంది. ప్రజాస్వామిక పరిపాలనమునకు ఆ సంస్కారమువల్ల ప్రారంభదశ ఏర్పడుతుంది. రయితులకు, కూలీలకు కూడా మొదటిసారి రాజ్యాధికారములో వంతు దొరుకుతుంది. క్రమక్రమముగా ఇండియా దేశము ప్రజాస్వామిక రాజ్యమవుతుంది; ఎంత ధనవంతులుగానీ, ఎంత బలవంతులుగానీ ఒకజాతివారే రాజ్యాధికారము మరి చెలాయించలేరు.

5 వ అధ్యాయము.

లోకల్ బోర్డుల సంస్కారము.

వెనుకటి అధ్యాయములో చెప్పిన పార్లమెంటు కమిటీవారి ఉపదేశము ననుసరించి 1919 వ సం॥ డిశంబరు నెలలో పార్లమెంటు సభవారు శాసనము చేసినారు. శ్రీ చక్రవర్తిగారు దానికి తమ అనుజ్ఞ ఇచ్చినారు.

2. ఆ శాసనముయొక్క ఉపోద్ఘాతములో ఇండియా దేశమునకు ప్రజాస్వామిక పరిపాలనము కలుగుట నిశ్చయమని పార్లమెంటువారు ఖరారు చేసినారని వెనుక నొక అధ్యాయములో చెప్పినాను. ఆ అధ్యాయములోనే, ఇట్టి అధికారము వహించుటకు ప్రజలకు హక్కు కలదని శాసనరూపముగా దృఢపడడము గొప్పలాభమనిన్ని, రాజశాసనములో చెప్పనప్పుడు, గవర్నమెంటువారేకానీ, గొప్ప ఉద్యోగస్థులేకానీ ఈ హక్కు కలదని ఎంతవాగ్దానముచేసినా, అందువల్ల ప్రయోజనము లేదనిన్ని తెలియజేసినాను.

3. వెనుకటి అధ్యాయములోనే ప్రజాస్వామిక రాజ్యమంటే ఏమిటో సంక్షిప్తముగా చెప్పినాను; ఇప్పుడు మరింత స్పష్టముగా ఆ విషయమే విప్పి చెప్పుతాను.

4. ప్రజాస్వామిక రాజ్యమంటే, దేశమును పరిపాలించే అధికారస్థులు దేశములో ఉండే ప్రజలకు లోబడి ప్రజల మాటప్రకారమే వ్యవహరించడము. అధికారస్థులను ప్రజలు ఏవిధముగా తమకులోబడి ఉండేటట్లు చేయగలరు? అంటే, శాసననిర్మాణ సభలోని సభికులను ప్రజలు స్వయంగా ఎంచి, తమ ప్రతినిధులుగా నియోగించగలరు. ఈ ప్రజాప్రతినిధులే శాసనములు చేసి, వాటిప్రకారము రాజ్యవ్యవహారము నిర్వహించుటకుగాను తామే అధికారస్థులను నియోగించగలరు. ప్రజాప్రతినిధులు చేసిన శాసనములుగాని, వారు నియోగించిన అధికారస్థులుగాని ప్రజల ఇష్టముచొప్పున ఉండనియెడల, ఆ ప్రతినిధులను తప్పించి, వారికి బదులు ప్రజల ఇష్టము చొప్పున మంచి శాసనములు చేసి, మంచి అధికారులను నియోగించే ప్రతినిధులను ప్రజలు ఎంచుకోగలరు. ప్రజలకు సౌఖ్యము, తృప్తికలిగేటట్టు శాసనములు చేయడములోను, ఆ శాసనములచొప్పున వ్యవహారము నడపగల అధికారస్థులను నియోగించడములోను, ప్రజాస్వామిక పరిపాలనమువల్ల, ప్రజాప్రతినిధులను ఎంచే అధికారముగల ప్రజలగణముల ద్వారా, ప్రజలు తమ ఇష్టము సాధించుకోగలరు.

5. ఇదివరకెన్నడును ఇండియా దేశస్థులకు అట్టి అధికారమేమీ లేదు. ఆ అధికారము బ్రిటిషు ప్రజలే వహించి బ్రిటిషు పార్లమెంటుసభవారిద్వారా చెలాయిస్తూ వచ్చినారు. గనుక ఆ పార్లమెంటువారికే ఇండియా రాజ్యము పాలించే అధికారస్థులు ఇప్పటివరకున్ను లోబడి జవాబుదార్లుగా ఉన్నారు. తండ్రి తన బిడ్డలకు కావలసినది ఇచ్చినట్లు బ్రిటిషు ఉద్యోగస్థులే ఇండియా దేశస్థులకు కావలసినది సమకూర్చేవారు.

6. ఇకను అలాగునకాదు. పార్లమెంటువారున్ను శ్రీ చక్రవర్తిగారున్ను చేసిన ఈ సంస్కారశాసనముయొక్క తాత్పర్యమేమిటో స్పష్టముగా తెలియజేస్తాను. మునుపటివలె ఇప్పుడు ఇండియా దేశస్థులు చిన్నపిల్లలవంటివారు కారు. వివేకమున్ను దేశ

సేవయందు ఉత్సాహమున్ను గలవారయినారు; దేశోపకారకమయిన కార్యములందు ఐకమత్యము కలిగి ప్రవర్తించడము నేర్చుకొన్నారు; నోరూ వాయీ లేని మూఢులు కారు; దేశవ్యవహార విషయములో యుక్తవయస్సు వచ్చినవారే. చిన్న పిల్లవాడు పెరిగి పెద్దవాడయి తనమట్టుకు తాను మంచీ చెడ్డా ఆలోచించుకొని తన వ్యవహారము తానే క్రమక్రమముగా చక్కబెట్టనేర్చుకొని, నిండువయస్సులో స్వతంత్రుడయినట్టే, ఇండియా దేశస్థులు తమ రాజ్యవ్యవహారము తాము స్వయముగా చూచుకో తగిన దశలో ఇప్పుడు ఉన్నారు.

7. ఈ అభిప్రాయమునకు అనుకూలముగా ప్రజాస్వామికపరిపాలనసిద్ధికి ఉచితమయిన ఆరంభోపాయము సంస్కారశాసనమందు చేరియున్నది.

8. ఈ ఆరంభోపాయము దేశమునకు వాస్తవముగా ఎట్లు ఉపచరించునో తెలుసుకోవలెనంటే, ఇప్పటి సంస్కారశాసనమువల్ల కలగబోయే వ్యవస్థాస్వరూపము బాగా బోధపర్చుకొని, దానికిన్ని ఇప్పటివరకున్ను జరుగుతూవచ్చిన పితృసంరక్షవిధానమునకున్ను ఎంత తారతమ్యమున్నదో విమర్శించి చూడవలెను.

9. రాజ్యము ఒకవిధమయిన కట్టడమని ఈ గ్రంథమున వెనుక ఒకచోట చెప్పినాను గదా. కట్టడమనగా మానవశరీరమువలె వివిధమైన అవయవములు కలదని భావము. పాదములమీదను కాళ్లమీదను శరీరముయొక్క అవయవములు నిలబడి ఉండును. శిరస్సులోని మస్తిష్కము తక్కిన అన్నిటిని లోబర్చుకొని వాటిమీద అధికారము చెలాయించును. అట్లే, ఇండియా రాజ్యమనే కట్టడములో వివిధమయిన భాగములున్నవి. పాదములు మొదలుకొని శిరస్సువరకు ఒకదానికంటె ఒకటి ఉన్నతముగా మానవశరీరములోని భాగములు అమరి ఉన్నట్లే రాజ్యమనే కట్టడములోని భాగములుకూడా పరస్పరసంబంధము కలిగి ఉన్నవి. గ్రామములు, తాలూకాలు, జిల్లాలు ఈ కట్టడములో పాదాలవంటివి. వీటి పరిపాలనము మండలపరిపాలనమునకున్ను మండలపరిపాలనము ఇండియా పరిపాలనమునకున్ను లోబడి ఉన్నవి. ఇండియా పరిపాలనమయినా స్వతంత్రమయినదికాదు. అది సెక్రటరీ ఆఫ్ స్టేటుగారి పరిపాలనమునకు లోబడి ఉన్నది. అదికూడా బ్రిటిషు పార్లమెంటువారి పరిపాలనకు లోబడినదే; ఆ పార్లమెంటుసభవారి పరిపాలనమయినా స్వతంత్రమయినది కాదు. ఆ సభవారి పరిపాలనము వారిని ప్రతినిధులుగా ఎంచుకొని నియోగించిన బ్రిటిషు ప్రజలగణముల అధికారమునకు లోబడి ఉన్నది.

10. ఇప్పుడు నేనుచెప్పినదానినిబట్టి ఇండియాదేశ పరిపాలనముపైని ప్రధానాధికారము బ్రిటిషు ప్రజలగణములయందు ఉన్నదని తెలిసినదిగదా. ఇప్పుడు పార్లమెంటువారు చేసిన సంస్కారశాసనమువల్ల ఈ ప్రధానాధికారము ఇదివరకున్నట్లు బ్రిటిషు ప్రజాగణములయందు మరిఉండక, ఇటుపయిని ఇండియాదేశపు ప్రజాగణములయందే నిలిచి ఉండగలదు. ఇది మొదటి దశ; క్రమక్రమముగా ఇండియా పరిపాలనము అంతా ప్రతినిధులను ఎంచే ప్రజల అధికారమునకు లోబడి ఉంటుంది.

11. అది ఎట్లువునా, ఇండియా దేశమందున్న సమస్తమయిన ప్రజల తరఫున ప్రథమ దశలో ప్రతినిధులను ఎంచి నియోగించే అధికారముగలిగినవారికి దేశప్రభుత్వము ఎట్లు లోబడి ఉండునో, రాజ్యములోని అవయవములు ఒకొక్కదానినిబట్టి తెలియజేస్తాను.

12. మొట్టమొదట లోకల్ సెల్ఫ్ గవర్నమెంటు (స్థానిక స్వయంపరిపాలనము) ఎట్లు జరుగునో ఆ విధానము చెప్పుతాను. ఇందులో గ్రామాలు, తాలూకాలు, జిల్లాలు—వీటి వ్యవహారము చేరియున్నది.

13. ఒకొక్క ప్రదేశములో బాలవిద్య, ప్రజారోగ్యము రోడ్లు వేయించుట మొదలయినవాటితో సంబంధించిన వ్యవహారములున్నవి. ఇవి మ్యునిసిపాలిటీలున్ను, లోకల్ బోర్డులున్ను నిర్వహించుకొంటవి. వీటిలో ప్రజలు ఎంచుకొని నియోగించిన సభికులు కొందరున్ను, ప్రభుత్వమువారు నియోగించిన సభికులు కొందరున్ను ఉంటారు. పార్లమెంటువారు చేసిన కొత్త సంస్కారము ప్రకారము ఇటుపయిని వీటిలో మెంబర్లు అందరూ ప్రజా ప్రతినిధులుగా ప్రజలు ఎంచుకొని నియోగించినవారే ఉంటారు, గనుక, అందరు మెంబర్లున్ను ప్రజలకు లోబడి స్థానికవ్యవహారము నిర్వహించవలసినవారు అవుతారు. ఇట్లు స్థానికపరిపాలనము సంపూర్ణముగా ప్రజాస్వామిక మవుతుంది. అన్ని గ్రామాలలోను, అన్ని తాలూకాలలోను, అన్ని జిల్లాలలోను మ్యునిసిపాలిటీ వ్యవహారములున్ను, లోకల్ బోర్డు వ్యవహారములున్ను వీలయినంతమట్టుకు ప్రజల అధీనములోనే ఉంటవి. పైవారి ఖరోడా ఉన్నా, అతిస్వల్పము; అది లెక్కలోనిది కాదు. ఇట్లు ప్రజలు స్వయంపరిపాలకులయి తమవ్యవహారము తామే నిర్వహించేవారవుతారు.

14. మ్యునిసిపాలిటీలలోను లోకల్ బోర్డులలోను ఇట్టి స్వాతంత్ర్యము ప్రజలకు సిద్ధించడము అల్పే ఘనమయినదికాదని తలంచకూడదు. కొన్ని విషయములు చక్కగా మనస్సుకు పట్టించుకొంటే, దానిఘనత బోధపడుతుంది: మొదటిది—గ్రామాలు కొన్ని కలిసి తాలూకాలున్ను, తాలూకాలు కొన్ని కలిసి జిల్లాలున్ను అవుతవి; గనుక దేశములో గ్రామాలే ప్రధానమయిన భాగములు; శరీరములో జీవమును నిలిపే రక్తము వంటివి. తొమ్మిది లక్షలకన్న ఎక్కువగా మనదేశమందు గ్రామాలున్నవి. ఇండియా దేశస్థులలో, 15 గురికి ఒక్కరు వంతున మాత్రమే నగరవాసులున్నారు; తక్కిన వారందరూ గ్రామవాసులే. ఈ గ్రామవాసులే భూమి దున్ని దేశస్థులకు తిండిపెట్టి పోషించేవారు; కష్టమయిన పనులుచేసే కూలీలు; ప్రాణాలు దాచుకోక యుద్ధము చేసి దేశమునుకాపాడే యోధులు వారే. పూర్వకాలమునుండి జరుగుతూవచ్చిన దండయాత్రలవల్లను, యుద్ధములవల్లను, ఎక్కువగా ప్రజానాశనమయినా, మరల దేశములో ప్రజలు సమృద్ధిగా ఉన్నట్లు చేసినవి పల్లెటూళ్లే. "రాయల పరిపాలనము రయితులను కాపాడితేనే నిలుస్తుంది" అనే అర్థముగల సామెత ఒకటి ఉన్నది. గ్రామాలలో ఉన్న రయితుల క్షేమమే దేశపరిపాలకులకు ప్రధానకర్తవ్యముగా చిరకాలమునుండి ఏర్పడిఉన్నది. గనుకనే రయితులన్నమాట రాజ్యమందున్న ప్రజలకందరికి వర్తిస్తున్నది. చక్కగా ఆలోచిస్తే గ్రామాలలోను, తాలూకాలలోను, జిల్లాలలోను ఉండే రయితులు స్థానికవ్యవహారములో స్వయంపరిపాలకులు కావడమే మిక్కిలి ఘనమయిన విషయముగా తలచక తీరదు.

15. రెండవది—మండలప్రభుత్వముపైనిన్ని, దేశప్రభుత్వముపైనిన్ని అధికారము నిర్వహించడమునకు ప్రజలు తగిన యోగ్యతకలవారు కావలెనంటే, సరియైన తర్ఫీయతు పొందవలెను; ఆ తర్ఫీయతు స్థానికప్రభుత్వమందే ఎక్కువగా పొందవచ్చును. స్థానికప్రభుత్వము సామ్రాజ్యప్రభుత్వమునకు తర్ఫీయతుచేసే విద్యాలయము (ట్రెయినింగ్ స్కూల్) వంటిది, అని గ్లాడ్‌స్టన్‌గారి అభిప్రాయము. ఎందుచేత? దేశప్రభుత్వము నిర్వహించతగినవారిని ఎంచవలసినప్పుడు వారి యోగ్యత పరీక్షించే సామర్థ్యము ప్రజలకు స్థానికప్రభుత్వములో కలిగిన అనుభవమువల్ల కుదురుతుంది. రిపన్ ప్రభువుగారికన్న ఎక్కువ ప్రజారంజకులయిన రాజప్రతినిధులుండరు; ఆయనకూడా స్థానికపరిపాలనమువల్ల ప్రజలకు నీతివిద్య అలవడి, వివేకము వృద్ధి పొందుతుందని అన్నారు. బ్రిటిషు రాజ్యవ్యవస్థకు స్థానికపరిపాలనము పునాది. ఎందుచేతనంటే స్వస్థానమందున్న బోర్డువారు చేసే స్థానికపరిపాలనమువల్ల తాము సుఖపడుతున్నారో లేదో ప్రజలు అనుభవముచేతనే తెలుసుకొని, స్వయంపరిపాలన మెట్లుండవలెనో బోధపర్చుకోగలరు. గనుక, గ్రామాలలోను, తాలూకాలలోను, జిల్లాలలోను ఉన్న ప్రజలకు స్థానికవిషయములలో అనగా మ్యునిసిపాలిటీ, లోకల్ బోర్డు వ్యవహారములో సంపూర్ణ స్వయంపరిపాలనాధికారము ఇయ్యడమువల్ల ఇప్పటి సంస్కారము వాస్తవముగా అమోఘమయిన ఉపాయమని స్పష్టమయినది. దీనినిబట్టి స్థానికవ్యవహారమందు రాజ్యము సంపూర్ణముగా ప్రజాస్వామికమయినదని తేలినది.

16. ఇంతేకాదు; మరిఒక లాభముకూడా ఉన్నది—ఆలోచించండి: ఇదివరకు గ్రామాలలో ఉన్నరయితులకుగాని, పట్టణములందున్న పనివాళ్లకుగాని, మండలప్రభుత్వములో ఏమీ అధికారములేదు. ఇటుపైని అలాగుండదు. ఎంతోకొంత నిర్ణయమయిన సిస్తు చెల్లించే రయితులకున్ను ఎంతోకొంత నిర్ణయమయిన ఆదాయముగల పనివాళ్లకున్ను, తమ గ్రామాలలోను, తమ తాలూకాలలోను, తమ జిల్లాలలోను ఉన్న స్థానికపరిపాలనమందేకాక, మండలప్రభుత్వమందున్న అధికారము చెలాయించే హక్కుగల "ఇలెక్టర్లు" అవుతారు. ధనికులైన భూస్వాములతోను, విశ్వవిద్యాలయములలో కొంతకాలమయి పట్టపరీక్షలిచ్చి విద్యాధికులుగా ఉన్నవారితోను, చాలా అద్దెఇచ్చి పెద్ద ఇండ్లలో కాపురముండే గొప్పగృహస్థులతోను, ఈ రయితులున్ను పనివాళ్లున్ను ప్రభుత్వమువారిపై అధికారము చెలాయించుటలో సమానమయిన హక్కుగలవారుఅవుతారు.

6 వ అధ్యాయము.

మండలశాసననిర్మాణసభల సంస్కారము.

వెనుకటి అధ్యాయములో ప్రజాస్వామిక పరిపాలనము స్థానికప్రభుత్వమందు ఎంత అభివృద్ధి పొందగలదో తెలియజేసినాను. దేశపరిపాలనవ్యవస్థలో స్థానిక ప్రభుత్వముకంటె గొప్ప అవయవమైన మండలప్రభుత్వము ఎట్లు అభివృద్ధి పొందునో చూతాము. ఈ మండలప్రభుత్వము రెండు భాగములుగా ఉన్నది: ఒకటి శాసన నిర్మాణము; రెండవది కార్యనిర్వహణము. శాసననిర్మాణసభవారు పరిపాలనమును విధించే శాసనములు చేస్తారు; కార్యనిర్వహణసభవారు ఆ శాసనముల ననుసరించి రాజ్యవ్యవహారము నడిపిస్తారు.

2. శాసననిర్మాణసభలో ప్రజాస్వామికప్రభుత్వము ఎంతమట్టుకు వృద్ధిపొందినదో మొదట విచారింతాము.

3. ఇప్పటివరకు ఆ సభలోని సభికులు మూడు విధములుగా ఏర్పడుతున్నారు: (1) ప్రభుత్వము చేస్తూ ఉన్న ఉద్యోగస్థులు కొందరు; (2) ప్రభుత్వమువారు నియోగించిన అనుద్యోగస్థులు-యూరోపియన్లు కొందరు, ఇండియా దేశస్థులు కొందరు. (3) వర్తకసంఘములు (చేంబర్జ్ ఆఫ్ కామర్స్), విశ్వవిద్యాలయములు (యూనివర్సిటీలు), భూస్వాములు, మహమ్మదీయులు, యంత్రశాలాధికార్లు, ఇతర సంఘములు, మ్యునిసిపాలిటీలు, డిస్ట్రిక్టు బోర్డులు మొదలయిన గణములు, ప్రజాప్రతినిధులుగా ఎంచి సిఫారసుచేస్తే ప్రభుత్వమువారు నియోగించినవారు కొందరు. వీరిలో మూడవ విధమున నియుక్తులయినవారు మాత్రమే ప్రజలు ఎంచుకొన్న ప్రజాప్రతినిధులనుటకు తగినవారు. అయితే ఇందులోనైనా జరిగే విధానము పేరుకు మాత్రమేకాని వాస్తవముగా ప్రజాప్రాతినిధ్యముకాదు. ఎందుచేతనంటే, ప్రజాప్రతినిధులను ఎంచుకొని నియోగించే అధికారము వాస్తవముగా ప్రజాగణములకు లేదు; నియోగించే అధికారము ప్రభుత్వము వారియందే ఉన్నది. ప్రజాగణములు ఎంచి సిఫారసుచేసినవారిని ప్రభుత్వమువారు అంగీకరించవచ్చును; లేదా, నిరాకరించవచ్చును. గనుక మొత్తముమీద శాసననిర్మాణసభ వాస్తవముగా ప్రభుత్వమువారు ఏర్పరిచినదేకాని ప్రజాస్వామికముకాదు.

4. వచ్చే సంవత్సరమునుండిన్ని సంస్కారశాసనముననుసరించి ఈ విధానము మారుతుంది. ఇటుపైని మునుపటికన్న ఎక్కువగావున్న ప్రజాగణములు ఎంచుకొని నియోగింపగా వచ్చే సభ్యులు సభలో నూటికి 70 వంతున ఉంటారు. ప్రజాగణములలో వ్యవసాయదార్లు, పనివాళ్లు, చిల్లర వర్తకులు, గొప్ప వర్తకులు, వృత్తిచేతనే జీవనము చేసేవారు మొదలయినవారు ఉంటారు. ఇంతేకాక చెన్నపురి మండలములో బ్రాహ్మణేతరులు, బొంబాయి మండలములో మరాటీలు, పంజాబులో సిక్కులున్ను మహమ్మదీయులవలె ఒక విశిష్టగణముగా ఏర్పడి తమ ప్రతినిధులను ఎంచుకొంటారు.

5. ఇదివరకు ప్రభుత్వమువారికి మాత్రము లోబడి ఉన్న మండలశాసననిర్మాణసభ కొత్త సంస్కారమువల్ల ఇటుపైని ప్రజలకు లోబడినది కాగలదు. ఎందుచేతనంటే అన్ని

జాతులవారున్ను, అన్ని వృత్తులవారున్ను, వివిధవ్యవహారములతో సంబంధముగలవారున్ను అనేకులు ప్రతినిధులను ఎంచే గణములలో ఇకనుంటారు. వారు ఎంచే ప్రతినిధులు సభవారిలో సగముకన్న చాలా అధికముగానే ఉంటారు.

6. వాస్తవమైన ప్రజాప్రతినిధులు శాసననిర్మాణసభలో ఎక్కువగా ఉంటే రాజ్యవ్యవహారములో ఎట్టి మార్పు కలుగునో ప్రజలకు ఎంత లాభము కలుగునో, చూడండి; ఇటుపైని చేసే శాసనములు అధికారుల ఇష్టము చొప్పున ఉంటవిగదా. ఈ ప్రజాప్రతినిధులు తమ్ము ఎంచుకొని నియోగించిన ప్రజలకు ఏ శాసనములు మంచివనిన్ని లాభకరమైనవనిన్ని తోచునో అట్టివేకదా చేస్తారు. వారు అట్టి శాసనములు చేయకుంటే, ప్రజాగణములు తిరిగీ వారిని ప్రతినిధులుగా ఎంచరు.

7. మరి ఒక సంగతి—ఇదివరకు మండలాధిపతి (గవర్నరు) గారే శాసననిర్మాణసభకు అధ్యక్షులుగా ఉన్నారు. ఇటుపైని సంస్కారశాసనము ననుసరించి వారు అధ్యక్షత వహించరు. నాలుగు సంవత్సరములు మాత్రము మరిఒకరిని అధ్యక్షునిగా వారే నియోగిస్తారు. అటుపయిని శాసననిర్మాణసభవారు, బ్రిటిషు పార్లమెంటులోని ప్రజాప్రతినిధుల శాఖగా ఉన్న కామన్జ్ సభవలె, స్వయంగా తమ అధ్యక్షుని ఎంచుకొంటారు. అయితే సభవారు ఎంచుకొన్న అధ్యక్షుని గవర్నరుగారు ఒప్పుకోవచ్చును; లేదా, మానవచ్చును. ఈ అధికారము మాత్రము గవర్నరుగారికి ఉంటుంది.

8. ఈ అధ్యక్షుని నియోగించే అధికారము గవర్నరుగారికి ఉండేటట్లు సంస్కారశాసనములో ఎందుకు ఏర్పాటు చేయడమైనది? అధ్యక్షుని ఎంచుకొనే అధికారము మొదటినుండిన్ని సభవారికి ఎందుకు ఇయ్యలేదు? అంటే—

9. అందుకు తగిన కారణము లేకపోలేదు. ఇటుపయిని శాసనసభలు పెద్దవిగా ఉంటవి; చాలామంది సభికులు ఉంటారు. అంత పెద్ద సభలో మర్యాద మీరకుండా, శాంతముతో చర్చలు జరిగేలాగు చేయడమున్ను, తరుచుగా పుట్టే తగవులు తీర్చడమున్ను, పద్ధతిప్రకారము కార్యక్రమము తప్పకుండా పని జరిగించడమున్ను సుకరము కాదు; అధ్యక్షుడు చాలా అనుభవశాలి, ధీరచిత్తుడు, ప్రత్యుత్పన్నమతి, అయి ఉండవలెను; సభ నెమ్మదిగా జరిగే క్రమము నిర్ణయించుటలోను, అప్రసక్త ప్రస్తావములు వారించుటలోను నేర్పు, చురుకుతనముకూడా కలవాడు కావలెను. కొత్త శాసనము అమలులోనికి వచ్చిన తర్వాత మొదటి నాలుగు సంవత్సరములు పని జరిగినపైని సభవారికి కొంత అనుభవము కలుగుతుంది; గనుక, వారిలో అధ్యక్షులుగా ఉండతగినవారు అప్పుడు లభ్యులవుతారు.

10. అయితే ఈ నాలుగు సంవత్సరములయిన తర్వాతనయినా శాసనసభవారు తమ అధ్యక్షుని తాము ఎంచుకొని తామే నియోగించకుండా గవర్నరుగారి అనుమతికి ఎందుకు లోబడవలెనంటే.

11. దానికి సమాధానము స్పష్టముగానే ఉన్నది. మండలవ్యవహారములు తిన్నగా నడిపించే పూచీ మొత్తానికి గవర్నరుగారిమీదనేగదా ఉంటుంది. శాసన నిర్మాణసభకు అధ్యక్షుడుగా లేకపోయినా, సభాకార్యములు మొత్తముమీద యుక్తముగా జరుగుచున్నవో లేదో పరిశీలించవలసిన పూచీ ఆయనదేకదా. గనుక అధికారము ఇప్పటికి ఆయనయందు ఉంచినారు. శాసనము ప్రకారము ఆ అధికారము ఆయనకున్నా, సభవారు ఎంచుకొన్న అధ్యక్షుని సాధారణముగా ఆయన అంగీకరిస్తారని మనము నమ్మవచ్చును. ఇట్టి విషయములలో ఇదివరకు మనకు కలిగిన అనుభవజ్ఞానము చేత ఇట్టి నమ్మకము సరియైనదని చెప్పవచ్చును. ఇందుకు ఒక నిదర్శనము చూడండి. గత

27 సంవత్సరములయి అమలులో ఉన్న శాసనము ప్రకారము శాసననిర్మాణసభలకు మెంబర్లుగా కొన్ని గణములవారు ప్రతినిధులను ఎంచుకొని, గవర్నమెంటువారి అనుమతికి లోబడిగదా నియోగిస్తూ ఉన్నారు. అట్టి మెంబర్లను గవర్నమెంటువారు ఎన్నడూ ఇదివరకు నిరాకరించలేదే.

12. ఇంతవరకు మండలశాసననిర్మాణసభాసంస్థాపనలోను, మండలవ్యవహారములు చక్కగా జరిగేటట్లు శాసనములు చేసే అధికారములోను, సంస్కారశాసనముబట్టి కలిగిన మార్పులు వివరించి చెప్పినాను.

13. రాజ్యనిర్వాహకసభపైనిన్ని, రాజ్యవ్యవహారములపైనిన్ని శాసనసభవారికి అధికారము ఉండేటట్టుగా సంస్కారశాసనమువల్ల ఎంత విశిష్టమయిన గొప్పమార్పు కలిగినదో చూడండి.

14. ఇప్పటివరకూ మండలశాసనసభలకు వట్టిసలహా ఇచ్చే అధికారమే ఉన్నది. గవర్నమెంటువారు తమకు ఇష్టమైతే, వారి సలహా అంగీకరించవచ్చును; లేకుంటే నిరాకరించవచ్చును. అయితే, సంస్కారశాసనమువల్ల కార్యనిర్వాహకసభవారికి సలహా ఇచ్చుటకు బదులుగా వారిని శాసించే అధికారము కొంతమట్టుకు శాసనసభవారికి కలిగినది.

15. అట్టి మార్పు ఈ సంస్కారశాసనమువల్ల ఏలాగున కలిగినదంటే—మండలాధిపతియైన గవర్నరుగారు కొందరిని మంత్రులుగా నియోగిస్తారు. రాజ్యనిర్వాహకసభలోనివారుగాని, గవర్నమెంటు ఉద్యోగస్థులుగాని, ఇట్టి మంత్రులుగా ఉండకూడదు. "విద్య," "ఆరోగ్యము," "ఆబ్కారీ" మొదలయిన కొన్ని విషయములను గురించి రాజ్యవ్యవహారమంతా ఈ మంత్రుల అధికారమునకు లోబడి ఉంటుంది. ఈ విషయములు గవర్నమెంటువారు తమ స్వాధీనమందుంచుకోక పరుల అధీనము చేసినారు; గనుక వాటికి పరాధీనపు విషయములు (ట్రాన్స్‌ఫర్డ్ సబ్జెక్ట్సు) అని పేరు; తమ స్వాధీనములో ఉంచుకొన్న విషయములకు స్వాధీనపు విషయములు (రిజెర్వ్‌డ్ సబ్జెక్ట్సు) అని పేరు. పరాధీనపు విషయముల వ్యవహారము నడిపించే మంత్రులుగా ఎట్టివారు నియుక్తులవుదురో చూడండి. మండలశాసననిర్మాణసభలో ప్రజల ప్రతినిధులుగా ప్రజలు స్వయంగా ఎంచుకొని నియోగించిన సభ్యులైఉన్నవారిలోనే తమకిష్టమైనవారిని గవర్నమెంటువారు మంత్రులుగా నియోగించవలెను. లేదా, ఒకవేళ గవర్నమెంటువారిచే మంత్రులుగా నియుక్తులయినవారు శాసననిర్మాణసభలో ప్రజలు ఎంచుకొని నియోగించిన సభ్యులై ఉండకపోతే, మంత్రిస్థానమందు వారు గవర్నరుగారిచే నియుక్తులయిన తేది మొదలుకొని ఆరు మాసములలోగా ఏదో ఒక ప్రజాగణముచేత ప్రజాప్రతినిధులుగా నియుక్తులుకావలెను. ఏ మంత్రియొక్క వ్యవహారపద్ధతి శాసనసభవారికి ఇష్టముకాదో ఆ మంత్రి అధీనమైన విషయవ్యవహారము నిర్వహించడమునకు కావలసిన ఆయవ్యయముల ఏర్పాటు కాకుండా నిరాకరించే అధికారము ఆ సభవారికి ఉన్నది. అప్పుడు ఆ మంత్రి తన మంత్రిత్వము మానుకోవలసినదే. సభవారికిష్టమైన పద్ధతిని వ్యవహారము చేసే మరి ఒకరిని గవర్నరుగారు మంత్రిగా నియోగించవలెను. శాసననిర్మాణసభలో నూటికి 70 మంది చొప్పున ప్రజలు ఎంచుకొన్న సభ్యులే ఉంటారు గనుక ప్రజలయెడల స్నేహము, అభిమానముగలవారిని మంత్రులుగా నియోగిస్తే ఆ మంత్రుల వ్యవహారమును సభవారు అంగీకరించి ఆమోదిస్తారు. ఈ మంత్రులు తమ అధీనమైన విషయముల వ్యవహారమంతా నడిపిస్తారు. ఆ విషయముల వ్యవహారములో వారి సలహా అనుసరించి గవర్నరుగారు ప్రవర్తిస్తారు. వారి సలహా ఆయనకిష్టము కాకుంటే ఆయన తనకు ఉచిత

మని తోచినట్టు వ్యవహరించవచ్చును. అప్పుడు మంత్రులు చేయవలసినదేమంటే—గవర్నరుగారి అభిప్రాయమునకు విరుద్ధముగా తమ అభిప్రాయము ప్రకారమే వ్యవహరించవలెననే పట్టుదలలేకుంటే, మంత్రిపదమందుండవచ్చును; అట్లుగాక స్వతంత్రబుద్ధిగలవారయితే, మంత్రిత్వము విడిచిపెట్టుకోవచ్చును. మొదటి పక్షములో, అనగా మంత్రిపదవికోసము వారు తమ స్వాతంత్ర్యము విడిచిపెట్టుకొంటే, ఏమి జరుగునో చూడండి: సభలో ఎక్కువమంది ప్రజలు ఎంచుకొని నియోగించినవారే ఉంటారు గనుక శాసననిర్మాణసభవారు అట్టి మంత్రులను చూచి, తమ సలహాయందు గవర్నరుగారికి లక్ష్యము లేకపోయినా, వారు తమ మంత్రిస్థానము విడవకుండా ఉండడము దాస్యము చేయడమువంటిది అని తలచి, అనేక విధాల ఆ మంత్రులను అవమానపరిచి, క్రమముగా వారు మంత్రిత్వము నిర్వహించకుండా ఆటంకపెట్టకమానరు. అప్పుడు ఆ మంత్రులు తమ పని మానుకోక తప్పదు. గనుక, గవర్నరుగారు నియోగించిన మంత్రులను పనిలోనుండి తొలగించే అధికారము ప్రజాప్రతినిధులు అధికముగా గల శాసననిర్మాణసభవారికి ఉన్నట్టే తేలినది. కొత్తసంస్కారశాసనమువల్ల ఏర్పడ్డ ప్రజాస్వామికపరిపాలనము ఎంత గొప్పదో ఎంత ప్రభావముగలదో చూచినారా?

16. మీద చెప్పినట్లు మంత్రులకున్ను గవర్నరుగారికిన్ని ఐకమత్యము కుదరక మంత్రులు పని మానుకొన్నప్పుడు, సభవారు సమ్మతించే మంత్రులను గవర్నరుగారు తిరిగీ నియోగించేదాకా పరాధీనవిషయముల వ్యవహారము నిర్వహించడమునకు గవర్నరుగారే ఏవో తగిన ఏర్పాట్లు అప్పటిమట్టుకు చేయవచ్చుననికూడా సంస్కారశాసనములోనే ఉన్నది.

17. గనుక స్పష్టముగా కనబడుతున్నది గదా ప్రజాప్రతినిధుల ఇచ్ఛాశక్తి ఎంత ప్రభావముగలదో; మంత్రులు తమ మంత్రిత్వము సంపాదించుకోవడమునకున్ను దానిని నిలుపుకోవడమునకున్ను మండలశాసననిర్మాణసభలో ఉన్న ప్రజాప్రతినిధుల ఇచ్ఛాశక్తే ఆధారము; వారి ఇచ్ఛాశక్తే మంత్రుల అధికారమును పోగొట్టగలదు కూడాను.

18. కొత్త సంస్కారశాసనమువల్ల లభించిన ప్రజాస్వామికప్రభుత్వము యొక్క మొదటి దశలో శాసననిర్మాణసభ, రాజ్యవ్యవహారనిర్వాహకసభ ఎట్లుండునో దీనినిబట్టి తెలుసుకోవచ్చును. పజాస్వామికప్రభుత్వము ఇప్పటిమట్టుకు పరాధీనవిషయముల వ్యవహారమందు మాత్రమే కలిగినది. కొత్త వ్యవస్థ కొంతకాలము అమలులో ఉంటే, ఈ సభలలో శ్రద్ధతో పనిచేయడముచేత సభవారికి రాజ్యవ్యవహారమందు అనుభవము కలుగుతుంది. అటుపైని ప్రజాస్వామికప్రభుత్వము ఎక్కువయి, క్రమక్రమముగా అన్ని విషయముల వ్యవహారములలోను స్థిరపడి పరమావధిని పొందుతుంది.

7 వ అధ్యాయము.

మండలప్రభుత్వమందున్న వ్యవహారనిర్వాహకసభల సంస్కారము.

ఇకను, గవర్నరుగారున్ను ఆయన వ్యవహారనిర్వాహకసభవారున్ను చేసే పరిపాలనవిషయములో శాసననిర్మాణసభవారి అధికారము క్రొత్తసంస్కారమువల్ల ఎంత విస్తరించినదో చూడండి. ప్రభుత్వమువారు చేసే పనులలో ప్రజలనుండి పన్నులు వసూలు చేయడమున్ను వసూలు చేసిన సొమ్ము ప్రజలకు ఉపచరించేటట్లు కర్చుపెట్టడమున్ను ప్రధానమైనవి. పన్నులు ఎవరివద్దనుండి వసూలు చేస్తున్నారో, ఎవరి ఉపయోగము కోసము ఆ వసూలయిన సొమ్ము కర్చుపెట్టుచున్నారో అట్టి ప్రజలకు పన్నులు వసూలు చేయడము గురించిగాని కర్చుపెట్టడము గురించిగాని ఇప్పుడు ఏమీ అధికారములేదు. ప్రజాస్వామికప్రభుత్వమందు ప్రజాప్రాతినిధ్యము లేకుండా పన్నులు విధించడముండదు. అనగా అట్టిప్రభుత్వమందు రాష్ట్రీయముయొక్క ఆయవ్యయములు ప్రజల ప్రతినిధుల అధీనమయి ఉంటవి. ఇప్పుడు అమలులో ఉన్న పద్ధతి ప్రకారము శాసననిర్మాణసభలోని సభ్యులు ఎవరిమట్టుకు వారు ఆయవ్యయములు విమర్శించడమునకు మాత్రమే అధికారమున్నది ; గాని, మొత్తముమీద సభవారు సభయొక్క అభిప్రాయములు నిరూపించి ప్రకటించడమునకు వల్లపడదు. అయితే, క్రొత్తసంస్కారమువల్ల ఈ పద్ధతి మారిపోయినది. ప్రతి సంవత్సరమున్ను మండలముయొక్క ఆయవ్యయముల విషయములో ప్రభుత్వమువారు వేసిన మదింపు విమర్శించి, ఇష్టమైతే అంగీకరించుటకుగాని, కాకుంటే, నిరాకరించుటకుగాని, శాసననిర్మాణసభవారికి క్రొత్తసంస్కారమువల్ల అధికారము కలిగినది. ఆయముయొక్క మొత్తమంతాగాని, వ్యయముయొక్క మొత్తమంతాగాని, వాటి బాబతు పద్దులలో ఏదైనా ఒకటిగాని, శాసననిర్మాణసభవారు హెచ్చించుటకైనా, తగ్గించుటకైనా, ఈ సంస్కారశాసనమువల్ల అధికారము గలవారయినారు.

2. ఈ అధికారమునకు బాధకముగా ఒక నిరోధము సంస్కారశాసనమందు ఉన్న మాట నిజమే. ఆ నిరోధమేమిటంటే : శాసననిర్మాణసభవారి నిశ్చితాభిప్రాయము మండలాధిపతియైన గవర్నరుగారికి ఇష్టము కాకపోతే, ఆ అభిప్రాయము ననుసరించి పని జరగనీయకుండా, నిరాకరించడమునకు సంస్కారశాసనమువల్ల గవర్నరుగారికి అధికారమున్నది. రాజ్యవ్యవస్థ ననుసరించి నియంత్రితమైన ప్రభుత్వముగల దేశములలో కూడా రాజ్యాధికారికి ఇట్టి విషయములలో ఇట్లు నిరోధించే అధికారము ఉన్నది. రాజ్యముయొక్క మేలుకీళ్లకు పూచీపడవలసినవాడు రాజ్యాధికారి, గనుక, శాసననిర్మాణసభవారి పొరబాట్లవల్ల దేశమునకు కీడు గలుగకుండా, శరణోపాయముగా ప్రయోగించుటకు ఈ అధికారము అతనికున్నది. అయితే, ప్రజాస్వామిక ప్రభుత్వముగల ఇతర దేశములందు, అందులో ముఖ్యముగా బ్రిటిష్ దేశమందు, చాలా కాలమయి జరుగుతూ ఉన్న ఆచారము పరిశీలించి చూస్తే, ఈ నిరోధాధికారము శాసనస్థమై నిలిచి ఉన్నా, రాజ్యాధికారులు మాత్రము దానిని చెలాయించడము మిక్కిలి అరుదైనట్లు కనబడుతున్నది. ఆ అధికారము తరుచుగా చెలాయిస్తే, గొప్ప చిక్కులు కలుగక మానవు. గనుక రాజ్యాధికారికున్న ఈ నిరోధాధికార

ము మాజీ కాకపోయినా, కొంత కాలమునకు అప్రచారమయి, మరి అమలులో ఉండదు. శాసననిర్మాణసభవారికి రాజ్యవ్యవహారములో బాగా అనుభవము కలిగేవరకూ, ప్రజాస్వామిక ప్రభుత్వము మొదటి దశలో పొరబాట్లవల్ల రాజ్యమునకు కీడు కలుగకుండా, ఇట్టి నిరోధాధికారము అవశ్యమయిన రక్షణోపాయముగా అందరున్ను అంగీకరించవలసినదే.

3. సంస్కారశాసనమువల్ల మండలప్రభుత్వములో కలిగిన మార్పులను గురించి చెప్పవలసిన విషయము మరొక్కటి ఉన్నది ; అదిన్ని ముఖ్యమయినదే.

4. 1910 వ సంవత్సరము దాకా ముగ్గురు అధికారస్థుల పరముగా మండల ప్రభుత్వము సాగుతూవచ్చినది. "గవర్నమెంటువారు" అన్నా, "ప్రభుత్వమువారు" అన్నా, ఆ ముగ్గురే. వారు ముగ్గురున్ను బ్రిటిష్ దేశస్థులు ; వారిలో ఒకరు గవర్నర్ అనే హోదా గలవారు ; తక్కిన ఇద్దరున్ను, ఇండియన్ సివిల్ సెర్వీస్ ఇలాకావారు. "మండలప్రభుత్వనిర్వాహకసభ" అనేది ఈ ముగ్గురున్ను చేరగా ఏర్పడినదే. అయితే, 1910 వ సంవత్సరములో ఇండియా దేశస్థులలో ఒక్కరిని ఈ సభలో చేర్చినారు. అందుచేత ఇప్పుడు నలుగురున్నారు. వీరిలో ముగ్గురు బ్రిటిషు దేశస్థులు ; ఒక్కరు మాత్రమే ఇండియా దేశస్థులు.

5. సంస్కారశాసనమువల్ల ఈ మండలప్రభుత్వనిర్వాహకసభలో ఇండియా దేశస్థులను మరి కొందరిని సభికులుగా చేర్చుటకు అవకాశము కలిగినది. ఎలాగంటే—ఇండియన్ సివిల్ సెర్వీస్ ఇలాకావారు ఒక్కరు మాత్రమే ఈ సభలో ఉండవలసినదని సంస్కారశాసనము విధించి ఉన్నది. గనుక తక్కినవారి స్థానమందు ఇండియా దేశస్థులనే ప్రభుత్వమువారు నియోగించవచ్చును.

6. సంస్కారశాసనములో ఉన్న ఈ విధి "జాయింటు పార్లమెంటు కమిటీ" వారు చేసిన సిఫారసుతో అనుసంధానము చేసుకొని చదువవలెను. ఇప్పటికి ఇంకా అమలులో ఉన్న పాత చట్టము చొప్పున మండలవ్యవహారనిర్వాహకసభలో నలుగురి కన్న ఎక్కువ సభికులుండకూడదు. ఆ చట్టము సంస్కారశాసనమువల్ల మారలేదు. అయితే మండలవ్యవహారనిర్వాహకసభలో గవర్నరుగారికి తోడుగా ఇద్దరికన్న ఎక్కువమంది సభ్యులు ఉండకూడదనిన్ని ఆ ఇద్దరిలో ఒకరు ఇండియన్ సివిల్ సర్వీస్ ఇలాకావారయి ఉండవలెననిన్ని "జాయింటు పార్లమెంటు కమిటీ" వారు సిఫారసు చేసి ఉన్నారు. ఇంతేకాక, ఈ సభలో ఏ కారణముచేతనయినా నలుగురు మెంబర్లు ఉండడమున్ను, వారిలో ఇద్దరు గవర్నమెంటు ఉద్యోగస్థులు కావడమున్ను, సంభవిస్తే, తక్కిన ఇద్దరున్ను అనుద్యోగస్థులయిన ఇండియా దేశస్థులు కాక తప్పదని కూడా ఆ కమిటీవారు సిఫారసు చేసి ఉన్నారు. ఈ సిఫారసు బ్రిటిషు గవర్నమెంటువారు అంగీకరించి ఉన్నారు. ఆలాగున జరిగినప్పుడు, మండలప్రభుత్వనిర్వాహకసభలో ఇండియా దేశస్థుల ప్రాభవ మధికమవుతుంది ; గనుక, క్రొత్త సంస్కారమువల్ల కలిగిన ఈ లాభము ఘనమైనది.

7. ఈ సందర్భములో ఒక సందేహము సహజముగా కలుగవచ్చును.

8. సందేహము గలవారు ఏమనవచ్చునంటే—రాజ్యవ్యవహారవిషయములు కొన్ని కేటించి ఇండియా దేశస్థులయిన ఇద్దరు మంత్రుల అధీనము చేయడముచేత ఈ సంస్కారశాసనము మూలముగా మండలప్రభుత్వము కొంతవరకు ప్రజాస్వామికమైనదన్న మాట నిజమే ; ప్రజలు తమ ప్రతినిధులుగా ఎంచుకొని శాసననిర్మాణసభలో మెంబర్లుగా నియోగించిన సభ్యులలో వారే మంత్రులుగా ఉంటారన్న మాటకూడా నిజమే ; శాసననిర్మాణసభలో ప్రజలు ఎంచుకొన్న ప్రజాప్రతినిధులే ఎక్కువ

మంది ఉంటారు గనుక, మంత్రులను నియోగించే అధికారము, తొలగించే అధికారము శాసననిర్మాణసభవారి చేతులలో ఉన్నట్లు ఏర్పడునన్నమాటకూడా నిజమే; ఇది అంతా ప్రజాస్వామికప్రభుత్వలక్షణమే; గాని, మంత్రు మాటయందున్ను శాసననిర్మాణసభవారి మాటయందున్ను లక్ష్యముంచకుండా వ్యవహరించడమునకు కావలసినంత అధికారము గవర్నరుగారికి ఇచ్చిన ఈ సంస్కారశాసనమువల్ల ప్రజలకు కలిగే లాభము, అంతా కాకపోతే కొంతయినా, పోయినదికాదా? ఒక చేతితో ఇచ్చి రెండవ చేతితో తీసికొన్నట్లయినదికాదా?

9. అని శంకిస్తే, సంస్కారశాసనములో అట్టి అధికారము గవర్నరుగారికి ఉన్నదని ఒప్పుకొంటూ దానికి సమాధానము చెప్పుతున్నాను.

10. సంస్కారశాసనము గవర్నరుగారికి ఎందుకీ అధికారము కలుగజేసినదో, వారికీ అధికారము ఇచ్చినందువల్ల మనకు లభించిన ప్రజాస్వామిక ప్రభుత్వమునకు వాస్తవముగా ఏ లోపము సంభవించినదో, శాంతముగా సమబుద్ధితో విమర్శించి చూతాము.

11. రాజ్యాధికారము వహించినవారికి ఇట్టి అధికార ముండడము ప్రజాస్వామిక ప్రభుత్వముగల దేశములన్నింటిలోను కనబడుతున్నది. అమెరికా ఖండమందు యునైటెడ్ స్టేట్స్ అనే పేరుగల దేశములో ప్రజాస్వామికప్రభుత్వ మున్నదిగదా. అది దృష్టాంతముగా గ్రహించి ఆలోచించండి. ఆ దేశముయొక్క ప్రభుత్వము సంపూర్ణముగా ప్రజాస్వామికము. ప్రజలే తమకు మేలగునట్లు స్వయముగా తమ్మతామే పరిపాలించుకొంటున్నారు. అక్కడి జనులకు శుద్ధమైన సంపూర్ణ స్వయంపరిపాలనాధికారము, సంపూర్ణస్వాతంత్ర్యము కలవంటారుగదా. ప్రజాస్వామికప్రభుత్వము ప్రకారము ప్రజలకు తమ్మతాము పరిపాలించుకొనే అధికారము గలుగునట్లు అక్కడ రాజ్యవ్యవస్థ ఏర్పరచినప్పుడు, మొదట ఏమి జరిగినదో ఆలోచించండి. ప్రజల అధికారమునకు అనేక నిరోధములు ఏర్పడినవి. ఆ నిరోధములనుబట్టిచూస్తే ఆ వ్యవస్థ వాస్తవముగా ప్రజాస్వామిక ప్రభుత్వము ఏర్పరచుటకుగాను ఉద్దేశించి చేసినట్లు కనబడనే కనబడదు, అని ఆ దేశములో రాజ్యాధ్యక్షులుగా ఉన్న వుడ్రోవిల్సన్ గారు అన్నారు. ఆ వ్యవస్థయొక్క విశిష్టకల్పన, విశిష్టనిర్మాణము చూస్తే, రాజ్యాధికారముగల ప్రజలయొక్క స్వేచ్ఛావ్యవహారమువల్ల హాని కలుగునేమో అని శంకించి, ఈ కట్టుదిట్టములు బందోబస్తుగా చేసినట్లు కనబడుతున్నదని ఆయనే వ్రాసినారు. అమెరికా రాష్ట్రముల ప్రభుత్వము చేసినవారిలో మొట్టమొదటి అధ్యక్షుడు వాషింగ్టన్ గారున్ను ఇంకా మరికొందరున్ను చేరి, ఇట్టి నిరోధములతో రాజ్యవ్యవస్థ ఏర్పరచిన వారవుటచేత వారిని (కన్సర్వేటివ్జ్) ప్రాచీనాచారపరాయణులనిన్ని పురాతననీతిశాస్త్రపండితులనిన్ని కొందరు ఆక్షేపిస్తూ వర్ణించినారు. ఈ కాలమందయినా అమెరికా రాజ్యాధ్యక్షుని అధికారము కొన్ని విషయములందు, ప్రజలు నిరోధించుటకు వీలుకాకుండా, అనర్గళముగాను నిరంకుశముగాను చెల్లుతున్నది.

12. అమెరికాలో ప్రజాస్వామికప్రభుత్వము ఏర్పర్చి వ్యవస్థ చేసినవారు రాజ్యాధ్యక్షునికి అనర్గళమైన స్వతంత్రాధికారమిచ్చి శాసనసభలో ఉన్న ప్రజాప్రతినిధుల అధికారమునకున్ను స్వేచ్ఛావ్యవహారమునకున్ను నిరోధ మెందుకు కల్పించినారు?

13. అందుకు కారణము తెలియజేస్తాను.

14. ప్రజాస్వామిక ప్రభుత్వమంటె, వాస్తవముగా ఏమిటి? ప్రజలు స్వయంగా తమ ప్రతినిధులను తాము ఎంచుకొని, నియోగించగా ఏర్పడిన శాసననిర్మాణసభవారిద్వారా రాజ్యాధికారమిచ్చి, ఎవరిని అధికారస్థులుగా నియోగిస్తారో వారు రాజ్యవ్యవహారము నిర్వహిస్తారు. ఆ అధికారస్థులు ప్రజల ఇష్టానుసారముగా వ్యవహరించక పోతే,

ప్రజలు తమ ప్రతినిధులయిన శాసననిర్మాణసభవారిద్వారా తొలగించివేస్తారు. ఇట్లుజరిగే ప్రభుత్వమే ప్రజాస్వామికప్రభుత్వమనిపించుకొంటుంది. అయితే, ప్రజలుచేసే ఇట్టిప్రజాపరిపాలనమువల్ల గొప్ప ఉపద్రవము సంభవించుటకు అవకాశమున్నది. ఆ ఉపద్రవము ఎట్టిదో అమెరికాప్రజాస్వామిక ప్రభుత్వమునకు మొట్టమొదటు వ్యవస్థ ఏర్పరచినవారే చెప్పి ఉన్నారు; ఏమనిఅంటే, “ప్రభుత్వము దృఢముగాను కార్యసాధకముగాను ఉండవలెనని ఉద్దేశించి దోషములు వారించుటలో నాయకులు కనబర్చే ఉత్సాహమందు అత్యాశ కలదుగాని, అంతకన్న ఎక్కువగా ప్రజల హక్కులకోసము వారు కనబర్చే కపటోత్సాహమునందున్న అత్యాశవల్ల ఎక్కువ ఆపద కలుగవచ్చును.” అధికసంఖ్యాకులుగా ఉన్నవారు అల్పసంఖ్యాకులుగా ఉన్నవారికి హానికలుగజేయుటకుగాను కలిసి కుట్రచేసి బాధించడము తరుచుగా సంభవించవచ్చును; అలాగున సంభవించినదికూడాను. అధికసంఖ్యాకులు అల్పసంఖ్యాకులను పాలించుటకుబదులు పీడించుటే సంభవించవచ్చును. గనుక, అట్టి పాలనము పీడనము అనిపించుకొంటుంది. ప్రజాస్వామికప్రభుత్వము ఏర్పడినప్పుడు మొదట ప్రజల పక్షమును అవలంబించే ప్రజానాయకులే తుదకు ప్రజాపీడకులు అవుతారు అని సామెత ఒకటి ఉన్నది. గనుక, అధికసంఖ్యాకులవల్ల అల్పసంఖ్యాకులకు పీడ కలుగకుండా కాపాడుటకు రాజ్యాధికారికి రాజనీతి వ్యవస్థ ప్రకారము తగిన అధికారము శాసనము కలుగజేస్తుంది. ఏ దేశములో అధికసంఖ్యాకులు అల్పసంఖ్యాకులను పీడించుటకు వీలు లేకుండా తగిన రక్షణోపాయము ఎంతమట్టుకు ఉంటుందో దానినిబట్టి ఆ దేశస్థులు వాస్తవముగా అంతమట్టుకు స్వతంత్రులు అని చెప్పవలెను. రాజ్యాధికారికి ఈ విశిష్టాధికారము ఇచ్చుటకు ఇది ఒక కారణము.

15. మరిఒక కారణముకూడా ఉన్నది. ప్రజాపరిపాలన మనేదానిలో ఎప్పుడో ఒకప్పుడు పరిపాలకులైన ప్రజలు తమకు జోక్యము లేనివాటిలోకూడా జోక్యము కలుగజేసుకొని, విధివిరామము లేకుండా, అన్నిపనులున్ను తమమీద పెట్టుకొని ఆడంబరము చూపడము సంభవించినట్లే ప్రజాపరిపాలనముల చరిత్రలో ఎక్కడచూచినా కనబడుతున్నది. అందుచేతనే కనడాదేశ పరిపాలనమునకై ఏర్పడిన వ్యవస్థయొక్క మొట్టమొదటి దశలో ప్రజాస్వామికపరిపాలనము లేదు.

16. గనుక, గవర్నరుగారికి నిరోధాధికార మున్నదన్న కారణముచేత మండలములవారికిచ్చిన ప్రజాస్వామికపరిపాలనము నిరుపయోగమైనదని తృణీకరించకూడదు. గవర్నరుగారు తమ నిరోధాధికారము యుక్తముగా చెలాయిస్తే, దేశమునకు లాభమే కలుగుతుంది. అయుక్తముగా చెలాయిస్తే, చెల్లకుండానే పోతుంది. గవర్నరుగారు బుద్ధిమంతులైతే, ఈ అధికారము (ఎప్పుడో చెలాయించక తప్పదు అన్నప్పుడేగాని) చెలాయించనే చెలాయించరు. అప్పుడైనా ప్రజాభిప్రాయము తెలియజేసే వార్తాపత్రికలు మొదలయిన సాధనములనుబట్టి ప్రజల తాత్పర్యము గ్రహించి, దానికనుగుణముగానే ఆ అధికారము చెలాయిస్తారు. అట్లుచేయక ప్రజాభిప్రాయమునకు విరుద్ధముగాను, తరుచుగాను, తమ అధికారము చెలాయించిన పక్షమందు, గవర్నరుగారు లోకమునకు అనిష్టులు కావడమేకాక శాసననిర్మాణసభవారు తమకున్న అధికారము తాము చెలాయించి గవర్నరుగారికి రాజ్యవ్యవహారము దుర్భరమయ్యేటట్లు చేయగలరు. జాగ్రత్తగా ఆలోచించనిదే, శాసననిర్మాణసభవారితో గవర్నరుగారు ఎన్నడును విరోధపడరు. సభవారి అభిప్రాయమునకు విరుద్ధముగా దేశములో ప్రజల అభిప్రాయమున్నప్పుడు, గవర్నరుగారు తమ అభిప్రాయము న్యాయమైనదనిన్ని ప్రజల అభిప్రాయము ననుసరించి ఉన్నదనిన్ని తమకు తోచినప్పుడు, ప్రజలు తమపక్షమున ఉంటారని నమ్మి, ఈ అధికారము చెలాయిస్తే దేశమునకు లాభమేకదా.

8 వ అధ్యాయము.

ఇండియా సామ్రాజ్య పరిపాలనములో చేసిన సంస్కారము.

ఇండియా దేశమందు ప్రభుత్వములన్నిటిపైని అధికారముగలది, ప్రధానమయినది ఇండియా సామ్రాజ్యము.

2. సూర్యుని చుట్టూ గ్రహములు తిరిగినట్లు ఇండియా సామ్రాజ్యమును ఆశ్రయించుకొని దానికి అధీనమై మండల ప్రభుత్వములు అన్నీ ప్రవర్తింపవలసినవి గనుక ఇండియా సామ్రాజ్యము కేంద్రమువంటిది.

3. కొత్త సంస్కారశాసనములో ప్రజాస్వామిక ప్రభుత్వము ఏ మాత్రమైనా ఇండియా సామ్రాజ్యమునందు లేకపోవడము మొట్టమొదట ఆలోచించవలసిన విషయము.

4. దీనికి కారణ మేమిటంటే, ఇండియా దేశమందు ప్రజాస్వామిక ప్రభుత్వము క్రమక్రమముగా వృద్ధి పొందవలసినదిగాని ఒక్కసారి అకస్మాత్తుగా కలుగవలసినది కాదు; అని బ్రిటిషు పార్లమెంటువారి అభిప్రాయము. 1917 వ సం॥ అగస్టు 17 వ తేదిని ఇండియా సెక్రిటరీ ఆఫ్ స్టేటుగారు పార్లమెంటు సభలో ఆ ప్రకారమే వక్కాణించి ఉన్నారు. ఆ చొప్పున పార్లమెంటు సభవారు చేయనిశ్చయించి, ప్రస్తుతము ప్రజాస్వామిక ప్రభుత్వము మండలపరిపాలనమందు మాత్రము వాస్తవమైన ప్రారంభోపాయముగా ప్రచారములోనికి తెచ్చుటకు అనుజ్ఞ యిచ్చినారు. కొంతకాలమిట్లు జరిగితే ప్రజలకు అనుభవము కలిగినకొలదిని, ప్రజాస్వామిక ప్రభుత్వము వృద్ధిపొంది, చివరకు ఇండియా సామ్రాజ్యమందు అన్ని వ్యవహారములలోను సంపూర్ణముగా పరిణమించ గలదు.

5. ప్రజాస్వామిక ప్రభుత్వము ఆలాగున వృద్ధిపర్చుటకుగాను సంస్కారశాసనములో ఒకవిధాన మేర్పడి ఉన్నది. ఆ చొప్పున ఈ సంస్కారశాసనము ప్రకటితమైన తేది మొదలుకొని పది సంవత్సరములకాలము గడచిన పిమ్మట, అనగా, 1929 వ సంవత్సరాంతమందు శ్రీచక్రవర్తివారు కొందరిని ఒక కమిషనుగా ఏర్పర్చవలెనని శాసనములోనే ఉన్నది. ఆ కమిషనువారు ఈసంస్కారశాసనము ఏలాగున అమలు జరిగినదో, దాని ప్రచారమువలన కలిగిన ఫలమేమో, విమర్శించి తెలుసుకొని, ప్రజాస్వామిక ప్రభుత్వము అధికారముగా చేయుటను గురించిన్ని, మార్చుటను గురించిన్ని, వారి అభిప్రాయములు శ్రీచక్రవర్తిగారికి నివేదించవలెను; అప్పటి స్థితికి ఉచితమైనట్లు వారు ఆలోచించి ఆచరిస్తారు.

6. కొత్త సంస్కారమువల్ల ప్రజాస్వామిక ప్రభుత్వము ఇండియా సామ్రాజ్యమందు ఏర్పడకపోయినా, ఆ సామ్రాజ్యవ్యవస్థలో గొప్ప మార్పులు కలిగినవి. అందువల్ల ఇప్పుడున్న దానికంటె అది చాలా అభివృద్ధి కలదయినది.

7. ఈ మార్పులున్ను ఈ అభివృద్ధిన్ని విశదముగా తెలియజేస్తాను.

8. ఇండియా సామ్రాజ్యపరిపాలనము రెండు శాఖలుగా ఉన్నది. ఒకదానిపేరు ఇండియా సామ్రాజ్యవ్యవహారనిర్వాహకసభ; రెండవదానిపేరు, ఇండియా సామ్రాజ్య శాసననిర్మాణసభ.

9. మొట్టమొదట వ్యవహారనిర్వాహకసభనుగూర్చి చెప్పుతాను.

10. ఇండియాలో రాజప్రతినిధిగా ఉన్న గవర్నరు జనరల్ (వైసరాయ్)గారి కార్యనిర్వాహకసభవారే ప్రస్తుతము ఇండియా సామ్రాజ్య కార్యనిర్వాహకసభవారుగా ఉన్నారు. ఆ సభలో ఇండియా సైన్యాధిపతిగారుకాక ఆరుగురు మెంబర్లు ఉన్నారు. వారిలో ఒక్కరే ఇండియా దేశస్థులు.

11. సంస్కారశాసనములో విధించినదాని ప్రకారము వచ్చేసంవత్సరమునుండిన్ని ఈ సభలో ఇండియా దేశస్థులు ముగ్గురుండవలెను. ఇంతమట్టుకు ఇండియా దేశమునకు మేలయినది గదా.

12. అంతకంతకు కొంతకాలమునకు ఈ సభలో యూరోపియనులకన్న ఇండియా దేశస్థులే అధికముగా ఉంటారని ఈ విషయమై సిఫారసు చేసిన పార్లమెంటు కమిటీవారు చెప్పినారు.

13. ఇంతేకాక, చాలాకాలముక్రిందట పార్లమెంటువారు చేసిన శాసనము చొప్పున ఇంగ్లండులో "బారిస్టర్ ఎట్-లా"గా లాయఖ్ అయిన లాయర్ ఈ సభలో లీగల్ మెంబరుగా ఉండవలెనని విధి అవుటచేత, ఇండియాలోని లాయర్లు ఎంతసామర్థ్యముగలవారయినా ఇంగ్లండు దేశమునకు వెళ్లినవారు కానందున, ఈ సభలో లీగల్ మెంబరుగా ఉండుటకు వీలులేకపోయినది. సంస్కారశాసనమువల్ల ఈ అడ్డు పోయినది. ఇటుపైని ఇండియా సామ్రాజ్య వ్యవహారనిర్వాహకసభలో లీగల్ మెంబరుగా ఉండుటకు ఇండియా హైకోర్టు ప్లీడర్లలో ఎవరైనా అర్హులు కావచ్చును.

14. ఇండియా సామ్రాజ్య వ్యవహారనిర్వాహకశాఖ విషయమై చెప్పవలసినది ఇంతమట్టుకే.

15. ఇకను ఆ సామ్రాజ్యములోని శాసననిర్మాణశాఖను గురించి చెప్పుతాను.

16. ప్రస్తుతము గవర్నరు జనరల్‌గారి శాసననిర్మాణసభలో 68 గురు సభికులు ఉన్నారు. వారిలో ఎక్కువమంది గవర్నమెంటు ఉద్యోగస్థులే; ఉద్యోగస్థులుకాని తక్కిన సభ్యులలో గవర్నమెంటువారు స్వయంగా నియోగించినవారు కొందరు; కొన్ని ప్రజాగణముల సిఫారసు చొప్పున గవర్నమెంటువారు నియోగించినవారు కొందరు—ఈ గణములేవంటే: భూస్వాములు, మహమ్మదీయులు, వర్తకులు, యంత్రశాలాధికార్లు, మండల శాసననిర్మాణసభలో అనుద్యోగస్థులయిన సభికులు.

17. సంస్కారశాసనమువల్ల ఇండియా సామ్రాజ్య శాసననిర్మాణసభ రెండు సంఘములుగా విభక్తమైనది. ఈ రెండు సంఘములవారున్ను సమ్మతించిచేసిన శాసనములే ఇండియాదేశమంతటా అమలు కావలసినవి. ఈ రెండు సంఘములలో ఒకదాని పేరు రాష్ట్రసభ (Council of State), రెండవదాని పేరు శాసక సమితి (Legislative Assembly); ఈ రెండున్ను కలిసి ఒక విధముగా ఇండియాకు పార్లమెంటుగా ఏర్పడునవి. అయితే బ్రిటిషు పార్లమెంటులోని రెండు శాఖల ప్రధాన స్వరూప లక్షణములు ఇండియా సామ్రాజ్య శాసననిర్మాణసభయొక్క ఈ రెండు సంఘములందున్ను ఈ మొదటి దశలో కనబడవు. అంతకంతకు కొన్ని సంవత్సరములకు బ్రిటిషు పార్లమెంటులో ఉన్న రెండుశాఖల పరిపాలనపద్ధతివంటిది ఇండియా సామ్రాజ్యమున పరిణమింపగలదని అనుకోవచ్చును. అట్టి పరిణామమునకు సాధకమయిన విధానము కొత్త సంస్కారమం దున్నది. రాష్ట్రసభ బ్రిటిషు పార్లమెంటులోని ప్రథమ సంఘము (హౌస్ అవ్ లార్డ్జు) వంటి ఉన్నత సభ; శాసక సమితి (హౌస్ ఆఫ్ కామన్స్) వంటి సభ. ఇటుపైని ఇండియాకు పార్లమెంటు పద్ధతి పరిణమించుటకు బీజభూతముగా ఇప్పటికి ఈ ఏర్పాటు అయినది.

18. ఇకను ఏర్పడే విధానము ననుసరించి ప్రజలు ఎంచుకొని నియోగించిన సభ్యులున్ను, ప్రభుత్వమువారు నియోగించిన సభ్యులున్ను కలిసి మొత్తము 140 మంది సభ్యులు శాసక సమితిలో ఉంటారు. వీరిలో ప్రజ లెంచుకొన్నవారు నూరుగురు. వీరిని ప్రజలే స్వయంగాను ప్రత్యక్షముగాను ఎంచుకొనవలెనుగాని, ఇదివరకు జరుగుతూఉన్నట్లు ప్రజలు కొందరిని ప్రతినిధులుగా ముందు ఎంచుకొన్న తర్వాత ఆ ప్రతినిధులు ఈ మెంబర్లను ఎంచుకోవడపు పద్ధతినిగాదు. సంస్కారశాసనములో 140 కన్న ఎక్కువమంది మెంబర్లు ఉండవచ్చునని ఉన్నదిగాని, ఎక్కువమంది ఉన్నప్పుడు ఏడుగురికి అయిదుగురు చొప్పున ప్రజలు యెంచుకొన్నవారు ఉండి తీరవలెననిన్ని ప్రభుత్వమువారు నియోగించిన మెంబర్లలో మూడవపాలు అనుద్యోగస్థులు ఉండవలెననిన్ని విహితమైన ఏర్పాటు ఉన్నది.

19. అనగా మొట్టమొదటనే శాసక సమితిలో గవర్నమెంటు ఉద్యోగస్థులుకాని వారే అత్యధిక సంఖ్యాకులు ఉండేటట్లున్ను, ఇతరులు ఇద్దరున్నప్పుడు ప్రజలు ఎంచుకొన్న మెంబర్లు అయిదుగురు చొప్పున ఉండేటట్లుగా ఏర్పడినది.

20. గనుక ఇదివరకు శాసననిర్మాణసభలో అధికసంఖ్యాకులుగా ఉన్న ఉద్యోగస్థుల అధికారము చెల్లుతూవచ్చినా, ఇటుపైని ప్రజలు ఎంచుకొన్న మెంబర్ల అధికారము సుకరముగా చెల్లేటట్లు ఈ కొత్త సంస్కారమువల్ల ఏర్పడినది.

21. ఇంతే కాక కొత్త సంస్కారశాసనముచొప్పున శాసక సమితికి అధ్యక్షులుగా గవర్నరు జనరల్‌గారు ఉండకూడదు; నాలుగు సంవత్సరములు మాత్రము గవర్నరు జనరల్‌గారు నియోగించినవారు మరియొకరు ఆ స్థానమందు ఉంటారు. అటు పిమ్మట సమితివారే తమ ఇష్టానుసారము తమ అధ్యక్షుని ఎంచుకొని నియోగించవచ్చును; గాని ఆ నియోగము గవర్నరు జనరల్ వారి సమ్మతికి లోబడి ఉండవలెను.

22. రాష్ట్ర సంఘము (Council of State) లో 60 కన్న ఎక్కువమంది సభ్యులు ఉండకూడదు. వీరిలో, యథావిధిగా ఎంచుకొనుటకు అర్హులైనవారు ఎంచుకోగా సభ్యులయినవారు కొందరున్ను, యథావిధిగా ప్రభుత్వమువారిచే నియుక్తులయిన వారు కొందరున్ను, ఉంటారు. ఈ 60 మందిలో ఇరువది మంది కన్న ఎక్కువగా ఉద్యోగస్థులు ఉండకూడదు. పార్లమెంటులోని ప్రభు సంఘము (హౌస్ ఆవ్ లార్డ్జు) వంటి దర్జాగల ఈ ఉన్నత సంఘములో ఎంచుకొన్న మెంబర్లు అధికసంఖ్యాకులుగా ఉండకపోయినా, అనుద్యోగస్థులే అధికసంఖ్యాకులుగా ఉంటారు. బ్రిటిషు పార్లమెంటులోని ప్రభు సంఘము (హౌస్ ఆవ్ లార్డ్జు) కన్న ఇండియా సభలోని రాష్ట్ర సంఘములో ఒక విశేషమున్నందున దానికన్న ఇది యెక్కువ లాభకరముగా ఉన్నది. ఆ విశేషము వివరిస్తాను: ప్రభు సంఘము (హౌస్ ఆవ్ లార్డ్జు) లోని సభ్యులు అందరున్ను చక్రవర్తిగారివల్ల బిరుదులు పొందినవారే. ఈ బిరుదులు రాజ్యవ్యవహారనిర్వాహకుడయిన ప్రధానమంత్రి సిఫారసు ప్రకారమే చక్రవర్తిగారు ఇస్తారు. గనుక ప్రభు సంఘములోని మెంబర్లు వాస్తవముగా అధికారస్థులచేత నియుక్తులయినట్లే తేలుతుంది. ఎట్లయినా, వారు ప్రజలు ఎంచుకొన్నవారుకారు. ఇంగ్లండులో ప్రభుసంఘముయొక్క యేర్పాటులో ప్రజలు ఎంచుకోవడమన్న మాట లేనేలేదు. ఇండియా దేశమందు సంస్కారశాసనముచొప్పున మొట్టమొదటనే రాష్ట్ర సంఘమందున్న సభ్యులు—అందరూ కాకపోతే కొందరయినా—ప్రజ లెంచుకొన్నవారుంటారు. ఇట్టి ఆరంభోద్యమము స్వతః శ్రేష్ఠమైనదని తలంచవలెను. ప్రభు సంఘ (హౌస్ ఆవ్ లార్డ్జు) సభ్యులకు సభ్యులుగా ఉండే హక్కు పరంపరముగా వార్సత్వముచేతనే కలిగినది. తండ్రికి ప్రభుత్వ (లార్డ్) అనే బిరుదు కలిగిన కారణముచేత కొడుకుకూడా ప్రభువయి తండ్రివలెనే ప్రభు సంఘములో మెంబరుగా ఉండుటకు హక్కుకలవాడు అవుతాడు. ఇండియాలో స్థాపించిన రాష్ట్రసభలో మొట్టమొదటనే వార్సత్వపు హక్కు నిరాకృతమయినది. ప్రభుత్వమువారు నియోగించడమువల్లగాని, ప్రజాగణములు ఎంచుకోవడమువల్లగాని, ఎవరయినా మెంబరు కాగలరు; అంతేకాని మరియొకలాగున కాలేరు. ప్రజాగణములు ఎంచుకోవడముకూడా శాసనసభలోని మెంబర్లను ఎంచుకొన్నట్లే ప్రత్యక్షముగా జరగవలెను; అంతేకాని, మొదట కొంచెము మందిని ప్రజలు ఎంచుకోవలెనని, పిమ్మట ఆ కొంచెముమందిన్ని మెంబర్లుగా ఉండవలసినవారిని ఎంచుకోవలెనని, ఇట్లు పరోక్షముగా ఎంచుకోవడము జరగకూడదు. ఏ ప్రజాగణములు ఎవరిని తమ ప్రతినిధులుగా యెంచుకొంటారో వారే వారికి ప్రతినిధులుగా సభలో మెంబర్లు కావలెను.

23. ఈ ఉన్నత సభలో నయినా గవర్నరు జనరల్‌గారు అధ్యక్షులుగా ఉండకూడదనిన్ని ఆ సమాజమందున్న మెంబర్లలోనే తమ కిష్టమైనవారిని ఒకరిని అధ్యక్షులుగా ఆయన నియోగించవలెననిన్ని సంస్కార శాసనమందు నియమమున్నది.

24. సంస్కారశాసనము ప్రకారము ఇండియా సామ్రాజ్యముయొక్క ఆయవ్యయగణన విమర్శించుటకు ఈ రెండు సమాజములకు అధికారము కలదుగాని "శాసక సమితి" వారికి మాత్రము ఒక ప్రధాన విషయమందు రాష్ట్రసభవారికి లేని అధికారమున్నది. ఆయవ్యయగణన విమర్శించిన తర్వాత దాని విషయమయి తమ అభిప్రాయము వ్యక్తపరుచుటకున్ను, కర్చుల విషయమై ప్రభుత్వమువారు కోరే ఏబాబత్ పద్దయినా అంగీకరించుటకున్ను, లేదా, నిరాకరించుటకున్ను, శాసక సమితివారికి మాత్రమే అధికారమున్నది. ఇండియా సామ్రాజ్య శాసననిర్మాణసభవారికి ఇట్టి అధికారము ఇదివరకెప్పుడును లేదు; ఇప్పుడు కొత్తగా సంస్కారశాసన మూలముగా లభించినది. ఇందువల్ల ఇండియా "శాసకసమితి" ఇంచుమించుగా ఇంగ్లండులోని హౌస్ ఆవ్ కామన్జువంటిదయినది. బ్రిటిషు హౌస్ ఆవ్ కామన్జువారి స్వాధీనములో బ్రిటిషు రాజ్యముయొక్క ఖజానా ఉన్నట్టే, ఇండియా శాసకసమితివారి అధీనమందు ఇండియా రాజ్యముయొక్క ఖజానా ఉండగలదు. కొన్ని పద్దులు ఈ శాసనసమితి అధికారమునకు లోబడకూడదని సంస్కారశాసన ప్రకారము కేటించి ఉన్నవన్నమాట నిజమే. అయితే, ఆ పద్దులు శాసననిర్మాణసభయొక్క రెండు సమాజములున్ను కలిసిచేసే ఆయవ్యయగణన విమర్శకు లోబడిన విషయములైనాకావు. ఇట్లు వేరే ఉన్న పద్దులు ఎటువంటివంటే—ప్రస్తుతదశలో ఈ రెండు సమాజములలో ఏది ఆ పద్దుల విషయమై జోక్యము కలుగజేసుకొన్నా, దాని వని నిరర్థకమో అనర్థకమో అగునని సందేహించవలసినట్టివి; తక్కిన పద్దులన్నీ శాసక సమితివారి విమర్శకులోబడినవే. అవి అన్ని ప్రజల బ్రతుకుతెరవు, ప్రజల లాభనష్టములు, ప్రజల మంచి చెడ్డలు—వీటిని గురించినవే; గనుక, ఇంతకాలమునకు శాసననిర్మాణసభకు లభించిన ఈ ఆయవ్యయగణనాధికారము మిక్కిలి ఘనమయినదిగా తలచవలసినది.

25. మండలాధిపతులయిన గవర్నర్లకు ఇచ్చిన విశిష్టనిరోధాధికారమువంటిదే సంస్కారశాసన ప్రకారము గవర్నరు జనరల్‌గారికికూడా కలదు. రెండు సమాజములవారి అభిప్రాయము రాజ్యవ్యవహారమునకున్ను దేశమునకున్ను బాధకమవునని ఆయనకు తోచినప్పుడు మాత్రమే చెలాయించుటకు అట్టి అధికారము ఆయనకు కలదు. దేశోపద్రవము కలుగకుండా రక్షణోపాయముగా ఈ అధికారము దేశాధిపతులకు ఉండడము ఉచితమని వెనుకటి అధ్యాయము చివరను సమాధానము చెప్పి ఉన్నాను. సామ్రాజ్యశాసన సభల రెండింటి విషయములో గవర్నరు జనరల్‌గారికి నిరోధాధికారముండుటకు ఆ సమాధానమే పట్టించవచ్చును.

9 వ అధ్యాయము.

ఇండియా సెక్రటరీ ఆవ్ స్టేటుగారు; ఆయన సభ.

ఇండియా సామ్రాజ్యప్రభుత్వముపై అధికారముగలవారు ఇండియా సెక్రటరీ ఆవ్ స్టేటుగారు; ఆయన పార్లమెంటువారికి జవాబుదార్లుగా ఉంటారు. ఆయనద్వారా పార్లమెంటువారు ఇండియా సామ్రాజ్యమును శాసిస్తూ ఉంటారు. శ్రీ చక్రవర్తిగారి పేర బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వము నిర్వహించే మంత్రివర్గములో ఆయనకూడ చేరి ఉన్నారు. ప్రజలలో ఏ పార్టీప్రభావము అధికముగా ఉండునో ఆ పార్టీవారిలో ప్రముఖులయనవారే అప్పుడు మంత్రులుగా ఉంటారు.

2. సెక్రటరీ ఆవ స్టేటుగారికి సహాయముగా ఇండియా కౌన్సిల్ అనే పేరుగల ఒక మంత్రణసభ కలదు. లండన్ నగరమందు ఇండియా ఆఫీస్ అని ఆయనకచ్చేరీ ఒకటి ఉన్నది. ఆయన జీతమున్ను ఆయన సభవారి జీతమున్ను ఇప్పటివరకు ఇండియాదేశపు ఆదాయమునుండే తీసి ఇస్తున్నారు. ఇట్లు చేయుట అన్యాయమని ఇండియా దేశస్థుల నాయకులు ఆక్షేపించినారు. కాంగ్రెస్ సభవారు, 1885 వ సం॥లో ఆ సభ స్థాపించినది మొదలుకొని, ప్రతి సంవత్సరము, ఈ కర్చు అక్రమమయినదని అధికార్లకు విన్నపము చేసుకొంటూవచ్చినారు. ఇండియా రాజ్యవ్యవహారము పరిశీలించుటకు ఇండియా సెక్రటరీగారు ఉన్నట్లే తక్కిన రాష్ట్రముల వ్యవహారము పరిశీలించుటకు మరి ఒక సెక్రటరీగారు ఉన్నారు. వీరి జీతమున్ను వీరి కచ్చేరీ కర్చులున్ను బ్రిటిషు దేశపు ఆదాయమునుండే ఇస్తున్నారు కాని, ఆ రాష్ట్రముల ఆదాయములోనుంచి తీసి ఇవ్వడములేదు. అలాగే ఇండియా సెక్రటరీగారి జీతమున్ను తక్కిన కర్చులున్ను బ్రిటిషురాజ్యపు ఆదాయమునుండే ఇచ్చుట న్యాయముగాని, ఇండియా ఆదాయమునుండి ఇచ్చుట న్యాయముకాదు: అని కాంగ్రెస్‌వారి వాదము.

3. సంస్కారశాసనమువల్ల ఇండియాదేశమునకు ఈ భారము తొలగిపోయినది. ఇటుపయిని ఇండియా సెక్రటరీ ఆవ్ స్టేటుగారి జీతమున్ను (సం॥కు 5,000 సవరన్లు), వారి అండర్ సెక్రటరీల జీతమున్ను, తక్కిన కచేరీ కర్చులున్ను బ్రిటిషువారి ఖజానానుండే ఎత్తి ఇస్తారు. ఇండియాదేశపు ఆదాయమునుండి ఎత్తి ఇయ్యనక్కరలేదు.

4. ఇందువల్ల ప్రతిసంవత్సరము ఇండియా రాజ్యమువారు చాలా ధనము మిగుల్చుకోవచ్చును.

5. ఇంతేకాక, 1908 వ సం॥ దాకా సెక్రటరీ ఆవ్ స్టేటుగారి మంత్రణసభలో ఇండియా దేశస్థులు ఎవరున్ను లేరు. అందులో మెంబర్లుగా బ్రిటిషు ఉద్యోగస్థులో, ఇండియాలో పనిచేసి పింఛన్ పుచ్చుకొన్న ఇంగ్లీషువారో, ఉండేవారు. 1908 వ సం॥లో ఇద్దరు ఇండియా దేశస్థులను అనగా హిందువులలో ఒకరిని, మహమ్మదీయులలో ఒకరిని, మెంబర్లుగా నియోగించినారు. 1917 వ సం॥లో ముగ్గురు ఇండియా దేశస్థులు మెంబర్లయినారు.

6. "జాయింటు పార్లమెంటు కమిటీ" వారు ఇంకా మరికొందరిని ఇండియా సెక్రటరీ ఆవ్ స్టేటుగారి సభలో మెంబర్లుగా నియోగించవలసినదని సిఫారసు చేసినారు. ఆ సిఫారసు చొప్పున ఆచరించవలసి ఉన్నది; గనుక ఇటుపైని ఇండియారాజ్య వ్యవహారము విషయమై సెక్రటరీ ఆవ్ స్టేటుగారికి సలహా చెప్పుటకు ముగ్గురికన్న ఎక్కువమంది ఇండియా దేశస్థులే మెంబర్లుగా ఉంటారు. తక్కిన మెంబర్లతోపాటు వారికిన్ని బ్రిటిషు రాజ్యపు ఆదాయమునుండి జీతము లివ్వడమేకాక, స్వదేశమువిడిచి దూర దేశములో నివసించుటకు వారికి ఎక్కువగా కర్చు అగును గనుక, అందుకుగాను సంవత్సరమునకు 600 సవరన్లు ముజరా కూడా ఇచ్చే ఏర్పాటు జరిగినది.

7. మరి ఒక విశేషమున్నది: ఇండియా గవర్నమెంటువారున్ను శాసననిర్మాణ సభల వారున్ను ఏకాభిప్రాయముగల విషయములలో సెక్రటరీ ఆవ్ స్టేటుగారు ఏ జోక్యమున్నూ కలుగజేసుకోకూడదనిన్ని, భిన్నాభిప్రాయముగల విషయములున్నప్పుడు మాత్రమే సెక్రటరీగారు తమ అధికారము చెలాయించవలెననిన్ని సంస్కారశాసనమందున్నది.

8. ఇదివరకు వ్యవహారమెట్లుండేదో చూస్తే ఈ సంస్కారమువల్ల కలిగిన లాభము విశదమవుతుంది. సెక్రటరీ ఆఫ్ స్టేటుగారు ఇండియా రాజ్యవ్యవహారములో తరుచుగా జోక్యము కలుగజేసుకొని, ఇండియాకు చాలా నష్టము కలుగజేసినారు. ఇండియా గవర్నమెంటువారి అభిప్రాయము తమకు సమ్మతమయినదని తెలియజేసి, ఇండియా దేశపు ప్రజలందరున్ను ఒక కట్టుగా గవర్నమెంటువారి పక్షమందున్నప్పుడు కూడా అందుకు విరుద్ధముగా సెక్రటరీ ఆవ్ స్టేటుగారు వ్యవహరించి దేశమునకు చాలా కీడు కలిగించినారు. కొన్ని విషయములు దృష్టాంతముగా ఉదాహరిస్తాను: పత్తిమీద వేసే పన్నుల విషయములోను, రివిన్యూ వ్యవహార స్వాతంత్ర్య విషయములోను, కొన్ని యుద్ధముల కర్చులు ఇండియాదేశము భరించకూడదన్న విషయములోను, ఇండియా దేశస్థుల కోరికకున్ను ఇండియా గవర్నమెంటువారి అభిప్రాయమునకున్ను విరుద్ధముగా, సెక్రటరీ ఆవ్ స్టేటుగారు తమ యిష్టము వచ్చినట్లు వ్యవహరించినారు. ఒకమారు ఆయన అట్లు స్వతంత్రించి అక్రమముగా ఆలోచించినందున, రాజ్యప్రతినిధిగా ఉన్న (వైసరాయ్) నార్త్ బ్రూక్ ప్రభువుగారే ఇండియా దేశమునకు కలిగిన కీడుచూచి సహించలేక తమ అధికారము విడిచిపెట్టి, పనిమానుకొనుటకూడా సంభవించినది.

9. సంస్కారశాసనము అమలులోనికి వచ్చిన తర్వాత మన దేశమునకు అట్టి అపకారములు జరుగుట దుర్ఘటమవుతుంది. ఈ శాసనమువల్ల సెక్రటరీగారి అధికారము ఇట్టి విషయములలో తగ్గడమేకాక ఆ శాసనము చేయించిన జాయింటు పార్లమెంటరీ కమిటీవారి సిఫారసు ప్రకారము రివిన్యూ వ్యవహారములో ఇండియా దేశమునకు ఉపయుక్తమయిన చట్టములు చేసుకొనుటకు ఇండియా శాసననిర్మాణసభలకు ఆటంకమేమీ ఉండకూడదని ఏర్పడ్డది. ఆ కమిటీవారన్న వాక్యములను ఈ క్రింద నుదాహరిస్తున్నాను; వాటి చొప్పున అమలు జరిగితే, బ్రిటిషుసామ్రాజ్యములో చేరిన తక్కిన దేశములతో సమానముగా స్వాతంత్ర్యమున్ను గౌరవమున్ను కలిగి మన దేశము వృద్ధిపొందుతుంది. ఈ నవీనయుగము మన దేశచరిత్రలో కీర్తనీయమవుతుంది.

10. కమిటీవారి వాక్యము.—"బ్రిటిషు దేశపు వాణిజ్యవ్యాపారము అభివృద్ధిపొందుటకుగాను ఇండియా సెక్రటరీగారు ఇండియా రివిన్యూ వ్యవహారము ఇష్టమువచ్చినట్టు నడిపిస్తున్నారని లోకములో నమ్మకము పుట్టినట్టయితే, ఇండియా దేశమునకున్ను బ్రిటిషు దేశమునకున్ను ఉండే సంబంధము చెడిపోవుటకు ఇంతకన్న ముఖ్యమయిన కారణము మరియొకటి ఉండదు. అట్టి నమ్మకము ప్రస్తుతము నిస్సందేహముగా కలదు. ఇటుపైని

అట్టి నమ్మకము కలుగుటకు అవకాశముండకుండా చేయుట యుక్తమని అందరికి విశదమే. బ్రిటిషు సామ్రాజ్యసమితిలో ఇండియా దేశమున కున్న ఇప్పటిస్థితినిబట్టి, అందులో చేరిన తక్కిన దేశములతో దానికి వ్యవహారముచేయక తప్పదు. తక్కిన దేశములకున్న ఇండియా దేశమునకున్న కావలసిన వ్యవహారనిర్వాహకశాసనములు యథోచితముగా ఏర్పర్చుకొనే అధికారము లేకపోతే, తక్కిన దేశములతో వ్యవహారము లాభకరముగా చేసుకొనుటకు దానికి అవకాశము లేదు. ఈ కష్టము తొలగించుటకు తగిన సాధనము ఒక్కటే ఉన్నది. తక్కిన దేశములతోపాటు ఇండియా దేశముకూడా బ్రిటిషు సామ్రాజ్యములో సమాన దర్జాగలదని ఆలోచించి, ఇండియా రాజ్యమువారికి తమ దేశపు ఎగుమతిదిగుమతిమీద అవసరమైనట్టు సుంకములు నిర్ణయించుటకు స్వతంత్రాధికారము ఇవ్వక తప్పదు. గ్రేటు బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజీలండ్, కనాడ, దక్షిణ ఆఫ్రికా మొదలయిన దేశములవారు తమ క్షేమము కాపాడుకొనుటకు హక్కు కలిగి ఉన్నారు కారా? ఇండియా దేశస్థులకు కూడా అట్టి హక్కు ఉండవలెనని స్పష్టముగా న్యాయము ఏర్పడుతున్నది."

11. ఈ స్వాతంత్ర్యము మిక్కిలి విలువయినది. యుక్తముగా దీనిని బట్టి వ్యవహరిస్తే, ఇండియా దేశమందు వ్యాపారములన్నీ అభివృద్ధిపొంది మిక్కిలి లాభకరముగా ఉంటవి. ప్రజలు భాగ్యవంతు లవుతారు.

12. ఇదివరకు నేను చెప్పినట్లు ఇండియా దేశపరిపాలనము పైని, పార్లమెంటువారి ప్రతినిధిగా, తాను అధికారము చెలాయించడములో ఇండియా సెక్రటరీ ఆవ్ స్టేటుగారు పార్లమెంటువారికి జవాబుదారుగా ఉంటారు; గనుక, ఇండియా దేశపరిపాలనముపై ముఖ్యాధికారము బ్రిటిషు పార్లమెంటువారికే కలదనుట స్పష్టము.

13. ఇండియా పరిపాలన వ్యవస్థప్రకారము ఇండియా పరిపాలనముపై పార్లమెంటుకుగల అధికారవిషయములో ఈ కొత్త సంస్కారశాసనము మన దేశమునకు ఎట్టి మార్పు, అనగా ఎట్టి లాభము, కలిగించునో చూడండి.

14. ఇండియా దేశపరిపాలనముపై సర్వాధికారము ఉన్నప్పటికీ, బ్రిటీషు పార్లమెంటువారు ఇండియా దేశ క్షేమము ఆలోచించడములో ఇదివరకు అశ్రద్ధవహించి ఉండిరనిన్ని, ఇండియా దేశస్థులకు అధికారులవల్ల కలిగిన కష్టములు తొలగించుటలో సాధారణముగా జోక్యము కలుగజేసుకోకుండా ఉండిరనిన్ని, చాలా కాలమయి ఘోషపెట్టుతూఉన్నారు. పార్లమెంటులో ఇండియా విషయమైన చర్చలు జరిగినప్పుడు "బెన్చీలు ఖాళీగానే ఉంటవని" ఒక వాదు లోకములో సామెతగా ఉన్నది. అయితే, అట్లు జరగడము సహజమే కదా. బ్రిటీషు పార్లమెంటువారు తమ వ్యవహారములు (అనగా గ్రేటు బ్రిటన్, ఐర్లండుతో సంబంధించిన విషయములు) ముందుగా ఆలోచించుకోవలసి ఉంటుంది. వారిలో చాలామంది ఇండియాకు ఎప్పుడున్నూ వచ్చిఉన్నవారు కారు. వారికి ఇండియా చాలా దూరముగా ఉన్న దేశము; గనుక, ఎప్పుడో ఏదో ఒక యుద్ధమో, లేక వారి దృష్టిని ఆకర్షించి చెత్తవైకల్యము కల్గింపగలిగిన మరి ఏదో ఒక గొప్ప ఉపద్రవకరమైన ఉత్పాతమో, కలిగినప్పుడు తప్ప, సాధారణముగా ఇండియా వ్యవహారములలో వారికి ఆసక్తి ఉండకపోవడము స్వభావసిద్ధమే కదా.

15. అయినా, ఒక్క విషయము మన మొప్పుకోక తీరదు. బ్రిటీషు ప్రజలకుగల స్వతంత్రస్వభావమున్ను, వారిలో సహజముగా అభివృద్ధిచెందిన సరళస్వభావమున్ను, న్యాయ్యబుద్ధిన్ని, ప్రతిఫలింపజేసే బ్రిటీషు పార్లమెంటువల్లనే ఇండియా దేశస్థులు ప్రస్తుతము అనుభవిస్తూ ఉన్న గొప్ప హక్కులు కలిగినవి. నూటయేబది సం॥ములయి

ఇండియా దేశము బ్రిటిషు పరిపాలనములో ఉన్నా, ఈనాటికి గదా ఇండియా దేశస్థులకు ప్రజాస్వామిక పరిపాలనాధికారము—అదైనా కొంతమట్టుకే—ఇవ్వవలెనన్న తలంపు పార్లమెంటుకు పుట్టినది అని కొందరంటారు. గాని, జాగ్రత్తగా ఆలోచించండి: తమ ప్రజలవిషయములోనే--అనగా బ్రిటిషువారి విషయములోనే--ప్రజాస్వామికపరిపాలనాధికారము వాస్తవముగాను, సార్థకముగాను, పల్లెటూరివాళ్లకున్ను కూలివాళ్లకున్ను మేలుకలిగేటంత విపులముగాను, ఉండేటట్లు చేసుకోడానికి బ్రిటిషు పార్లమెంటువారికెంతకాలము పట్టినదో! ప్రపంచములో ఇప్పుడుగాని, పూర్వముగాని, ఉన్న సకల దేశములలోను బ్రిటిషు పార్లమెంటువారున్ను బ్రిటిషువారున్ను మాత్రమే నిజమైన స్వతంత్రభావమున్ను, వాస్తవమైన ప్రజాస్వామికపరిపాలనాసక్తిన్ని అభివృద్ధి చేసుకొన్నారు. ఇవి అభివృద్ధి చేయడములో, అకస్మాత్తుగా చేసే మార్పులు నిష్ఫలమగునని ఎరిగి, వారు క్రమక్రమముగాను అతి జాగ్రత్తతోను పని సాగించినారు; గనుకనే, పార్లమెంటుకు గ్రేటు బ్రిటన్ మాతృస్థానమని చరిత్రలో పేరు పొందినది; దానికి అర్థమేమి? తక్కిన దేశస్థులు వారిపార్లమెంటుయొక్క నిర్మాణమును చూచి, అట్టి నిర్మాణమును తమ దేశములందు స్థాపించుకొన్నారు. ఇండియాలో స్వాతంత్ర్యములను నిరోధించే శాసనములనే బ్రిటిషు పాలనాధికారులు జారీ చేసినారని మనము మొర పెట్టుతున్నాము. మనము అట్లు మొర పెట్టుటకు కారణము లేకపోలేదు; గాని, మరియొక విషయము కూడా ఆలోచించుకోవలసి ఉన్నది. స్వయంపరిపాలన మనే పరమావధిని చేరుకొనుటలో పాలనాధికారులు మన స్వాతంత్ర్యము నిరోధించి వెనుకకు లాగినా, వెంటనే ముందుకు రెండడుగులు వేస్తూవస్తున్నామన్న విషయము మరవకూడదు. ఇండియా దేశపరిపాలనములో బ్రిటిషు పరిపాలనాధికారులు చేసే తప్పులు మనము కఠినముగా విమర్శిస్తున్నప్పుడు బ్రిటిషు పరిపాలనప్రవాహము ఎటు వైపు పారుతున్నదో చూడవలెను. ప్రవాహము సాగే జాడనుబట్టి గమ్యస్థానము తెలుసుకోవచ్చును. పవిత్రమైన మన గంగానదిని చూడండి: ఎంత కుటిల గతిని ప్రవహిస్తూ ఉన్నదో. దాని కుటిలగతిని మాత్రమే చూచినప్పుడు అది గమ్యస్థానమైన సముద్రమును చేరుటకు తిన్నని మార్గమునుండి తరుచుగా తప్పుతూ ఉన్నట్లు తోచకమానదు. ఆ కుటిలప్రవాహము గమ్యస్థానమునకు పోయే తిన్నని మార్గమునుండి తప్పుతూ ఉన్నట్లు కనబడినా, ప్రవాహశక్తిచేత గంగానది మెల్లమెల్లగా సముద్రమునకు పోక తప్పదుగదా. అయితే మనకు కుటిలగతి కనబడినంత స్పష్టముగా నదియొక్క సహజమైన ప్రవాహశక్తి కనబడదు. బ్రిటిషు పార్లమెంటుపరిణామ ప్రవాహముకూడా అటువంటిదే. హెర్బర్ట్ స్పెన్సరు పండితుడు చెప్పినట్లు వ్యవహారములు తప్పుదారి తొక్కినప్పుడు సంస్కారము, అభివృద్ధి, ప్రజలకు హక్కులు, కలుగకపోవు. గత 150 సంవత్సరములపై ఇండియా చరిత్రలో రాజ్యాంగవ్యవస్థ ఎట్లున్నదో పక్షపాతబుద్ధితో కాక, సమబుద్ధిగల న్యాయాధ్యక్షునివలె చూడండి. కంపెనీవారికాలమునుండి నేటివరకు రాజ్యాంగ వ్యవస్థ ఎట్లు అభివృద్ధి చెందినదో, ఇట్టి సమదృష్టితోనే పరిశీలించవలెను. ఆ అభివృద్ధికి ప్రజాస్వామికమైన పరిపాలనమే పరమావధిగా ఉన్నది. బ్రిటిషు పరిపాలకుల నిరోధముచే గలిగిన వక్రగతులవల్లనే మన ఆందోళనములు పుట్టినవి. ఈ సంస్కారశాసనము ప్రకారము పార్లమెంటు మన దేశము పైగల సర్వాధికారములో కొంత విడిచిపెట్టి ప్రజాస్వామిక పరిపాలనావధికి పోయే మార్గమున మనలను ప్రవేశింపజేసినది.

16. ఇన్ని మాటలెందుకు? సంక్షేపముగా తెలియజేస్తాను. మన ఇండియాదేశముతో బ్రిటీషు పార్లమెంటు, "నేను మీ పార్లమెంటు నిర్మాణము ఆరంభించాను; కొద్ది కాలములో అది నావలెనే అభివృద్ధిచెందును" అని చెప్పుతున్నది.

10 వ అధ్యాయము.

శ్రీ చక్రవర్తిగారు.

అయిదవ జార్జి అనే నామధేయముగల శ్రీ చక్రవర్తిగారు బ్రిటిషు సామ్రాజ్యమున కంతటికిని పరమ మహేశ్వరులై ఉన్నారు. బ్రిటిషు పార్లమెంటువారు చేసిన సంస్కారశాసనమును అంగీకరించి, దానిపై తమ రాజముద్ర వేసినారు. మన దేశాభివృద్ధికి శ్రీ చక్రవర్తిగారు ఎంత కారకులయినారో, శ్రీవారియెడల ఇండియాదేశస్థులు ఎంత కృతజ్ఞత కలిగి ఉండవలెనో, చెప్పితేనేకాని ఈ సంస్కారశాసనముయొక్క లాభమును గూర్చి నేను వ్రాసిన గ్రంథము సంపూర్ణముకాదు.

2. ఇండియాదేశమందున్న అన్ని కక్షులవారు, అన్ని వర్గములవారు, అన్ని జాతులవారు, రాజ్యవ్యవహార విషయములలో ఎంత భిన్నాభిప్రాయులయినా, ఎంత కఠినముగాను, ఎంత తీవ్రముగాను రాజ్యాధికారుల గుణదోషములు విమర్శించీ అధిక్షేపించినా, శ్రీచక్రవర్తిగారియెడల మాత్రము అందరున్ను ఒక్కలాగున నమ్రులయి, భక్తితాత్పర్యములు కలిగి ఉన్నారు. 1918 వ సం॥లో బంగాళా గవర్నమెంటువారిచేత నియుక్తుడై రాజమాన్యులయిన బీచ్‌క్రాఫ్ట్ అనే పేరుగల కలకత్తా హైకోర్టు జడ్జిగారితో కలిసి, ఇండియా రక్షకశాసనము చొప్పున అపులో ఉన్న 806 గురు అరాజకతాప్రోత్సాహకుల నేరములను విమర్శించినప్పుడు, వారిలో ఒకరిని కారాగారమున నేను చూడవలసి వచ్చినది. దేశము అరాజకముగా చేయవలెనని ప్రయత్నించినవారి నాయకులలో అతడు అతిప్రబలమైనవాడు. వానిని నేనొకప్రశ్న అడిగినాను:—"1911 వ సం॥లో పట్టాభిషేకపు దర్బారు జరిగినప్పుడు శ్రీ చక్రవర్తిగారు మనదేశము విజయంచేసినారు; వారు వేంచేయక పూర్వమున్ను వారు మనదేశము విడిచిపెట్టినపిమ్మటనున్ను, అరాజకతాప్రోత్సాహకులు ఎన్నో నేరములు చేసినారు, బందిపోట్లు జరిగించినారు, పోలీసువారినికూడా చంపినారు; గాని, శ్రీవారు మనదేశమందున్నంతకాలము ఏ నేరములున్ను చేయలేదు. దీనికి కారణమేమి?" అని నేను అడిగితే, "చక్రవర్తిగారు ఇండియాకు వచ్చినప్పుడు నాయకులు తమ అనుచరులందరినిన్ని ఆజ్ఞాపించినారు: 'చక్రవర్తిగారు దేశములో ఉన్నంతకాలము అరాజకము చేయకూడద'ని; ఆ ఆజ్ఞచొప్పున అందరున్ను నడిచినారు" అని అతడు నాకు జవాబుచెప్పినాడు.

3. ఈ వృత్తాంతమునుబట్టి మనదేశములో అందరికిన్ని శ్రీ చక్రవర్తిగారియెడల గల రాజభక్తి ఎంత గాఢమైనదో, ఎంత స్థిరమైనదో, ఎంత పరిశుద్ధమైనదో స్పష్టముగా కనబడుతున్నది.

4. ఇందుకు కారణమేమి?

5. విక్టోరియా రాణీగారి ఏలుబడిమొదలు బ్రిటిషు సింహాసనముమీద కూర్చున్నవారందరున్ను ఇండియాదేశస్థులయెడల అనురాగముగలవారగుటచేత వారియెడల ప్రజలున్ను చాలా భక్తితాత్పర్యములు కలిగి ఉన్నారు. విక్టోరియా రాణీగారు ప్రకటించిన ఆజ్ఞాపత్రములోని మాటలు తల్లిమాటలవలె ప్రేమాస్పదమయినవి. అంతేకాక, ఆ ఆజ్ఞాపత్రము ప్రజలు స్వత్వస్వాతంత్ర్యశాసనముగా భావించుకొన్నారు. వారి

కొమాళ్లు శ్రీ ఎడ్వర్డుగారు యువరాజుగా ఉన్న కాలములో, 1875 సం॥ న ఇండియాకు దయచేసినపుడు, ప్రజల హృదయములు ఆకర్షించి అందరి అనురాగమునకు పాత్రులయినారు. శ్రీ విక్టోరియారాణీగారి పిమ్మట శ్రీ ఎడ్వర్డుగారు చక్రవర్తులయి శాంతమూర్తి అనే ప్రఖ్యాతి పొందినారు. తర్వాత వారి కొమాళ్లున్ను అప్పుడు యువరాజుగారున్ను అయిన మన జార్జి చక్రవర్తిగారు 1905 వ సం॥లో తండ్రిగారి ఆజ్ఞచొప్పున ఇండియాకు దయచేసినప్పుడు, ప్రజలకందరికి సానుభూతి సందేశమంపినందున సర్వజనప్రియులైనారు. శ్రీవారు 1910 వ సం॥లో చక్రవర్తులయిన పిమ్మట మరుచటి సంవత్సరము ఢిల్లీలో జరిగిన పట్టాభిషేకపు దర్బారుకు విజయంచేసినప్పుడు, పోలీసు పరివారమును వెంటబెట్టుకోకుండా ఒక్కరే ప్రజలతో కలసి, అరమర అభ్యంతరము ఏమీలేకుండా, తిరిగినందున ప్రజలకు వారియెడల గల భక్తి మరింత వృద్ధపడినది. శ్రీవారు ప్రజలకందరికిన్ని క్షేమాభివృద్ధి కలుగునన్న ఆశ పుట్టించి స్వదేశమునకు తిరిగీ దయచేసినారు.

6. తర్వాత, ఈ సంస్కారశాసనమునకు అనుజ్ఞ దయచేసి దానివల్ల ఏర్పడ్డ ఈ నవీనయుగములో ఇండియాదేశమందున్న జనులందరున్ను—రాజులు, ప్రజలు—కలిసి విశ్వాసముతో ఒకరికొకరు తోడుపడవలసినదని ప్రోత్సాహము పుట్టిస్తూ, గత డిసెంబరు నెలలో స్వముఖాజ్ఞ శ్రీవారు ప్రకటింపజేసినారు.

7. బ్రిటిషు రాజ్యాధిపత్యము నియతప్రభుత్వమేకాని స్వతంత్రమైనదికాదు; అనగా ఆ దేశములో రాజులు నిరంకుశప్రభువులవలె తమ ఇష్టముచొప్పున నిరాటంకముగా అధికారము చెలాయించుటకు వీలులేదు; రాజ్యవ్యవస్థచొప్పుననే పరిపాలించవలెను. రాజ్యవ్యవస్థ చొప్పున చేసిన శాసనములకు తాము అధీనులుకాకున్నా, కట్టుబాట్లుమీర వల్లకాదు.

8. బ్రిటిషు రాజ్యవ్యవస్థ ఇట్లుండుటచేత, "బ్రిటిషు రాజులు పేరుకుమాత్రమే సర్వాధికార్లుగాని వాస్తవముగా కారు; బ్రిటిషు సామ్రాజ్యమునకు సంజ్ఞారూపముగా మాత్రము రాజు అనే పేరుగలవారొకరున్నారు; అంతేకాని, 'రాజాధికారము ఈశ్వరాధికారము' అనే న్యాయము బ్రిటిషు రాజుకు వర్తించదు"; అని కొందరనుకొంటారు.

9. ఈలాగు అనుకోవడము పొరబాటు. "రాజాధికారము ఈశ్వరాధికారము" అనే న్యాయము వాస్తవముగాను, పూర్వోత్తరసంబంధము పట్టి ఆలోచించి, చూస్తే బ్రిటిషు రాజ్యాధిపతివంటి నియతప్రభుత్వముగల రాజువిషయములోనే వర్తిస్తుంది; గాని, స్వేచ్ఛాశక్తి చొప్పున, నియమములేకుండా, వ్యవహరించే నిరంకుశప్రభువు విషయములో పట్టనేపట్టదు.

10. ఈ విషయము సవిస్తరముగా తెలియజేస్తాను. "రాజాధికారము ఈశ్వరాధికారము" అంటే, భూలోకమందు ఈశ్వరునికి ప్రతినిధిగా రాజు ఉన్నాడు; ఈశ్వరునికి మనుష్యులనుపై గల ప్రభుత్వమే రాజుకు తన స్వంతప్రజలపైనున్నది, అని గదా తాత్పర్యము. ఈశ్వరుడు మనుష్యులను ఎట్లు పరిపాలించును? ఎప్పుడు ఏ బుద్ధి పుట్టితే, అప్పుడు ఆ బుద్ధిచొప్పున చపలునివలె ఈశ్వరుడు వ్యవహరించడు. తాను ఏర్పరిచిన నియమముల చొప్పుననే తాను ఆచరిస్తాడు. ఈశ్వరుడు ఏర్పరిచిన శాసనములకు ప్రకృతిధర్మములని, ఆరోగ్యధర్మములని, నీతిధర్మములని పేరు పెట్టినారు. ఈశ్వరుడు సర్వశక్తుడయినా, మనుష్యుల మేలుకోసము తన ప్రభుత్వము ఇట్టి నియమములచేత నియతముగా చేసుకొన్నాడు. నియమము లేకుండా సర్వశక్తుడై పరిపాలించే దేవుడు చపలుడైన చక్రవర్తివలె క్రూరుడవుతాడు. అయితే, దేవుడు చప

లుడుకాడు ; క్రూరుడైన చక్రవర్తి కాడు; నియమము చొప్పున శాసిస్తూ అందరి యెడల ప్రేమకలిగి ఉపచరిస్తాడు. గనుక, ఈశ్వరుడు జనులయెడల ప్రేమచేత వారికి ఉపచరించేలాగున తన అధికారము వ్యవస్థచేత నియతము చేసుకొన్నాడు. అందుచేత ఈశ్వరప్రభుత్వము నియతమైనదే.

11. ఇంతేకాక, ఈశ్వరశాసనములను మన్నించి, వాటిచొప్పున నడుస్తూ మనుష్యులు ఏలాగున మోక్షము పొందగలరో ప్రత్యక్షదృష్టాంతముచేత బోధించుటకు ఈశ్వరుడే మానవరూపమెత్తినాడని క్రీస్తుమతమున్ను హిందూమతమున్ను బోధించుచున్నవి. ఈ రెండు మతములవారికిన్ని ఈశ్వరావతారముగురించి ఇట్టి అభిప్రాయమే కలదు. ఈశ్వరుడు మనుష్యుడయినాడు; మనుష్యులతో కలసి ఉన్నాడు. వారి మేలుకోసము కష్టపడ్డాడు ; వారికోసము దుఃఖ మనుభవించినాడు. పరమేశ్వరుడు దాసానుదాసుడైనందున రాజాధిరాజు అయినాడు. ఈశ్వరుడు తన మానుషజీవము చేత సేవించడమే పాలించడ మని మనుష్యులకు బోధించినాడు. గనుక, ఆధిపత్యమనగా సేవ. ఈశ్వరుడు మనుష్యుడయి మనుష్యుల నియమము తాను వహించి, మానుషము దైవమెట్లగునో బోధించినాడు. దేవుడు తన శాసనములకు తాను కట్టుబడుతూ మనుష్యులయెడల దయకూడా కలవాడయి పరిపాలిస్తూఉన్నాడని దేవుడే మనకు తెలియజేసినాడు.

12. కనుక, "రాజాధికారము ఈశ్వరాధికారము" అంటే, రాజుయొక్క అధికారము ఈశ్వరుని అధికారమువలె శాసనములచేత నియతమైనది ; ప్రజలయెడల గల దయ, ప్రేమ, ఉపకారబుద్ధి మొదలయినవాటిచేత మానుషమైనది ; అని తాత్పర్యము.

13. ప్రాచీన క్రైస్తవ గురువులున్ను, హిందూదేశపు ప్రాచీన మతాచార్యులున్ను ఈ అర్థమందే రాజాధికారము ఈశ్వరాధికారమనే న్యాయము ఈ లోకములోని భూపతుల విషయమందు చెప్పి ఉన్నారు. అయితే, రానురాను క్రూరప్రభువులు చపలులై, నియమము ఏమీ లేకుండా రాజ్యవ్యవస్థమీరి, ఇష్టమువచ్చినట్లు వ్యవహరించి, స్వప్రయోజనపరులై, ఈ న్యాయమునకు అపార్థము కల్పించినారు. యూరపు ఖండమందు అనేక రాజ్యములు ఇట్టి అపార్థకల్పనచేతనే సమూలముగా నశించినవి, అని మన మెరుగుదుము. ఐతే, బ్రిటిషు రాజ్యము నిల్చిఉన్నది. నిల్చిఉండడమే కాదు ; బ్రిటిషు ప్రజలకు స్వయంపరిపాలనాధికారవాంఛ పెరిగిన కొలదీ, బ్రిటిషు రాజ్యమందు అనురాగము వృద్ధిపొందుతున్నది. అందుకు కారణము రాజు ప్రజలతో మిళితము కావడమే.

14. "రాజాధికారము ఈశ్వరాధికారము" అనే న్యాయమునకు కల్పించిన అపార్థము పోయి, యథార్థము తిరిగీ ప్రచారములోనికి రావడము బ్రిటిషు రాజ్యవ్యవస్థయొక్క ప్రభావముచేతనే. బ్రిటిషువారే ప్రజాస్వాతంత్ర్యమును నిలబెట్టి వృద్ధిపొందించుటకు మొదటనుండిన్ని పాటుపడినవారు. ప్రజాస్వాతంత్ర్యము ఏలాగు విపత్తులనుండి తప్పించుకొని పరంపరాభివృద్ధి పొందినదో బ్రిటిషువారి చరిత్రయందే విశదము కాగలదని ప్రఖ్యాతమై ఉన్నది. బ్రిటిషుదేశ చరిత్రే ఇతర దేశములకు ఆదర్శమైనది. బ్రిటిషుదేశమే పార్లమెంటులన్నిటికి పుట్టినిల్లు. రాజాధికారము ఈశ్వరాధికారమనే న్యాయముచొప్పున నియమిత ప్రభుత్వము స్థిరపరిచిన ప్రఖ్యాతికూడా బ్రిటిషువారిదే. మన చక్రవర్తిగారయిన అయిదవ జార్జి రాజుగారు రాజ్యవ్యవస్థకు లోబడి, శాసనముల చొప్పున పరిపాలిస్తూ, ప్రజలయెడల అనురాగమున్ను, ప్రజలతో ఐకమత్యమున్ను

కలిగి ఉండడముచేతనే ప్రజల హృదయపీఠము అధివసించి మహారాజాధిరాజ రాజపరమేశ్వరులయి వెలసి ఉన్నారు. వారు తమ ప్రజలకు చన విచ్చి, వారితో కలిసి మెలసి తిరుగుదురు. నిరుపేదలు నివసించే మురికివీధులు, గుడిసెలు చూడబోవుదురు. ప్రజల కుపకారము చేయడములో విసుగు లేకుండా ఎంత కష్టమయినా సహించగలరు. అట్టే ఎందుకు వర్ణించి చెప్పడము ? ఒక్క మాటలో చెప్పుతాను : తాము ప్రజలకు చేసే సేవచేతనే ప్రభువులయినారు ; ప్రభువు అనగా ప్రజలకు ఉపకారము చేసేవారిలో అధికముగా ఉపచారము చేసేవాడు అని వారి అభిప్రాయము. శ్రీవారి పెద్దకొమార్లు ప్రిన్స్ ఆవ్ వేల్జ్‌గారు కొలదికాలములోనే సంస్కారశాసనము మనదేశమందు ప్రతిష్ఠించుటకు విజయం చేస్తారు. శ్రీ యువరాజుగారు కూడా తమ తండ్రిగారి నీతినే అవలంబించినారు. ఆ నీతి మానుష మయినది గనుకనే దివ్యమైనది కూడాను. ఒకరియెడల ఒకరు దయగలిగి ఉండవలెనని, కోరికలు నెరవేరుననే ఆశ అందరికి ఉండవలెనని ఒకరికొకరు తోడుపడవలెనని, జనులందరున్ను ఐకమత్యము గలిగి మిత్రులవలె ప్రవర్తించవలెనని, తమ ఆచరణచేతనే శ్రీ చక్రవర్తిగారు మానుషధర్మము లుపదేశించి ప్రజలకు తమ సందేశము పంపి ఉన్నారు. ఈ కొత్త సంస్కారశాసన విషయమున మన మేమిచేయవలసి ఉన్నదో అదికూడా శ్రీ చక్రవర్తిగారి సందేశమే ఆదేశిస్తున్నది. దానిని గురించి ఈ కడపటి అధ్యాయములో చెప్పుతాను.

11 వ అధ్యాయము.

ప్రతినిధులను ఎంచే ఇలెక్టర్ల విహితధర్మములు.

ఇండియా దేశమందు ప్రజాస్వామికప్రభుత్వము క్రమక్రమముగా సిద్ధించేటందుకు రాజ్యవ్యవహారవ్యవస్థలో వచ్చే సంవత్సరము మొదలుకొని చేయబోయే సంస్కారములు ఏవంటే, సంక్షేపముగా పేర్కొంటున్నాను :—

2. (1) లోకల్ బోర్డులలోను, మ్యునిసిపాలిటీలలోను, సంపూర్ణమైన ప్రజాస్వామికప్రభుత్వము ; (2) మండల రాజ్యవ్యవహారమందు కొంత ప్రజాస్వామికప్రభుత్వము ; (3) ఇండియా సామ్రాజ్యవ్యవహారమందు ప్రజలకు ఇప్పటికన్న శ్రేష్ఠమైన ప్రాతినిధ్యము, ఇప్పటికన్న ఎక్కువగా అధికారస్థుల వ్యవహారమును విమర్శించే అధికారము ప్రజాప్రతినిధులకు కలుగచేయడము.

3. ఈ కొత్త అధికారము ప్రజలున్ను ప్రతినిధులున్ను జాగ్రత్తగాను, కార్యసిద్ధి అయ్యేటట్టుగాను, నేర్పుతో నిర్వహిస్తే, ప్రజలకు క్షేమము కలగడమేకాక ప్రజాస్వామిక పరిపాలనమందు ఇంతకన్న ఎక్కువ అధికారము దేశస్థులు పొందడము సులభమవుతుంది.

4. కొత్తసంస్కారములు సఫలమగుటకు "వోట్లు" గల "ఇలెక్టర్లు" ఏమి చేయవలెనో ఆలోచింతాము.

5. (1) కొత్తసభలలో మెంబరుగా ఉండదగినవానిని ఎంచుకొనుటకుగాను "వోటు" పొందిన ప్రతివాడున్ను తన దేశముయొక్క మేలుకోసము తన ప్రతినిధిని ఎంచుకొనే హక్కు కలిగినట్టు భావించి, ఉపయోగించవలెను ; స్వప్రయోజనముకోసము గాని, స్వజాతిలాభముకోసముగాని, స్వమతాభివృద్ధికోసముగాని, ఉపయోగించకూడదు. "వోటు" ఇల్లడగా ఉంచిన సొత్తువంటిది. దానిని దుర్వినియోగము చేయకూడదు. ప్రజలకు (అనగా రయితులకు) రాజ్యవ్యవహారము క్షేమకరము అయ్యేటట్లు చేయుటకోసము ఈ "వోటు" వాడవలెను.

6. (2) "వోటు" అట్టిదని భావించి, శ్రద్ధతో దానిని సార్థకపర్చవలెను ; ఉపేక్షించి నిరర్థకము చేయకూడదు. ప్రతినిధులను ఎంచుకోవడము (ఇలెక్షన్) జరుగుతున్నప్పుడు, "నాపని మానుకొని, ఇల్లు విడిచిపెట్టి, ఎందుకు శ్రమపడి పోవలెను ? వోటివ్వడము మాత్రనకు అంత దూరము (పోలింగ్-బూత్) కచేరికి ఎందుకు వెళ్లవలెను ? దానివల్ల నాకేమి లాభము ?" అని ఎవరున్ను అనుకోకూడదు. ఈలాగు అనుకొని తన "వోటు" వినియోగించక, ఉపేక్ష చేస్తే, ద్రోహముచేసినట్టే. అట్టివాడు దేశమును మోసపుచ్చినవాడవుతాడు ; గవర్నమెంటువారు పొరపాట్లుచేసినా, ప్రజలకు సౌఖ్యము కలుగక అతృప్తికలిగినా, అందుకు అతడు పూచీదారుడు అవుతాడు.

7. (3) ఎవరిని ప్రతినిధిగా ఎంచుట మంచిదని ఇలెక్టరుకు తోస్తుందో, వారు ఇలెక్షన్‌లో నెగ్గగలవారు కారని నమ్ముటకు తగిన కారణమున్నా, వారికే ఇలెక్టరు తన "వోటు" ఇవ్వవలెను ; గాని మానకూడదు. "వోటు" వినియోగించడముచేత రాజ్యవ్యవహారమందు వోటరుకు ఉత్సాహము నిల్చి ఉంటుంది ; అందువల్ల అతనికి రాజ్యవ్యవహారమందు వివేకము కలుగుతుంది. ఆ వివేకము దేశోపకారమయిన పనియందు ఉపయోగిస్తుంది. హెన్రి సిడ్జ్విక్ అనే ఒక గొప్ప ఆంగ్లేయుడు చేసినట్టే, ఇలెక్టరు చేయవలెను. ఆయన ఆరోగ్యముకోసము స్వదేశము విడిచి, స్విడ్జర్‌లాండు దేశమునకు పోయి, అక్కడ ఉన్నకాలమందు, ఇంగ్లండులో ఇలెక్షన్ జరుగుతుందని ప్రకటనమైనది. వెంటనే ఆయన బయలుదేరి పోయి, తాను ఎంచదలచినవానికి (కాండిడేటుకు) తన వోటు ఇవ్వవలెనని నిశ్చయించుకొన్నాడు. ఇంగ్లండునుండి వాని మిత్రులు వ్రాసిన జాబులవల్ల ఆ కాండిడేటు ఇలెక్షన్‌లో నెగ్గగలడని ఆశపడుటకు అవకాశము చాలా తక్కువగా ఉన్నదని తెలిసినది. అంతే కాక, ఆ కాండిడేటు ఏ పార్టీలో చేరి ఉన్నాడో ఆ పార్టీవారికి పరాజయము తప్పదని కూడా మిత్రులు వ్రాసినారు. అయినా, సిడ్జ్విక్‌గారు తన దేహాయాసము పాటించకుండా ఇంగ్లండుకు వెళ్లి, తన వోటు తాను అనుకొన్నవానికే ఇచ్చినారు. "నిరర్థకముగా ఎందుకు ఇంత శ్రమ పడ్డారు ? మీ కాండిడేటుకుగాని, అతని పార్టీకిగాని, మీవోటు సాయము చేయలేదు," అని సిడ్జ్విక్‌గారిని మిత్రులు అడిగితే, "నాదేశమునకు మేలు కలుగునట్లుగా నా 'వోటు' వినియోగించుట నాకు విహితధర్మము ; నాకు యుక్తమని తోచినట్లు దానిని నేను నెరవేర్చకతప్పదు ; కార్యము ఫలించినా, ఫలించకపోయినా, నాపని నేను చేయవలెను." అని ఆయన జవాబు చెప్పినారు.

8. (4) ప్రతి ఇలెక్టరున్ను (ఎవరయినా సరే, ఎట్టిస్థితిలో ఉన్నా సరే) ప్రతినిధిని ఎంచుకోవడము జరిగేటప్పుడు, తన వోటు లెక్కలో వేయించుకోవడమేకాక, తగినవానిని ఎంచి, తన "వోటు" అతనికివ్వవలెను. ఎట్టివాడు తగిన కాండిడేటో విచారింతాము. ఇలెక్షన్ అయినప్పుడు అనేకమంది తమకు "వోట్లు" ఇమ్మని అడుగుతారు. వారిలో ఎవరు తగినవారో "ఇలెక్టరు" తెలుసుకోవడము సులభము కాదు. కావలసిన "వోట్లు" సంపాదించి నెగ్గుటకోసము ఇలెక్టరును "కాండిడేట్లు" భ్రమపెట్టడము సంభవిస్తూనే ఉంటుంది. "ఇలెక్టరు" పేదవాడో, వ్యవహారరహస్యములు తెలియనివాడో, అయినప్పుడు సొమ్ము ఇస్తామనిగాని, ఉపకారము చేస్తామనిగాని, ఆశపెట్టి వాని వోటు తనకు ఇమ్మని అడుగుతారు. "ఇలెక్టరు" లంచాలకు లొంగనివాడయితే, కాండిడేటు వానిని స్తోత్రాలచేత పొంగవేసి, తాను సభలో మెంబరయితే, దేశమునకు ఎంతో ఉపకారము చేస్తానని, తాను స్వతంత్రుడనని, గవర్నమెంటు ఉద్యోగస్థులను 'త్రాహిత్రాహి' అనిపించి లొంగదీస్తానని, ప్రజలపైనున్న పన్నులభారము తగ్గిస్తానని, ఈలాగు ఏమేమో ప్రగల్భవాక్యములు పలుకుతారు. కొందరు కాండిడేట్లు అధికారస్థులను ఆశ్రయించి, ముఖస్తుతులు చేసి, లాభము పొందగోరుతారు. ఈ రెండు తరహాల కాండిడేట్లున్ను ఇలెక్టర్లను మోసపుచ్చువారే ; గనుక, ఇలెక్టరు జాగ్రత్తగా ఉండవలెను. మంచి శీలముగలవానికే ఇలెక్టరు తన వోటు ఇవ్వవలెను. "ముఖస్తుతిచేసే వారిని, లంచా లిచ్చేవారిని తన దగ్గరకు రానీయకూడదు. తియ్యనిమాటలు చెప్పేవారు సాధారణముగా అబద్ధాలాడుతారు. గనుక, వారి మాటలు నమ్మకూడదు. ఎవరు బుద్ధిమంతులో, ఎవరు వివేకముగలవారో, ఎవరికి ప్రజలయందు వాస్తవమయిన అనురాగము కలదో, ఎవరు ఈ గుణములచేత దేశసేవ చేయుటకు సమర్థులగుదురో, అట్టి సేవ చేయుటకు అవకాశమున్నంతకాలము ఒక పార్టీయందుగాని, ఒక జాతియందుగాని, పక్షపాతము

వహించక, మొత్తముమీద జనసామాన్యమునకు మేలు కలిగేటట్లు ఎవరు స్వతంత్ర ప్రతినిధులుగా ఉండగలవారని నమ్మవచ్చునో, వారినే ఎంచుకోవలెను. ఇంగ్లండులోను, రష్యాలోను ఫ్రాన్సులోను నీతిజ్ఞులకివ్వవలసిన అధికారము స్తోత్రాలుచేసే సముఖస్థులకు ఇచ్చి, రాజులు చెడిపోయినారు. ప్రజలుకూడా ఆ రాజులవలెనే ఆ చరిస్తే, ఆ గతి సంభవించక తప్పదు" అని, "లండన్ టైమ్జ్" అనే వార్తాపత్రికచేసిన హితోపదేశము ఇలెక్టరు గురియందుంచుకొని దాని ప్రకారము నడవవలెను.

9. (5) లోకములోని అన్ని వ్యవహారములవలెనే రాజ్యవ్యవహారమున్ను, దానితో సంబంధముగలవారందరికీ కాకపోయినా, చాలామందికి సమ్మతముగా ఉండేటట్లు రాజీమీద పరిష్కారము కావలసినదని ప్రతి ఇలెక్టరున్ను జ్ఞప్తియందుంచుకోవలెను. దేశములో అనేకజాతులు, అనేకమతములు, అనేకవృత్తులు, ఉన్నప్పుడు ఒకరికి లాభకరమయిన పని ఇంకొకరికి నష్టము కలుగజేసేదిగా ఉండవచ్చును; గనుక, విరుద్ధవిషయములలో వైరుధ్యము తగ్గి, ఐక్యము అధిక మయ్యేటట్లు పొత్తుపర్చి, ప్రజలను పరిపాలించడమే రాజ్యపరిపాలనము చేయడము. సర్వజనులకు మేలు కలిగేటట్లు స్వమతాభిమానము యథోచితముగా విడిచి ప్రవర్తిస్తే, పరస్పరవిరుద్ధములయిన విషయములకు ఐక్యము కలుగవచ్చును. ప్రజాస్వామికప్రభుత్వవాది అయిన ఒక ఇంగ్లీషు నీతివేత్త ఈ విషయమునుగురించి వ్రాస్తూ, "వివేకముతో రాజ్యవ్యవహారము చేసేవారందరున్ను పరధర్మముల యెడల భక్తిగలిగి, స్వాభిమానము విడిచి, సమాధానపడక తప్పదు. అయితే, మానవ స్వభావమునకున్ను, లోకప్రవృత్తికిన్ని, అనుకూలించినంతమట్టుకే ఈ పరధర్మభక్తిగాని ఈ సమాధానముగాని అవలంబించవలెను" అనిచెప్పినాడు.

10. (6) గనుక ఇలెక్టర్లు ఒక కాండిడేటును ఎంచుకొని, తమ ప్రతినిధిగా సభలోనికి పంపిన తర్వాత ఊరకుండక, అతడు సభలో ఏలాగున పని చేస్తున్నాడో చూస్తూ ఉండవలెను. గవర్నమెంటువారి దోషములు ప్రకటిస్తూ ఊరకున్నాడో, లేక తగిన ఉపాయములు చెప్పి కార్యసిద్ధికి తోడుపడుతున్నాడో; వట్టి విమర్శాభిలాషచేత విమర్శిస్తున్నాడో, లేక, వాస్తవముగా విషయవిచారణచేసి, ప్రజల స్థితి గ్రహించి, వారికి కావలసినవి సంపాదించుటకు పాటుపడుతున్నాడో; వట్టి వాక్చాటవము చూపి అధికారస్థులను, ప్రతిపక్షులను, దూషిస్తున్నాడో; లేక, లెస్సగా ఆలోచించి, శాంతముగాను, స్పష్టముగాను గుణదోషవిమర్శచేసి తగిన ఉపాయములు ప్రతిపాదిస్తున్నాడో; ప్రజల మెప్పు సంపాదించుటకున్ను, ప్రజలపక్షమువాడని తోచేటట్లు చేయుటకున్ను, గవర్నమెంటువారిని తరుచుగా అడ్డుతూ ఉంటాడో; లేక, వాస్తవమైన విషయములను ఆధారముగా చేసుకొని, నిర్దుష్టముగా చర్చించి, గవర్నమెంటువారిని యథోచితముగా నిరోధిస్తున్నాడో; పరిశీలించవలసిన పూచీ ఇలెక్టర్లకున్నది.

11. (7) సంస్కారశాసనమువల్ల కలిగిన గొప్పలాభ మేమిటంటే, ఇండియా దేశపు ప్రజలు ఇలెక్టర్లుకావడముచేత ప్రభుత్వమువారిపైని అధికారముగలవారయినారు. ప్రజాస్వామిక రాజ్యమనే వ్యవస్థలో మొదటి దశ ఈ శాసనమువల్ల ఆరంభమైనది. ప్రజాస్వామిక రాజ్యమంటే, ప్రజలే ప్రభువులుగా ఉండి చేసే రాజ్యము అని అర్థము; అయితే, ప్రజలు తమ ప్రతినిధులుగా ఎవరిని ఎంచుకొంటారో వారే వాస్తవముగా ప్రభుత్వము చేస్తారు. ప్రజలంటే, ధనవంతులయిన భూస్వాములు, గొప్పవర్తకులు, బాగా చదువుకొన్నవారు, బ్రాహ్మణులు మాత్రమే కాదు; వీరితోపాటు, పల్లెటూళ్లలో ఉండే రయితులు, పట్టణములలో పనిచేసుకొని జీవించేవాళ్లు, అధమ జాతులవాళ్లుకూడా ప్రజలే. ఈ అధమజాతులవాళ్లను ఇదివరకు దేశములో ఎవరున్ను సరకు చేయలేదు. రాజ్యవ్యవహార

విషయములలోగాని సాంఘిక విషయములలోగాని వాళ్లకు ఏమీ అస్పదము లేదు; ఇట్టి దిక్కుమాలినవాళ్లనుకూడా ఇలెక్టర్లనుచేసి, వాళ్లకుకూడా పరిపాలనాధికారము కలుగజేయడమే వాస్తవముగా ఈ శాసనమువల్ల కలిగిన మేలు. గనుక ఈ శాసనము నిజముగా ప్రజలకు ప్రభుత్వ మిచ్చిన శాసన మనిపించుకొంటున్నది. అందుచేత, వోటిచ్చే అధికారము జాగ్రత్తగా వినియోగించవలెను. నీచులని లోకములో ఇదివరకు అగౌరవము పొందుతున్న దిగువజాతులవాళ్లు మరింత జాగ్రత్తగా వోటిచ్చే అధికారము ఉపయోగించుకోవలెను. కపటప్రవర్తనగలవారికి, డాంబికులకు వట్టి ఇచ్చకాలాడేవారికి, పైకిమంచివాడన్న పేరు మాత్రము సంపాదించవలెనని దేవులాడే మోసగాళ్లకు, తమ వోటిచ్చి వ్యర్థము చేసుకోకూడదు. పూర్వకాలమందు గ్రీసు దేశములోను, రోములోను, ప్రజాస్వామికప్రభుత్వముండేది. ప్రజలు ఎంచుకొన్న ప్రతినిధులే ప్రభుత్వము చేసేవారు. అయితే, అట్టి కట్టుబాటు నిలవలేదు. ప్రజల ఊసులేకుండా, తమ ఇష్టము వచ్చినట్టు ఏలే బలవంతులు రాజ్యాధికారమంతా తమ స్వాధీనము చేసుకొన్నారు. అందుకు కారణము ప్రజలు తమ వోటు తగినవారికి ఇవ్వక, మోసగాళ్లకు ఇవ్వడమే. రాజ్యాధికారమందు అత్యాశగలవాళ్లు ఇచ్చకాలాడి, ప్రజలను మోసపుచ్చి, వారినుండి అధికారము సంపాదించి, తర్వాత ప్రజలను అణగద్రొక్కి, స్వతంత్రులై, తమ ఇష్టమువచ్చినట్టు అదుపు ఆజ్ఞ లేకుండా వ్యవహరించి, నిరంకుశప్రభువులైనారు. గ్రీసులోను రోములోను జరిగినట్టు ఇండియాలో జరగకుండా జాగ్రత్తపడవలెను. ప్రజల హక్కులకు, ప్రజల స్వాతంత్ర్యమునకు, ప్రజల క్షేమమునకు, భంగము కలుగకుండా కాపాడి, వాటిని బలపర్చవలెననే ఉద్దేశముతో ప్రజల పక్షము సమర్థిస్తూ, ప్రజల తరఫున నడుముకట్టుకొని నిలబడవలెననే వాంఛ కాండిడేటుకు యోగ్యమైనదే. అట్టివాడు వాస్తవముగా ప్రజల హితమును కోరుతూ, ప్రజలు తప్పుచేసినారని తనకు తోచినప్పుడు, స్పష్టముగా ఆ తప్పు చూపించడమునకు జంకనివాడయితే, ప్రజల అనురాగమునకు తగినవాడవుతాడు. అట్టివానిని ప్రజాబంధువు అనుట యుక్తము. అతడు సత్యవాదిగా ఉండవలెను. తనకు యథార్థమని తోచినది, ధైర్యముతో సమర్థించుకోవలెను, గాని, దానిని దాచిపెట్టి, ఇలెక్టర్లను మెప్పించి, వారి వోటు పొంది, మోసముచేత అధికారము సంపాదించుటకోసము అబద్ధము లాడకూడదు. ఒక దృష్టాంతము చూపిస్తాను: దానినిబట్టి ఇండియాదేశమందు ఇలెక్టర్లు ఎట్లుప్రవర్తించవలెనో నేర్చుకొందురుగాక: అరవై యేండ్లక్రిందట జాన్ స్టూవర్ట్ మిల్ అనే ఆయన బ్రిటిషు పార్లమెంటులో మెంబరుగా ఉండవలెనని కోరి కాండిడేటు అయినాడు. అతడు ఇంగ్లండులోని బీదలకు మేలుచేయవలెనని కోరికగలవాడు; దీనబాంధవుడు; ఆయన వ్రాసిన గ్రంథములలోను, నోటను చెప్పిన వచనములలోను, ప్రజలపక్షముగా, అందులో ముఖ్యముగా పనివాళ్ల పక్షముగా, ప్రజలకు హితమయినదానిని సమర్థించినాడు. అయితే, ఆయన సత్యవాదిగనుకను, వోటుకోసము ఇచ్చకాలాడవలసినవాడు కాడుగనుకను, పనివాళ్ల దోషములు స్పష్టముగా తెలియజేసినాడు. ఒకమారు, ఒక ప్రసంగములో, "పనివాళ్లు కల్లరులని," అందరి యెదుటను బహిరంగముగా అతడు చెప్పినందున, వాళ్లకు అతనిమీద కోపము వచ్చినది. ప్రజాసంఘమునకు వెళ్లి తనకు వోటు ఇమ్మని ఆయన కోరినప్పుడు, "ప్రజలు కల్లరులని" మీరు అని ఉన్నారట; నిజమా? అలాగు మీరు అని ఉంటే, మా వోట్లు ఇమ్మని ఎందుకు అడుగుతారు?" అని, ప్రజాసంఘమువారు కోపముతో అన్నారు. మిల్లుగారు నిజము చెప్పుటకు భయపడవలసినవారు కారు; అందుచేత, స్పష్టముగా, "అవును, 'పనివాళ్లు కల్లరుల'ని నేను అన్నాను. ఇప్పుడున్ను నాకు అలాగే తోస్తున్నది. మీ వోట్లకోసము ముఖస్తుతి చేయను. మీ హితమును కోరేవా

డను; గాని, ఇచ్ఛకాలాడేవాడనుకాను. గనుక మీరు తప్పుచేసినప్పుడు తప్పుచూపించినాను.” అని జవాబు చెప్పినారు. నిష్కపటముగా ఆయన చెప్పిన ప్రత్యుత్తరము విని, ధనివాళ్లు సంతోషించి, ఆయననే పార్లమెంటులో తమ ప్రతినిధిగా ఎంచుకొన్నారు. ప్రజలకు కోపము వస్తుందేమో అని భయపడేవాడు రాజ్యాధికారము చక్కగా చెలాయించలేడు; అని అర్థమిచ్చే ఘనమైన సామెత ఒకటి కలదు. కొత్త సంస్కారము సఫలము కావలెననిన్ని, సంపూర్ణ ప్రజాస్వామిక ప్రభుత్వము శీఘ్రముగా దేశమునకు లభించవలెననిన్ని కోరికగలవారయితే, ఎలక్టర్లు ఏమి చేయవలెనో ఏమి చేయకూడదో ఇప్పుడు చెప్పిన వృత్తాంతమువల్ల తెలుసుకొని ఆచరించవలెను.

MADRAS: PRINTED BY THE SUPERINTENDENT, GOVERNMENT PRESS.

END OF
TITLE